జై శ్రీమన్నారాయణ!

శ్రీమతే రామానుజాయ నమః

## సమతామూర్తి - స్ఫూర్తిప్రదాత

# శ్రీభగవద్రామానుజులు



**పరమహంస వరివ్రాజకులు**

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి**

**మంగళాశాసనములతో...**


ప్రచురణ :

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్

సీతానగరం, గుంటూరు జిల్లా - 522501.

సమతామూర్తి - స్ఫూర్తిప్రదాత

శ్రీభగవద్రామానుజులు

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్**


ప్రథమ ముద్రణ 2016, దీపావళి

ప్రతులు- 10000


**శ్రీరామానుజసహస్రాబ్ది 2017 మరియు**
**శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారి**
**60వ తిరునక్షత్రమహోత్సవం**


ప్రతులకు :

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్,**
**సీతానగరం-522 501**
**గుంటూరు జిల్లా, ఆం.ప్ర.**
ఫోన్ : 08645 272353

**జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమి**
శ్రీరాంనగర్, పాలమాకుల
శంషాబాద్, రంగారెడ్డిజిల్లా.
ఫోన్ : 95535 49971/72

**శ్రీరామానుజవాణి**
11-49-136
శివాలయం వీధి,
విజయవాడ - 1
ఫోన్: 0866 2420 820

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్,**
గగన్‌మహల్‌కాలనీ,
దోమల్‌గూడ, హైదరాబాద్.
ఫోన్ : 040 23224426

**Visit Us**

jetsitanagaram@yahoo.com www.chinnajeeyar.org

**DTP :** పరిశోధనాలయం, **ముద్రణ :** శ్రీమాన్ ప్రింటర్స్& ప్రోసెసర్స్, సీతానగరం.

శ్రీమన్నారాయణ రామానుజ యతిభ్యో నమః



శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు



పరమహంస పరివ్రాజకాచార్యులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి

మంగళాశాసనములతో...!

శ్రీమతే రామానుజాయ నమః

# సమతామూర్తి - స్ఫూర్తిప్రదాత, భగవద్రామానుజులు

## ప్రవేశం

**యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ-**
**వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।**
**అస్మద్గురోర్భగవతోఽస్య దయైకసింధోః**
**రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥**

"సంపదయే గౌరవ కారణమై ధనార్జనయే విశేషధర్మమై, మోహమే స్త్రీ, పురుష సంబంధ సూత్రమై, అసత్యమే జీవన వ్యవహార విజయమార్గమై బాహ్యోపాధి వర్గ ఆశ్రయమే ఆత్మకు ప్రయోజనమై జీవించే సమాజం శీఘ్రంగా నశిస్తుంది".

పరాశర మహర్షి శ్రీ విష్ణు పురాణం ద్వారా మానవ జాతికి చేసిన హెచ్చరిక ఇది. దేహమే సర్వమని భావించి, దాని పోషణ, రక్షణ, సుఖము లక్ష్యంగా ఆటవిక మార్గంలో జీవించే మానవుల దృష్టిలో "బలమే న్యాయం".

ఈ ఆటవిక న్యాయం ప్రాచీన, మధ్యయుగాలకు భిన్నంగా ఈ యుగంలో తనరూపు రేఖలు మార్చుకొని మానవాళిని కబళిస్తున్నది. "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం" వంటి విలువైన నినాదాలను స్వీకరించినప్పటికీ, ఆచరణలో మాత్రం "ఆర్థిక ఆటవిక న్యాయమే", 'పెట్టుబడి దారీ' విధానం పేరుతో కొనసాగుతోంది.

పెడదారి పట్టిన పాశ్చాత్య నాగరికతలోని పెట్టుబడిదారీ పార్శ్వపు పోకడలు భారతీయ సమాజం పై చూపుతున్న దుష్ప్రభావం నుండి బయట పడేదెలా అన్నది భారతీయ సమాజం ముందున్న ఒక సవాలు. విచక్షణారహితంగా ప్రమాదకరంగా సాగుతున్న మానవ, ప్రకృతి వనరుల, దోపిడీ నుండి సమాజాన్ని పరిరక్షించడమెలా అన్నది ఈ కాలం ముందున్న పెను సవాలు.

ఈ జాతికి ఆదర్శ పురుషులైన ఋషులు, అడవుల్లోనే జీవిస్తూ 'ఆటవిక న్యాయపు' ఉచ్చులో చిక్కుకు పోకుండా, మానవాత్మను తరింపచేసే దారులు దర్శించారు. అర్థ, కామాలను ధర్మమోక్షాల మధ్య నిలిపి సుఖ, శాంతులతో జీవించే క్రమాన్ని నేర్పారు. ప్రకృతితో సహజీవనాన్ని, సర్వప్రాణుల శ్రేయస్సును బోధించారు.

మానవత్వపు విలువలను అందించిన వీరి బోధన వేద, పురాణ ఇతిహాస స్మృతుల రూపంలో అక్షరబద్ధమై విలువైన భారతీయ వాఙ్మయంగా విస్తరించింది. ఋషులందించిన ఈ శ్రేష్ఠమైన భావజాలపు పునాదులపై భారతీయ నాగరికతా సంస్కృతులు వికసించాయి.

ఈ ఉత్తమ సంస్కారాల సంపదకు వేదం తొలి చిరునామా అయింది. కనుక ఈ సంస్కృతిని **వైదిక సంస్కృతి** అని పిలిచారు. భరత ఖండంలో ప్రభవించడంతో దీనిని భారతీయమన్నారు. వాస్తవానికి సమస్త మానవజాతి దీనికి వారసులే. ఇది మానవ సౌభ్రాత్రాన్ని కోరే విశ్వసంస్కృతి. అయితే దురదృష్ట వశాత్తూ, ఈ వారసత్వ వైభవం

సక్రమంగా, సజావుగా బదిలీ కాకపోవడంతో దీనికి 'కాలదోషం' పట్టే ప్రమాదమేర్పడింది.

గ్రీకుల, రోమన్ల, పర్షియన్ల, మెసపటోమియన్ల, మాయన్ల నాగరికతా సంస్కృతులు కాల పరీక్షకు నిలవలేక భౌతిక అవశేషాలుగా, పురావస్తు పరిశోధకుల పరిరక్షణలో నిలచిన శిథిల కట్టడాలుగా మిగిలిపోయాయి.

వాటికి పట్టినగతే భారతీయ నాగరికతా సంస్కృతులకు పట్టనున్నదా? క్రైస్తవ మత తీవ్రతకు తలవొగ్గి అదృశ్యమైన గ్రీకుల, రోమన్ల మతాలవలె భారతీయ మతాలు మాయం కానున్నాయా? ఇస్లాం మత తాకిడికి శిథిలమైన జురాష్ట్రియన్ వంటి మతాల మాదిరిగా గాభారతీయ సంస్కృతి కూడా క్షీణించనున్నదా?

క్రైస్తవం, ఇస్లాం తాత్విక శక్తుల సామ్రాజ్య విస్తరణ వ్యూహాలకు సమాధానం చెప్పగల శక్తి ఒక్క భారతీయ తాత్త్విక చింతనకు మాత్రమే ఉన్నా ఆ శక్తి మరుగునపడిపోతోందా? అనే ఆందోళన వర్తమాన భారతీయసమాజాన్ని కలవరపరుస్తోంది.

'అద్వైత' సిద్ధాంతపు పునాదులపై ప్రచారక మతాలుగా ఉన్న క్రైస్తవం, ఇస్లాంలు ఇప్పటికే ప్రపంచంలో అత్యధిక భాగాన్ని తమ స్వాధీనంలో ఉంచుకొన్నాయి. 217 కోట్ల జనాభాతో క్రైస్తవం, 160కోట్ల జనాభాతో ఇస్లాం (2010 గణాంకాల ప్రకారం)54 శాతం ప్రపంచ జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

అవి అంతటితో సంతృప్తి చెందడం లేదు. తమ జనాభాను పెంచుకొనేందుకు క్రొత్త ఎత్తుగడలతో వేగంగా క్రొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ఇదే పద్ధతిలో వారి ఉధృతి కొనసాగితే 2050 నాటికి ఇస్లాం 30 శాతం జనాభాతో, క్రైస్తవం 31 శాతం జనాభాతో ముందుకు వెళతాయని నిపుణుల అంచనా.

రెండు మతాలు సాగించిన సుదీర్ఘ ప్రయాణ క్రమంలో ఎన్నో జాతులు, సంస్కృతులు, ఆలోచనా విధానాలు తమ ఉనికిని, వ్యక్తిత్వాన్ని కోల్పోయాయి. భిన్నత్వంలో ఏకత్వం వారికి సమ్మతం కాదు.

'ఏకధ్రువ' ప్రపంచ నిర్మాణమే రెండు మతాల లక్ష్యం. రెండు మతాలు "భగవంతుడు ఒక్కడే" అని విశ్వసిస్తున్నాయి. భగవంతుడిని క్రైస్తవం 'యెహోవా' అని పిలిస్తే, ఇస్లాం అల్లాహ్ అని ఆరాధిస్తుంది.

'యెహోవా' ను చేరడానికి 'క్రీస్తు' గురువని, 'బైబిల్' తరింపచేసే పవిత్ర గ్రంథమని క్రైస్తవం 'చర్చి' ఆధారంగా ప్రచారం చేస్తుంది. అల్లాను చేరడానికి, మహమ్మద్ గురువని, 'ఖురాన్' మానవాళికి ముక్తినిచ్చే పరిశుద్ధ గ్రంథమని, మసీదు కేంద్రంగా ఇస్లాం బోధిస్తుంది.

తన బోధనలకు భిన్నంగా జీవించే వారికి నరకమే గతి అని వారి విశ్వాసం. తమ మతమొక్కటే మానవజాతికి రక్ష అని వారి నమ్మకం. అందుచేతనే క్రైస్తవం తాను పుట్టిన యూదు దేశానికి పరిమితం కాలేదు. ఇస్లాం తాను అవతరించిన అరేబియాతో ఆగిపోలేదు. రెండు ఆలోచనాధారలూ ప్రాంతాలు, జాతులు, భాషలు, వర్గాలు, దేశాలు,

ఖండాలు విస్తరించాయి. రెండు మతాలూ ఒకదానికొకటి ప్రథమ శత్రువుగ ప్రకటించుకున్నాయి.

ప్రపంచం యొక్క సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలపై తమ ప్రభావాన్ని ఈ రెండు మతాలూ ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తున్నాయి. ఈ రెండూ పరస్పరం సంఘర్షిస్తే మానవత్వమే మసి అయ్యే ప్రమాదం ఉన్నది. ఇప్పటి విజ్ఞానం యొక్క విధ్వంసక శక్తి ఈ మత 'తీవ్రవాదుల' బల ప్రదర్శనకు ఆయుధాలుగా మారుతూ ఈ భూగోళం యొక్క అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నది.

బహు దేవతారాధనలు ఉన్నా **'స్వీయ ఆరాధన - సర్వ ఆదరణ'** సిద్ధాన్తమును పాటిస్తూ, తమ దేవతను ఆరాధించుకుంటూ, తమది కాని ఇతరుల ఆరాధనావిధానాన్ని గౌరవించే ఉదారభావాలతో బహుళ గ్రంథాలతో, భిన్న కులాలతో, భిన్న భాషలతో బహుముఖంగా జీవిస్తున్న విస్తృత భారతీయ సమాజం ఏకోన్ముఖంగా కలసి తమ వారసత్వ వైభవాన్ని ఈ తీవ్రవాదుల బారి నుండి పరిరక్షించుకొని జీవించ గలుగుతుందా? విశ్వశాంతిని కాపాడటంలో క్రియాశీలక పాత్రను నిర్వహిస్తుందా? 'భిన్నత్వంలో ఏకత్వ' జీవన విధానాన్ని పదిలపరచ గలదా?

రెండు శక్తివంతమైన అంతర్జాతీయ ప్రచార మతాల బలప్రదర్శనకు భారతదేశం వేదికగా మారితే జరగబోయే దుష్పరిణామాలు ఏవిధంగా ఉంటాయి? వాటిని ఎలా నివారించాలి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు భారతీయ మేధావిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఈ నేపద్యంలో **సమతామూర్తి-స్ఫూర్తిప్రదాత, శ్రీభగవద్రామానుజులు** అనే చిన్న పుస్తకం మన చేతిలోకి వస్తోంది.

విశిష్టాద్వైత చింతనా మార్గప్రబోధకులైన శ్రీరామానుజాచార్యులు (1017-1137) 11, 12 శతాబ్దాలలో భారతదేశంలో భక్తి మార్గ ప్రవర్తకునిగా ప్రఖ్యాతి గడించారు. ఆమహానుభావుడి 'సహస్రాబ్ది వేడుకలు' ఘనంగా జరపాలని లక్షలాదిమంది అభిమానులు సన్నద్ధమౌతున్నారు.

శ్రీరామానుజాచార్యులను ఆదిశేషుని అవతారంగా ఆరాధించి ఆయనను అనుసరించే వర్గం లక్షలలో ఉన్నారు. వారి దృష్టిలో శ్రీరామానుజాచార్యులు చిరస్మరణీయమైన, ఘనమైనజ్ఞాపకం. అయితే శ్రీరామానుజాచార్యులను గూర్చి ఏమీ అవగాహనలేని కోట్లాది మంది ప్రజలకు 'సహస్రాబ్ది వేడుకలు' తమకు పట్టని జాతర గా ఉండకూడదు. శ్రీరామానుజాచార్యులను ఆదిశేషుని అవతారంగా ఆరాధించినా, అంతకంటే ముందు ఒక మనిషిగా శ్రీరామానుజులు పడ్డకష్టం, ఒక గొప్ప ఉద్యమాన్ని నిర్మించడానికి, ఆయన, ఆయన అనుయాయులు పడ్డ పరిశ్రమ ఈ మానవాళికి మహత్తరమైన స్ఫూర్తినిస్తుంది. దానిని వెలుగులోనికి తేవడం మానవాళి క్షేమాన్ని కాంక్షించే వారందరి తక్షణ కర్తవ్యం.

శ్రీ రామానుజులు చేసిన ఘనకార్యాలన్నీ ఆయన ఆదిశేషుడి అవతారం కావడం వల్లనే చేయగలిగాడంటూ పరిమితం 'చేస్తే, ఆయన

కనుక చేసారు గాని మనలాంటి వారికి ఎక్కడ కుదురుతుంది కనుక?' అంటూ పెదవులు విరిచి 'ఆయన్ని ఆరాధిస్తే చాల్లే' అంటూ ఆరాధకులుగ మిగిలిపోవాలనిపిస్తుంది తప్ప 'మనకోసమే చేశారు కనుక మనం కూడా అనుసరించాలి. అనుసరిద్దాం రండి!' అనగలిగే చొరవ, సాహసం కొరవడతాయి. సమాజాన్ని పట్టించుకోబుద్ధి అవదు. అలా పట్టించుకొన్నవాళ్ళను చూస్తే అదేదో తప్పు పనిచేస్తున్నారంటూ ఆటపట్టించాలనిపిస్తుంది.

సమాజహితం కోసం శ్రీరామానుజులు నిర్వర్తించిన మహోద్యమం యొక్క చారిత్రక స్వరూపం, ఆయనను, ఆయనకు స్ఫూర్తినిచ్చిన పూర్వీకులను, ఆయన సహచరులను, ఆయన అనుయాయులను కొద్దిగా ప్రసిద్ధి చెందినవారైతే చాలు వారిని 'దివ్యాంశలుగా' 'నిత్యసూరులు'గా కీర్తించడం వల్ల సంప్రదాయపరులు వారిని ఆరాధించాలని అనుకున్నారేతప్ప 'వారు మనకు స్ఫూర్తిప్రదాతలు, వారినిచూచి మనం నేర్వగలిగినవి ఎన్నోఉన్నాయని' భావించలేక పోతున్నారు.

పర్యవసానంగా గుడులలో విగ్రహాలుగా, పూజలందుకొనే మూర్తులుగా వారు తయారయ్యారు. ఆ మహానుభావుల పరంపర 'మానవజాతి'కి చేసిన మహోపకారాన్ని సార్వజనీనంగా స్మరించి ప్రేరణపొందే అవకాశం కోట్లాది మందికి లేకుండా పోతోంది. 'విశ్వసంపద'గా పరిగణించవలసిన వ్యక్తుల ఉనికి కేవలం సంప్రదాయ పరులు ఇలవేలుపుగ పరిమితమౌతోంది.

ప్రపంచానికి అత్యద్భుతమైన ఆధ్యాత్మిక, తాత్త్విక చింతనను శ్రీరామానుజులు అందించారు. ఆ తాత్త్విక చింతన శ్రీవైష్ణవ సంప్రదాయానికే కాదు. ఇతర వైష్ణవ సంప్రదాయాలకు, శైవ సంప్రదాయాలకూ కూడా స్ఫూర్తినిచ్చింది. ఉదాహరణకు 14వ శతాబ్దానికి చెందిన నీలకంఠుడు వ్రాసిన బ్రహ్మసూత్రాలపై శ్రీరామానుజుల ప్రభావం వర్ణనాతీతం.

ఆయన రామానుజ దృక్పథాన్ని శైవమతానికి అనుకూలంగా అర్థవివరణ చేసాడు.

ఆర్థిక, సామాజిక, రాజకీయ, మతపరమైన ఉద్రిక్తతల మధ్య అస్థిరత్వంతో, అపనమ్మకంతో ఊగిసలాడుతున్న వర్తమానపు జనత "శ్రీరామానుజాచార్యుల" ద్వారా లభించే ప్రయోజనాలను తెలుసుకోగోరుతోంది.

శ్రీరామానుజాచార్యులు కొందరి వారా? అందరివారా? ఆయన తాత్త్విక చింతన ఏమిటి? ఆచరణ విధానమెలాంటిది? విశ్వహితానికి, మానవతకు ఆయన చేసిన మేలేమిటి?

శ్రీరామానాజాచార్యుల దృక్పథం ఆయన కాలానికే పరిమితమా? నేటి కాలానికి ఉపయుక్తమా? కాలానుగుణంగా ప్రయోజనాలు సిద్ధింపచేసే సౌలభ్యం, సౌశీల్యం ఆయన సిద్ధాంతాలకు ఉన్నాయా?

శ్రీరామానుజాచార్యులు తన అనుయాయులతో ఎలా మెలిగారు? ఆయన అనుయాయులు ఆయన ఆశయాలకోసం ఎలా పనిచేసారు?

శ్రీరామానుజాచార్యుల అనంతరం వారి తాత్త్విక దర్శనం సమాజంపై చూపిన ప్రభావం ఏవిధంగా ఉన్నది?

తమ బ్రతుకులను బాగు చేసుకోవాలనుకొనే శ్రద్ధ ఉన్న వ్యక్తులకు శ్రీరామానుజాచార్యుల నడవడి ఏ రకంగా ప్రేరణనిస్తుంది?

పరిమితమైన శక్తిని, కాలాన్ని, వనరులను ఆశావహమైన మార్పుకోసం వినియోగించాలని భావించే అశేష బడుగు ప్రజానీకానికి శ్రీ రామానుజాచార్యులు అందించే స్ఫూర్తి ఏమిటి ?

శ్రీరామానుజులను ఆరాధిస్తున్నామనుకొనే వారు నిర్వహించాల్సిన కార్యాలెలాంటివి ?


ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాన్ని ఈ చిన్న పుస్తకం ద్వారా అందించే ప్రయత్నం చేస్తున్నాము. అందుకొందాము, రండి!

# వివేక వంతుల గురు శుశ్రూష

"సారాసార వివేకజ్ఞాః
గరీయాంసో విమత్సరాః
ప్రమాణతంత్రాః సంతీతి
కృతో వేదార్థ సంగ్రహః"-

"ఏది సారమో, ఏది అసారమో నిర్ణయించగల వివేక వంతులు, మాత్సర్యం లేని మనస్సు గలవారు, ప్రమాణాలకు కట్టుబడి జీవించాలనుకొనేవారు - ఈ లోకంలో ఉన్నారని విశ్వసించి వారికోసం ఈ 'వేదార్థసంగ్రహాన్ని' వివరిస్తున్నాను".

శ్రీరామానుజాచార్యులు తన 'వేదార్థసంగ్రహ' గ్రంథాన్ని ఈ శ్లోకంతో ముగించారు. శ్రీరామానుజాచార్యుల జీవన వైఖరిని



వ్యక్తీకరించే ఈ వాక్యాలతోనే వారి చరితను ప్రారంభించుకొందాం.

క్రీ॥శ 1017 లో దక్షిణ భారతదేశంలోని, తమిళనాడు రాష్ట్రంలో శ్రీ పెరుంబుదూరులో జన్మించిన శ్రీ రామానుజాచార్యులకు పుట్టినప్పుడు వీరి మేనమామగారైన శ్రీశైలపూర్ణులు పెట్టినపేరు **'శ్రీలక్ష్మణాచార్యులు'**, వీరిని **ఇళైయాళ్వారు** అనికూడా పిలిచేవారు. వీరికి జన్మతః సునిశిత సత్యాన్వేషణ నిష్ఠ ఏర్పడింది. తల్లిదండ్రులైన కాంతిమతి, కేశవాచార్యుల పెంపకంలో వినయ, విధేయతలను, ప్రాథమిక వైదిక విజ్ఞానాన్ని, ఆయన అలవరుచుకొన్నారు. వేద, వేదాంగాలను కంఠస్థం చేసారు.

శ్రీరామానుజాచార్యుల విజ్ఞాన పిపాసను తీర్చేశక్తి శ్రీపెరంబుదూరుకు లేదు. ఉన్నత విద్యను అభ్యసించాలని శ్రీరామానుజాచార్యులు అభిలషిస్తుండగానే కేశవ సోమయాజి తన అనారోగ్యం కారణంగా కుమారునికి తంజమాంబతో వివాహం చేశారు. వివాహమైన కొద్దిరోజులకే కేశవసోమయాజి కాలం చేశారు.

పదహారేళ్ళ పిన్న వయస్సులోనే శ్రీరామానుజాచార్యులు కుటుంబ నిర్వహణ బాధ్యతను స్వీకరించాల్సి వచ్చింది. వివాహితలైన సోదరీమణులు భూమిదేవి, కమలాదేవి లకు, తల్లికాంతిమతికి, భార్య తంజమాంబకు శ్రీరామానుజులే పెద్ద దిక్కు అయ్యారు.

ఇంతక్లిష్ట పరిస్థితులలోనూ, తానూ తండ్రివలె వైదిక కర్మలు నిర్వహిస్తూ కుటుంబపోషణకు పరిమితం కాలేకపోయారు రామానుజులు.

జీవితంలో సంభవించే సుఖ దుఃఖాల వెనుక ఉన్న మర్మాన్ని అర్థం చేసుకోవడానికి 'వేదాంత' విద్యను అధ్యయనం చేయాలని నిశ్చయించుకొన్నారాయన. కంచికి 15 కి.మీ దూరంలో ఉన్న **'తిరుప్పుట్ కుఴ్గి'** గ్రామానికి రామానుజులు తన కుటుంబాన్ని తరలించారు. 108 శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో ఒకటైన శ్రీ విజయ రాఘవ స్వామి దేవాలయం ఆ వూరిలో ఉన్నది.

జటాయువుకు శ్రీరామచంద్రుడు చరమ సంస్కారం చేసిన చోటిది. యాదవప్రకాశులనే వేదాంతాచార్యుడు తన శిష్యులతో అద్వైత వేదాంతాన్ని బోధిస్తూ, వేద పాఠశాలను ఈ గ్రామంలో నిర్వహిస్తున్నాడు.

**'వేదోఽఖిలో ధర్మమూలమ్'** 'సమస్త ధర్మాలకు వేదమే మూలం'. ఇది భారతీయుల విశ్వాసం. వేదాలలోని పూర్వభాగాన్ని ఆదరించి కర్మలకే ప్రాధాన్యాన్నిచ్చిన వారు మీమాంసకులు. ఉత్తర భాగమే ఉత్తమమైనదని భావించి, జ్ఞానానికి ప్రాధాన్యాన్నిచ్చిన వారు అద్వైతవేదాంతులు. వేదాంతవిద్య అత్యంత గహనమైనది. వేద ప్రతిపాదితమైన పరమార్థాన్ని దర్శించాలనే లక్ష్యంతో రామానుజులు యాదవ ప్రకాశులను ఆశ్రయించారు.

రామానుజుల వినయ విధేయతలు, ప్రతిభా పాటవాలు, భక్తి శ్రద్ధలు యాదవ ప్రకాశులను బాగా ఆకర్షించాయి. తక్కువ సమయంలోనే రామానుజులు గురువు గారికి అభిమాన శిష్యుడయ్యాడు. అయితే కొన్నాళ్ళు గడిచే సరికి గురుశిష్యుల మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి.

రామానుజులది వివేక సహిత గురు శుశ్రూషా పద్ధతి. మారు మాటాడక గురువుగారు చెప్పిన దానిని వల్లెవేసే బట్టీ వీరుడు కాదాయన. పైగా వారు అధ్యయనం చేసేది ఉపనిషద్విద్య. ప్రశ్నించి సత్యాన్ని స్పష్ట పరచుకోవడం ఉత్తమ శిష్యుని లక్షణం. చర్చించి, సత్యాన్ని స్పష్టపరచి శిష్యుడిని వొప్పించగలగడం ఉత్తమగురువుకు ఉండవలసిన లక్షణం.

సత్యాన్వేషణకోసం శాస్త్రచర్చ జరిగేటప్పుడు సారాసారములను నిర్ధారించుకోవడం కోసం గురుశిష్యుల మధ్య వాదోపట వాదాలు జరుగుతాయి. ఉన్నత ఆదర్శంకోసం సాగించే చర్చ వ్యక్తికీ, లోకానికీ ఉపకారం చేసేది కావాలి. అంతేతప్ప భావోద్వేగాల ఉద్రిక్తతలకు లోనై మాత్సర్య ద్వేషాలను పెంచకూడదు. అందుకోసమే వేదాధ్యయనం చేసే గురుశిష్యులు **"సహనావవతు సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై। తేజస్వినా వధీత మస్తు, మా విద్విషావహై"**- అంటూ శాంతి మంత్రాలు పఠిస్తారు.

శాస్త్రచర్చ సందర్భంగా 'విషయం' ఒక్కటే ప్రస్తావనకు రాదు. విషయంతో పాటు ఆ విషయాన్ని ప్రస్తావించే వ్యక్తి యొక్క దృక్పథం, అభిప్రాయం కూడా కలసి ఉంటుంది. అంటే విషయంతో పాటు విషయాన్ని చూసే తీరు కూడా కలసి ఉంటుంది.

యాదవప్రకాశులు వేద మంత్రాలను తనకు అర్ధమైన దృక్పథంలో బోధించసాగారు. యాదవ ప్రకాశులు ఉపనిషన్మంత్రాలపై సాగించే

వ్యాఖ్యానాలు రామానుజులకు తృప్తినివ్వలేక పోయాయి.

యాదవ ప్రకాశులు బోధించే వ్యాఖ్యానాలలోని దోషాలను, పరిమితులను రామానుజులు ప్రశ్నించి చూపసాగారు. రామానుజుల సత్యాన్వేషణ బుద్ధి గురువు గారికి '**గురుధిక్కారం**'గా తోచింది.

రామానుజులు చూపిన సవరణలు ఎన్నో ఉన్నా, ప్రసిద్ధమైన ఉదాహరణలు ఉపనిషత్తులలోంచి చూపినవి ఓ రెండు ఉన్నాయి.

మొదటిది '**సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ**' అనే తైత్తిరీయోపనిషత్‌కి చెందిన మంత్రం. **సత్యం** అంటే అసత్యం కానిది. **జ్ఞానం** అంటే అజ్ఞానం కానిది. **అనన్తం** అంటే అంతంలేనిదీ బ్రహ్మతత్త్వము అని గురువుగారు చెప్పారు. దానికంటూ ఏ గుణాలూ ఉండవు. కనిపించే ఏవస్తువు వంటిదీ కాదు అని చెప్పాలే తప్ప, 'ఇది ఇలాంటిది' అనే నిర్వచనం చెప్పవీలులేదు అన్నది తాత్పర్యం. దానిని రామానుజులు ఇలా సవరించారు.

**సత్యం** అంటే మార్పుచెందే ప్రకృతి కంటే వేరైన, విలక్షణమైన తత్త్వం బ్రహ్మతత్త్వం.

**జ్ఞానం** అంటే, అల్పజ్ఞానంగల మనవంటి బద్ధజీవులకంటే విలక్షణుడు సర్వజ్ఞుడైన బ్రహ్మతత్త్వము.

ఇక **అనంతం** అంటే, దేశకాలపరిమితులను దాటినవాడు. ముక్త, నిత్య జీవులకంటే విలక్షణుడు అని చెపితేనే, మంత్రంలో ఉండే ఆ

విశేషపదాలకు సరియైన అర్థం చెప్పినట్లు అనేది రామానుజుల సవరణ.

ఇక రెండవ మంత్రం - "తస్య యథా కప్యాసం పుండరీకం ఏవం అక్షిణీ" అనే ఛాందోగ్యశ్రుతికి చెందినది. బ్రహ్మతత్త్వానికి **'అక్షిణీ'** రెండునేత్రాలున్నాయి. అవి **'పుండరీకం'** కమలములవలె ఎఱ్ఱనైనవి. ఆ కమలం **కప్యాసం** అంటే, **కోతి** పిరుదులవలె ఎఱ్ఱనైనవి అంటూ చెప్పారు గురువుగారు. దేవుని నేత్రాలను పోల్చే కమలాన్ని **కోతి** పృష్ఠాలతో పోల్చడం రామానుజులకు దుఃఖాన్ని కలిగించింది.

**కపి** అనే పదానికి సూర్యుడు, తామరతూడు వంటి అర్థాలున్నాయి. కనుక **కోతి** అనే అర్థాన్నే తీసుకోనవసరం లేదు.



ఇప్పుడు సందర్భాన్నిబట్టి చూస్తే **కప్యాస** మంటే, సూర్యుడివల్ల వికసిస్తున్న తామర. బలమైన కాడపై నిలచి కోయకుండా ఉన్న తామర. పైగా **క+ప్యాసం** అంటే, నీటిపైదాకా ఎదిగి నిలచిన తామర. ఇన్ని అర్థాలు వస్తాయి. వాటివల్ల అశ్లీలమైన కోతిపిఱ్ఱ అనేదిపోయి, అందంగా వికసించిన ఎఱ్ఱని తామర. విశాలమైన తామర. సూర్యకిరణాలతో నిగనిగలాడే తామర. ఇలా చెపితే ఆ భగవంతుడి నేత్రాల శోభ పెరుగుతుంది. ఇదే అర్థాన్ని మంత్రం మనకి తెలుపుతోంది. ఇది రామానుజుల ప్రతిపాదన.

రామానుజులు ప్రతిపాదించే సవరణలు హేతుబద్ధమైనవి, తార్కికమైనవి, ఆమోదయోగ్యమైనవి. ఈ సత్యం గురువు గారి బుద్ధి గ్రహించినా,ఆయన మనస్సు దానిని అంగీకరించలేకపోయింది.

ఇతరులు మనల్ని వ్యతిరేకిస్తే వారు మనల్ని కించపరిచారని బాధపడటం, ఆగ్రహించడం అపరిపక్వ మనస్కుల లక్షణం. యాదవ ప్రకాశులు గొప్ప మేధావే అయినప్పటికీ, రాగద్వేషాలతో కలుషితమైన మనస్సును సంయమనంతో అదుపులో ఉంచుకోగల సాధనాబలం తక్కువ. పర్యవసానంగా 'తన అభిప్రాయాలతో విబేధించేవాడు తనకు విరోధి' అనే వైఖరి యాదవప్రకాశులలో తెలియకుండానే బలపడ సాగింది.

యాదవప్రకాశులను తు.చ. తప్పక అనుసరించే అభిమాన శిష్యులు కొందరు గురువుగారి ముందు రామానుజులను ఈసడిస్తూ, ఆక్షేపిస్తూ

అగ్నిలో ఆజ్యం పోసినట్లుగా యాదవప్రకాశుల అసంతృప్తిని ప్రజ్వలింపచేయసాగారు. అయినప్పటికీ రామానుజాచార్యులు క్రీ.శ 1033 నుండి క్రీ.శ 1040 వరకు 8 సంవత్సరాల పాటు తన 23 వ ఏట దాకా యాదవప్రకాశుల వద్ద ఎంతో ఓర్పుతో, ఒడుదుడుకులకు, ప్రమాదాలకు లోనౌతూ విద్యనభ్యసించారు.

ఈ 8 ఏళ్ళ విద్యాభ్యాసంలో రామానుజులు ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకొన్నారు. తమ కాలంలో తమకు అందుబాటులో ఉన్న తాత్త్విక దృక్పథాలనన్నింటినీ కూలంకషంగా గ్రహించారు. వివిధ శాస్త్రాలపై వారికున్న అపార పాండిత్యపు లోతులు అనంతర కాలంలో వారు రచించిన **వేదార్థసంగ్రహం, శ్రీభాష్యం, వేదాంతదీపం** వంటి గ్రంథాలను పరిశీలిస్తే మనకు బోధపడతాయి.

తాళపత్ర గ్రంథాలలోని విషయాలతోపాటు, మానవ మనస్తత్వాల లోని భిన్న వైఖరుల తీరు తెన్నులు కూడా రామానుజులకు అనుభవ పాఠాలు నేర్పాయి.

ఓసారి గురువుగారితో పాటు కాశీయాత్రకు బయలుదేరిన రామానుజులకు, తనను భౌతికంగా తొలిగించాలనే ప్రయత్నం ఈ యాత్రకు లక్ష్యమని తెలిసి, తెలివిగా వింధ్యారణ్యంలో ఆ బృందం లోంచి బయటపడ్డాడు. ప్రయాణము మధ్యలోనే తప్పించుకొని ఇంటికి చేరినప్పటికీ, రామానుజులు, తనపై జరిగిన ప్రాణహాని ప్రయత్నానికి ప్రతిక్రియ సంకల్పించలేదు. పైగా 'విద్య' మీద ప్రేమతో, ఏమీ

తెలియనట్లుగా రామానుజులు యాదవప్రకాశులవద్ద, తగుజాగ్రత్తలతో ఈ ఘటనానంతరం, మరో రెండేళ్ళు గడిపారు.

ఆటంకాలను పట్టించుకోని ఏకాగ్రత, మానసిక ధృడత్వం రామానుజుల లక్ష్య శుద్ధిని స్పష్టం చేసింది. రామానుజుల హృదయ పరిపక్వత అనంతర కాలంలో యాదవ ప్రకాశుని పరివర్తనకు మార్గం చూపింది. తన పాండిత్యం మానసిక ప్రశాంతతను ఇవ్వలేక పోయిందని గ్రహించిన యాదవ ప్రకాశులు కొన్నాళ్ళయ్యాక రామానుజాచార్యుల ప్రభావాన్ని గుర్తించి, క్రమంగ తన మనస్సును మార్చుకోసాగాడు. ఒకప్పుడు తనకు శుశ్రూషలు చేసిన శిష్యుడు, వివేకవంతుడై యతియై, ఆత్మోజ్జీవన మార్గాన్ని లోకానికి ప్రకాశింపచేస్తున్నాడు.

ఎవరినైతే తాను కాశీయాత్ర నెపంతో గంగలో ముంచి పరిమార్చాలని భావించాడో, అతడు ప్రజల హృదయతాపాగ్నులను చల్లార్చే నడిచే పవిత్ర గంగా జలమయ్యాడు. తాను విషపు మొక్కగా భావించి గిల్లేద్దామనుకున్న చిన్న మొక్క నేడు తన కళ్ళ ముందే కల్పవృక్షంగా పెరిగి ఆశ్రితుల అభీష్టాలను నెరవేరుస్తున్నది. తనలోని లోపాలు తనకే తెలియ నారంభించాయి.

భేషజాలను వీడిన యాదవ ప్రకాశులు రామానుజులను తన మనోవికారాలను సరిదిద్దమని వేడుకొన్నాడు. గురువు శిష్యుడయ్యాడు వివేకం శుశ్రూషలందుకొన్నది. శ్రీరామానుజులు యాదవప్రకాశునికి తరువాతి కాలంలో యత్యాశ్రమాన్ని అనుగ్రహించారు.

'గోవిందదాసుని' గా మారిన యాదవప్రకాశుడు 'యతిధర్మ సముచ్చయ'మనే గ్రంథాన్ని 'శిష్య గురువు' ముందుంచాడు. క్రీ.శ 1049 లో- 'గోవిందదాసుడైన యాదవప్రకాశులు' రామానుజుల సన్నిధిలో ప్రశాంత చిత్తంతో దేహం విడిచాడు. అప్పటికి రామానుజుల వయస్సు ముప్పై రెండు సంవత్సరాలు.

## వరదరాజ స్వామి సన్నిధిలో

"జ్ఞానం బుద్ధి కుశలత మాత్రమే కాదు. నైతికత పై ఆధారపడిన ఆధ్యాత్మిక జాగరణ", - శ్రీ సి. రాజగోపాలాచారి.

శ్రీరామానుజాచార్యులు 16 ఏళ్ళు వచ్చే దాకా శ్రీ పెరంబుదూరులో, అనంతరం 8 ఏళ్ళపాటు అంటే 23 ఏళ్ళు వచ్చేదాకా **'తిరుప్పుట్కుళి'** లో 'వేదాంతాన్ని ప్రేమించే విద్యార్థిగా జీవితం గడిపారు. వారి తదుపరి మజిలీ పదేళ్ళపాటు 23 ఏళ్ళ నుండి 32 ఏళ్ళ దాకా కంచిలో వరదరాజ స్వామి గుడి కేంద్రంగా సాగింది.

ప్రాచీన కాలం నుండి ప్రసిద్ధి చెందిన భారతీయ నగరాలలో 'కంచి' ఒకటి. రాజకీయంగా ఆర్థికంగా, సాంస్కృతికంగా ఈ నగరం దక్షిణ భారతంలో కీలకపాత్ర వహించింది. బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం అన్ని రకాల మత సంప్రదాయాలను ఈ నగరం ఆదరించింది.

కంచిలో 'విష్ణు కంచి' గా వ్యవహరించే ప్రదేశంలో వరదరాజ స్వామి దేవాలయమున్నది. ఇది ఆళ్వార్లు కీర్తించిన దివ్యక్షేత్రం. ప్రస్తుతం 23

ఎకరాల విస్తీర్ణంలో, మూడు ప్రాకారాలతో దేవాలయాల సముదాయంగా, గొప్పశిల్పకళా వైభవంతో గోచరిస్తున్నప్పటికీ, శ్రీరామానుజాచార్యుల కాలంలో ఇంతటి కట్టడాల నిర్మాణం జరగలేదు.

రామానుజాచార్యులు వరదరాజ స్వామి దేవాలయానికి చేరడం యాదృచ్ఛికం కాదు. అది వారి లోతైన ఆలోచనల నుండి ఏర్పడ్డ ఎంపిక.

పరమోన్నత సత్యాన్ని సాక్షాత్కరింపచేసుకొనే లక్ష్యంతో వేదాంతాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిన ఆ యువకుడి ప్రయాణంలో ఈ దేవాలయం ముఖ్య మజిలీగా మారింది.

యాదవప్రకాశుల సన్నిధానంలో నిరుపమానమైన తర్క సామర్థ్యం, తాత్త్విక గాంభీర్యం ఉన్న అద్వైత సిద్ధాంతాన్ని అవగతం చేసుకొన్న అసాధారణ ప్రజ్ఞాశాలి రామానుజాచార్యులు.


జగత్తును మిథ్యగా భావించి, నిర్గుణ బ్రహ్మతత్త్వాన్ని 'అహం బ్రహ్మాస్మి'గా పారాయణం చేస్తూ ఉపాసించడం ఆయువకుడికి రుచించలేదు. యాదవప్రకాశుల శుశ్రూషలో తాను పొందిన జ్ఞానం పాక్షికము, అసంపూర్ణము అని రామానుజులు విశ్వసించారు. దోషాలను తొలగించుకొని, సర్వతోముఖంగా సంపూర్ణ జ్ఞానాన్ని పొందడానికి సగుణోపాసనతో కూడిన మార్గం శ్రేయోదాయక మైనదిగా ఆయన నిశ్చయించుకొన్నారు.

మీమాంసకుల కర్మ వాదం, కోరికలను తీర్చే సాధనాలుగా మాత్రమే వైదిక కర్మలను వినియోగించడం వేదాల అభిమతం కాదు. సిద్ధాంతజ్ఞానంతో ప్రజ్ఞానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఒక వ్యక్తని శుష్క వేదాంతిగా తయారుచేయడం ఉపనిషత్తుల తాత్పర్యం కాదు. బుద్ధిబలంతో పాటు, హృదయంలో మానవత్వాన్ని, జాలిని, పరశ్రేయస్సును పట్టించుకొనే, పరిపక్వతను పెంచే వైజ్ఞానికశక్తి ఉపనిష్తులుబోధించే భక్తిమార్గానికి ఉంది.

జ్ఞానకర్మలనే ఈ రెండు మార్గాలను తనలో ఇముడ్చుకొని సాగే భక్తి మార్గాన్ని హృదయపరిపక్వత కలిగిన శ్రీరామానుజాచార్యులు ఎంపిక చేసుకొన్నారు. వైయక్తికంగా శ్రీరామానుజాచార్యులు చేసుకొన్న ఆ ఎంపిక గొప్పచారిత్రక పరిణామాలకు కారణమైంది. కేవలం పాండిత్య బలం, శాస్త్రజ్ఞానం కలిగిన వారికే దైవం సాక్షాత్కారమౌతుందనే ఆలోచనా మార్గాన్ని సవరించే దిశగా శ్రీరామానుజాచార్యుల అడుగులు పడ్డాయి. బుద్ధికి ఉన్న పరిమితులను గ్రహించిన, ఆయన తన హృదయ పీఠంపై భగవంతుని సాక్షాత్కరింపచేసుకోవాలనే లక్ష్యంతో వరదరాజ స్వామి దేవాలయపు మెట్లు ఎక్కారు.

ఈ దిశగా అతని నిర్ణయానికి రెండంశాలు ప్రధానంగా ప్రేరకాలయ్యాయి. యాదవ ప్రకాశులతో కలసి 'కాశీయాత్రకు' వెళ్ళిన సందర్భంలో తనపై దారి తెలియని ఘోరారణ్యంలో హత్యా ప్రయత్నం జరుగుతున్నదని గుర్తించిన రామానుజులను గురువుగారి శిబిరంలోంచి బయటకు రహస్యంగ వెళ్ళిపొమ్మని ప్రేరణనిచ్చాడు సోదరుడు

గోవిందభట్టరు. కీకారణ్యంలో వింధ్యపర్వతాలవద్ద దారితెలియని దశలో కిరాతదంపతులిద్దరు సాయం చేశారు. ఆ దంపతులు కంచి వరదరాజస్వామి దేవాలయంసమీపానికి అతనిని చేర్చి మాయమయ్యారు. శ్రీ రామానుజులు మార్గమధ్యంలో తెలివిగా శిబిరంలోంచి బయటపడ్డారు. అయితే దారితప్పిన ఆ అడవిలో ఒకనాటి రాత్రి నిద్రాసమయంలో దాహానికి నీళ్ళు అడిగింది కిరాతుని భార్య. కిరాతుడు నిరాకరించి, పడుకోమన్నాడు. సాయంచేసేవారికి సేవ చేద్దామని నీళ్ళకై వెతికి తెచ్చేసరికి ఆ కిరాతదంపతులు కనిపించలేదు. వారికై వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఇంతలో తెల్లవారింది. చుట్టూచూస్తే, కాంచీపురగోపురాలు దర్శనమిచ్చాయి. దాంతో ఆ



దారిచూపిన దంపతులు సాక్షాత్తూ కంచి వరదరాజస్వామి దంపతులే నని రామానుజులు భావించారు.

గజేంద్రుడిని రక్షించిన ఆ వరదుడే తనను కష్టాలనుండి కాపాడాడనే అనుభూతి శ్రీ రామానుజులకు ఏర్పడింది. విద్యాభ్యాసం అనంతరం వరదుని సేవను రామానుజులు నిర్ణయించుకోవడానికి ఈ బోయల సాక్షాత్కారం ఒక ప్రధానాంశం. వారికోసం నీరుతెచ్చిన ఒక బావి ఉంది. దానిని **'శాలక్కిణరు'** అంటారు. అందులోంచే తరువాత నీరునుతెచ్చి వరదుడి ఆరాధనకోసం సమర్పించే సేవను రామానుజులు ఎన్నుకున్నారు. ఇందుకు దారిచూపిన వ్యక్తి కాంచీపూర్ణుడు. ఆయన్నే **'తిరుక్కచ్చినంబి'** అనేవారు.

## కాంచీపూర్ణుడు - మార్గదర్శనం

శ్రీరామానుజాచార్యులు వరదరాజ స్వామి సేవను ఎంచుకోవడంలో మరొక ప్రధాన ప్రేరణ - వరదుడు మెచ్చిన ఉత్తమ సేవకుడు కాంచీపూర్ణుడు కావడమే. బడి గుడిలోంచి, గుడి బడిలోకి రామానుజులు ప్రవేశించడానికి కాంచీపూర్ణుని ప్రభావం అత్యంత కీలకమైంది. కాంచీపూర్ణుడు గొప్పభక్తుడు. ఆయన క్రీ.శ. 1009 లో తమిళనాడు రాష్ట్రం, చెంగల్పట్టు జిల్లాలో "పూందమల్లి" గ్రామంలో జన్మించాడు. కాంచీపూర్ణుడిని తిరుక్కచ్చినంబి, గజేంద్రదాసుడు, భార్గవ ప్రియార్, కాంచిముని, పేరరుళాలర్ దాసన్ అని పలుపేర్లతో కాంచీపురవాసులు పిలిచేవారు.

వరదరాజస్వామి పై కాంచీపూర్ణునికిఉన్న వల్లమాలిన ప్రేమ ఆయనను పూందమల్లి నుండి కంచికి చేర్చింది. కాంచీపూర్ణుడు వీర రాఘవ చెట్టియార్, కమలాంబ దంపతుల నాల్గవ కుమారుడు.

వంశ పారంపర్యంగా వస్తున్న వాణిజ్య వృత్తిలో మిగిలిన కుమారులలాగే తిరుక్కచ్చినంబిని కూడా ప్రవీణుడిని చేయాలని తండ్రి భావించాడు. తగిన శిక్షణను, వ్యాపార మెలకువలను కూడా వీర రాఘవ చెట్టియార్ కుమారుడికి నేర్పాడు.

అయితే పరంపరాగతంగా కుటుంబంలో వస్తున్న వైష్ణవ సంప్రదాయం, వ్యాపార సంప్రదాయం కన్నా తిరుక్కచ్చినంబిపై ఎక్కువ ప్రభావం చూపింది. పర్యవసానంగా అతడు ధన సంపాదనపై విముఖత ప్రదర్శించాడు.

వడ్డీలెక్కలపై కన్నా నారాయణుని నామంపైనే తిరుక్కచ్చినంబికి మక్కువ ఎక్కువైంది. వ్యాపారం కోసం తండ్రి ఇచ్చిన డబ్బును వైష్ణవ క్షేత్రాల దర్శనానికి అతడు ఖర్చు పెట్టేవాడు. ''నేనిచ్చిన డబ్బు ఏంచేసావు'' అని ఓసారి తండ్రి నిలేస్తే తిరుక్కచ్చినంబి వేలుపైకి చూపి ''వైకుంఠంలో దాచాను''. అని సమాధానం చెప్పాడు.

లోకం తీరుకు భిన్నంగా ఉన్న కొడుకు ప్రవర్తన తండ్రికి తీవ్రకోపాన్ని తెచ్చింది. 'అప్రయోజకుడని' సోదరులు తిట్టారు. డబ్బు, పదవి, కీర్తి సంపాదించాల్సిన వయస్సులో బైరాగిలా దేవాలయాలు పట్టుకు తిరుగుతున్నాడని బంధువులు మందలించారు.

తండ్రి నిప్పులు చెరిగినా, తల్లి నిష్టూరాలాడినా, శ్రేయోభిలాషులందరూ చివాట్లు పెట్టినా కాంచీపూర్ణుడు తన బుద్ధి మార్చుకోలేదు. "తీర్థయాత్రలపేర దేశాలు పట్టుకు తిరిగేవాడికి ఆస్తులెందుకు? నీ వాటాను కూడా మాకు అప్పగించు". అని అన్నలు తిరుక్కచ్చినంబిని దబాయించారు.

వారి కోరికను తిరస్కరించి, అన్నల నుండి తన వాటా ఆస్తిని తీసుకొని, కంచి వరదరాజ స్వామి కోసం పూందమల్లిలో 'నందనవనాన్ని' నిర్మించాడు. తొందరడిప్పొడి ఆళ్వార్, పెరియాళ్వార్లులాగా తాను కూడా చక్కని పూల తోటను పెంచి వరదరాజస్వామికి పుష్ప కైంకర్యం చేయసాగాడు.

దేహబంధువులతో సంబంధాన్నివీడి, భగవద్బంధుత్వాన్ని పెంచుకొన్నాడాయన. పూందమల్లి నుండి పూలమాలలను తీసుకొని చీకట్లో బయలుదేరి, కంచికి చేరి పెరుమాళ్ళకు సమర్పించేవాడతడు.

వచ్చే, పోయే దారిలో శ్రీ పెరంబుదూరులోని కేశవ సోమయాజి ఇంటి వద్ద కాసేపు సేదతీరి వెళ్ళేవాడు కాంచీపూర్ణుడు.

తనకన్నా 8 ఏళ్ళ పెద్దవాడైన తిరుక్కచ్చినంబి యొక్క భక్తిశ్రద్ధలు బాలుడైన రామానుజుల మనస్సుపై గొప్ప ప్రభావం చూపాయి.

ఆకలిదప్పులను లెక్కించకుండా, సంపద, సౌఖ్యాలు పట్టించుకోకుండా, వరదరాజస్వామిసేవలో తిరుక్కచ్చినంబి చూపుతున్న

నిష్ఠ, ప్రేమ రామానుజాచార్యులకు ఆశ్చర్యం కలిగించింది. కాలక్రమంలో కంచి వరదరాజ స్వామి యొక్క ఎడబాటును భరించలేక తిరుక్కచ్చినంబి తన నివాసాన్ని పూర్తిగా కంచికే మార్చుకొన్నాడు. అతి నిరాడంబరంగా ఊరి చివర ఓ పూరి గుడిసెలో తిరుక్కచ్చినంబి జీవించసాగాడు.

జనం గుర్తింపుతో సంబంధం లేకుండా ఎంతో వినయంతో ప్రతిదినమూ రాత్రి పెరుమాళ్ళకు జరిగే శయనోత్సవంలో అర్చకులు



చేసే ఉపచారాలు పూర్తైనాక నిద్రకుపక్రమించే వరదరాజస్వామికి 'వింజామర సేవచేస్తూ తరించే' తిరుక్కచ్చినంబి అంటే వరదరాజ స్వామికి ఎంతో ప్రీతి.

అర్చామూర్తిగా తాను పాటించే మౌన నియమాన్ని వీడి మహాభక్తుడైన తిరుక్కచ్చినంబితో వరదరాజ స్వామి సంభాషణా సల్లాపం చేసేవాడు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు, ప్రజలు కాంచీపూర్ణుని సాధు సౌజన్యాల కారణంగా ఆయనపై ఎనలేనిగౌరవం చూపేవారు.

యాదవప్రకాశుని సేవను వీడిన అనంతరం, తిరుక్కచ్చినంబిపై గురుభావంతో, ఆయన సూచనపై రామానుజులు వరదరాజస్వామికి అభిషేక జలాలను నూతినుండి తీసుకొని వచ్చే సేవా కైంకర్యం చేపట్టారు.

నిజానికి రామానుజులకు కుటుంబ పోషణ పెద్ద బాధ్యత. ఆయన గృహస్థుడు. ఆయనలాంటి విద్వాంసుడికి సిరి సంపదలను, గౌరవ మర్యాదలను సంపాదించడం పెద్ద లెక్క కాదు.

తన పాండిత్యంతో సంపన్నులను ప్రసన్నుల్ని చేసుకొని అగ్రహారాలను సంపాదించి ఆడంబరంగా ఉండవలసిన వాడు నీళ్ళ బిందెల్ని మోస్తూ నిత్య దారిద్ర్యాన్ని వరిస్తున్నాడని భార్య తంజమాంబకు బాధకలిగింది. తిరుక్కచ్చినంబి సాహచర్యంలో రామానుజులకు వరదరాజ స్వామిపై భక్తి పెరిగే కొద్దీ తంజమాంబకు అసంతృప్తి అంతంతా పెరగసాగింది.

కఠినమైన కులాచారాల కట్టడిలో పెరిగిన ఆమె. కుటుంబాన్ని పట్టించుకోకుండా భర్త ఆలయసేవలు చేస్తూ తిరగడానికి వైశ్యుడైన తిరుక్కచ్చినంబి కారణమని అతని విషయంలో వ్యతిరేకభావాన్ని కలిగి ఉండేది. అత్తగారైన కాంతిమతి ముందు తంజమాంబ తన ఆక్రోశాన్ని వెళ్ళడించేది. తన కుమారుని ఆలోచనలను, ఆశయాలను అర్ధంచేసుకొని సర్దుకు పోవాల్సిందిగా అత్తగారు హితవు చెప్పేవారు.

మనిషి చేతిలో లేని పుట్టుక కారణంగా లభించే కులాన్ని చూసి గర్వం కూడదని, నడవడిద్వారా వ్యక్తమయ్యే సుగుణాలను గౌరవించాలని, ఆరాధించాలని, భర్త చేసే బోధనలు ఆమెకు అర్ధమయ్యేవికావు. ఆచారహీనులని బంధువులు అందరూ తమపై ముద్రవేస్తే సమాజంలో తలఎత్తుకు తిరిగేదెలా ? తన భర్త చేసే పనుల వల్ల బంధువుల నింద పడవలసి వస్తుందని తంజమాంబ బాధ.



రక్తమాంసాలతో కూడిన దేహమనే చెరసాలలో బంధీయై రాగద్వేషాలనే క్రూర భటుల హింసకు గురౌతున్న తనకు విముక్తి ప్రసాదించగల వరదరాజస్వామి దయను ఎలా పొందాలనేది రామానుజుల వేదన.

భర్త బాధ భర్తది. భార్య బాధ భార్యది. భగవంతుడు ఎవరి మొరను విని ఏది అనుగ్రహిస్తాడో ఎవరికెరుక?. రామానుజులు పలుమార్లు తన మనస్సులోని వేదనను కాంచీపూర్ణుని ముందుంచి మార్గదర్శనం చేయవలసిందింగా ప్రాధేయపడ్డాడు.

“గ్రుడ్డి వాడు మరొక గ్రుడ్డి వానికి దారిచూపలేడు గద!, దేవరాజ స్వామి దయకోసం ప్రాకులాడుతుండే తాను రామానుజులకు దుః ఖోపశమనానికి దారి ఎలా చూపగలను?” ఇది కాంచీపూర్ణుని నమ్రపూర్ణమైన సమాధానం.

దయాసింధువైన హస్తి శైలేశుడే సమస్త ప్రాణుల ఆర్తిని బాపగల సమర్థుడు. దేవదేవుడు, జగత్పతి అయిన ఆ కారుణ్యమూర్తిని శరణు వేడాలే తప్ప నరాధముడనూ, మహాపాపినీ అయిన తాను చేయుగలిగేదేముంది”? అని కాంచీపూర్ణుడు రామానుజునికి సమాధానమిచ్చేవాడు.

తనను శిష్యుడిగా స్వీకరించమని రామానుజులు, ‘గురు’ భారం మోయలేనని తిరుక్కచ్చినంబి వాదులాడుకొనే వారు. ఇరువురూ ఈ

సమస్యను పరిష్కరించే బాధ్యతను వరదరాజ స్వామికి అప్పగించారు. అయితే రామానుజుల సమస్య పరిష్కారానికి ఆయన ఊహించని విధంగా శ్రీరంగంలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

## శ్రీరంగం నుండి పిలుపు

"భగవంతుని మీద ప్రేమ మనకు లక్ష్యమూ, సాధనము కూడా, ఆత్మోద్ధరణకు మార్గం అదే"

తమిళనాడు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగ క్షేత్రం ప్రాచీన కాలం నుండి శ్రీవైష్ణవానికి ముఖ్య స్థానంగా ఉన్నది. శ్రీరంగంలో ఉన్న శ్రీరంగనాథుడి దేవాలయం ఉభయ కావేరీ నదుల మధ్య 156 ఎకరాల సువిశాల ప్రాంగణం. ఆరుమైళ్ళ పైన విస్తరించిన 7 ప్రాకారాల మధ్య శ్రీరంగనాథుడు కొలువున్నాడు.

శ్రీ వైష్ణవ భక్తులైన 12మంది ఆళ్వార్లు ఈ క్షేత్ర వైభవాన్ని 243 పాశురాలతో గానం చేసారు. కావేరీనది, కొల్లిడమ్ నదుల మధ్య ఉన్న ఈ శ్రీరంగ క్షేత్రాన్ని కేంద్రంగా చేసుకొని శ్రీ వైష్ణవ భక్తి ఉద్యమాన్ని వ్యాపింపచేయడానికి శ్రీయామునాచార్యులు అమోఘమైన కృషి చేస్తున్నారు.

శ్రీవైష్ణవాచార్యుడు నాథమునులు (క్రీ.శ 823-917) ప్రారంభించిన ఈ భక్తి ఉద్యమానికి ఆయన మనుమడైన యామునాచార్యులు కొత్త

సొబగులు అద్దారు. స్తోత్రరత్న, చతుశ్లోకి, మహాపురుష నిర్ణయం, ఆగమ ప్రామాణ్యం, గీతార్థ సంగ్రహం, సిద్ధిత్రయం వంటి రచనల ద్వారా భక్తి ఉద్యమాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలు ఆయన చేస్తున్నారు.

క్రీ.శ 976లో జన్మించిన యామునాచార్యులు చిన్న వయస్సులోనే అద్భుతమైన మేథాశక్తి వల్ల 'ఆళవందార్'గా లోకప్రసిద్ధి చెందారు. 66 ఏళ్ళ ఆ వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అందుబాటులో ఉన్న కొద్దిమంది శిష్యులతో సమావేశమయ్యాడు.

నాయనలారా ! భగవంతుడే మనందరికీ ప్రాణం. మన విజ్ఞానం యొక్క పరమార్థం ఆయనే. మనం ఆయనలో ఉన్నాము. ఆయన మనలో ఉన్నాడు. ఈ సత్యం తెలిసి స్వచ్ఛందంగా దైవానికి దాసుడైన వాడే కదా భక్తుడు.

మన జ్ఞానం పర్యవసించాల్సింది ఆ దైవ ప్రేమలోనే. సర్వాంతర్యామి అయిన ఆ దైవాన్ని సాటి వారిలో దర్శించి, ప్రేమించి, సేవించడమే మన వైష్ణవత్వానికి ప్రయోజనం.

ఈ వైష్ణవ తత్త్వాన్ని లోకానికి చాటి విస్తరింపచేయడం మనందరి భాధ్యత. దీనిని గుర్తెరిగి జీవిస్తామని మాట ఇవ్వండి. భగవంతుని పిలుపుకోసం ఎదురు చూస్తున్న నాకిదే కదా తృప్తి. అంటూ యామునులు తమ శిష్యులకి కర్తవ్యాన్ని ఉపదేశించారు.

ఆ తర్వాత తన ముఖ్య శిష్యుడు మహాపూర్ణుడిని దగ్గరకు పిలిచి

నెమ్మదిగా, 'నాయనా మహాపూర్ణా! నీడలాగానే మృత్యువు ఎప్పుడెదురు పడుతుందో తెలియదు. ఎక్కువ సమయం లేదు. నీవు చేయవలసిన కార్యం ఒకటి ఉన్నది. శ్రద్ధగా ఆలకించు.

పెద్దలనుండి పరంపరగా మన దాకా వచ్చిన ఈ వైష్ణవ ప్రేమ తత్త్వాన్ని విశ్వవ్యాప్తం చేయగల దిట్ట ఇప్పుడు కంచిలో వరదరాజ స్వామి సేవలో ఉన్నాడు. వేదాంతాన్ని అభ్యసించి రెండేళ్ళ నుండి మన కాంచీపూర్ణుడి సాహచర్యంలో శరణాగతి పాఠాలు నేర్చుకొంటున్నాడు.

ఆ ఇరవై ఐదేళ్ళ యువకుడు మన తిరుమలనంబికి మేనల్లుడు. నా తర్వాత ఈ వైష్ణవ ధర్మానికి భవిష్యత్తును నిర్దేశించగల నాయకుడు ఆ రామానుజుడే నని నా మనస్సు చెబుతున్నది.

అతనిని వొద్దికగా తీర్చిదిద్ది భక్తి ఉద్యమ సారథిగా నిలిపే బాధ్యత నీదే. త్వరగా బయలుదేరు. ఆ యువకుడి కోసం శ్రీరంగం ఎదురు చూస్తున్నది''. అంటూ మహాపూర్ణుడిని కంచికి బయలుదేరాల్సిందిగా ఆదేశించారు.

గురువు ఆజ్ఞను శిరసా వహించి 'మహాపూర్ణుడు, పెరియనంబి' అని ప్రసిద్ధి చెందిన పరాంకుశాచార్యులు తక్షణమే కంచికి బయలు దేరాడు. కంచికి చేరుకొన్న మహాపూర్ణుడు వరదరాజ స్వామిని సేవించుకొని, యామునాచార్యుడి శిష్యుడూ, మహాభక్తుడూ అయిన తిరుక్కచ్చి నంబిని కలిసాడు.

కుశల సమాచారాలయ్యాక, మహాపూర్ణుడు వచ్చిన కార్యాన్ని కాంచీపూర్ణుడికి విన్నవించాడు. ''పూర్ణార్యా! మన ఆచార్యుల అనారోగ్యానికి ఎంతో దుఃఖిస్తున్నాను. తమ వారసుడిగా రామానుజులను వారు ఎంచుకోవడం నిజంగా రామానుజుల అదృష్టం. వరదరాజ స్వామి ఆ యువకునిపై తన కృపను ఇలా కురిపించాడు కాబోలు.

అన్ని విధాలా యోగ్యుడే అయినప్పటికీ యువకుడూ, గృహస్థూ అయిన రామానుజులు ఇంత క్లిష్టమైన బాధ్యతలను స్వీకరించడానికి ఇష్ట పడతారా? పైగా అతడు వరదరాజుకు బంధీ. కంచిని విడిచి రంగడి సేవకు సిద్ధపడతాడా? ఏమో! మీ ప్రయత్నం మీరు చేయండి. ఆ తర్వాత దైవేచ్ఛ''. అంటూ తిరుక్కచ్చినంబి మహాపూర్ణుడికి రామానుజులను కలిసే పద్ధతి తెలిపారు.

మహాపూర్ణుడు ఆ రాత్రి గడిపి, మరునటిరోజు ఉదయం రామానుజులు ఆలయానికి నీరు తీసుకొని రావడానికి వెళ్ళే బావి దగ్గరకు చేరాడు. పెరుమాళ్ళ కైంకర్యం కోసం భక్తితో నీరు తోడుతున్న రామానుజులకు శ్రావ్యంగా సంస్కృత భాషలో సాగుతున్న స్తోత్రం వినిపించింది.

**“స్వాభావికానవధికాతిశయేశితృత్వం**
**నారాయణ! త్వయి నమృష్యతి వైదికః కః? ।**

**బ్రహ్మ శివశ్శతమఖః పరమస్వరాడితి**
**ఏతేపి యస్య మహిమార్ణవవిప్రుషస్తే ॥"**


అద్భుతమైన భావ గాంభీర్యంతో వీనులకు ఇంపుగా వినిపిస్తున్న ఆ స్తోత్రానికి రామానుజులు తన్మయత్వంతో స్తంభించి పోయాడు. స్తోత్రం పూర్తయ్యాక, స్పృహలోకి వచ్చిన రామానుజులు, "ఆలపించిన మహాపూర్ణుని వైపు చూస్తూ".

"మహానుభావా! మీరెవరో తెలియదు. జన్మను తరింపచేసే స్తోత్రాన్ని వినిపించారు. వరదుని సేవకుడిగా ఉన్న ఈ దాసుడిని రామానుజులని వ్యవహరిస్తారు"

అంటూ పరస్పరం పరిచయాలు చేసుకొంటూ వరదరాజ స్వామి సన్నిధికి ఇరువురూ చేరారు. కాంచీపూర్ణుని సన్నిధిలో రామానుజులు తాను విన్న స్తోత్ర మాధుర్యాన్ని ప్రశంసించి, ఇంత గొప్ప స్తోత్రాన్ని రచించిన యామునాచార్యులను సేవించాలని ఉందన్న అభిలాషను వ్యక్తం చేసాడు.

మహాపూర్ణుడు తన గానంతో, సౌశీల్యంతో రామానుజులను ముగ్ధుడిని చేసాడని కాంచీపూర్ణుడు గ్రహించాడు. "రామానుజా! వరదరాజస్వామి యొక్క సేవను నాకు ప్రసాదించినది మా గురువుగారైన శ్రీయామునాచార్యులే. ఈ మహాపూర్ణులతో కలసి వారి దర్శన భాగ్యాన్ని పొందు". అంటూ కాంచీపూర్ణుడు శ్రీరంగ ప్రయాణానికి రామానుజులను ప్రోత్సహించాడు.

తక్షణమే రామానుజులు మహాపూర్ణులతో కలసి శ్రీరంగానికి ప్రయాణమయ్యారు. కంచినుండి శ్రీరంగానికి ప్రయాణించే దారిపొడుగూ రామానుజులు మహాపూర్ణుల ద్వారా యామునాచార్యుల వారి జీవితవిశేషాలను, తరచి తరచి అడిగి తెలుసుకొన్నారు.



యామునులు రాజ్య సంపదలను వదిలి పెట్టి రంగనాథుడికి సేవకుడైన విధానం రామానుజులకు పరమాద్భుతంగా తోచింది. తానూ దైవానికి ఆ విధంగా అంకితమయ్యే పద్ధతిని నేర్పమని యామునులను ప్రాధేయపడాలని రామానుజులు నిశ్చయించుకొన్నాడు.

యామునులవారి ఉదాత్త భావాలను మహాపూర్ణుడి ద్వారా వింటూ, ఆ మహానుభావుని దర్శనం కోసం తహతహలాడుతూ రామానుజులు శ్రీరంగం పొలిమేరకు చేరారు.

కావేరీనది ఒడ్డుకు వారికి జనప్రవాహం కనిపించింది. తెలిసిన వ్యక్తులను ఆపి మహాపూర్ణుడు 'విషయం ఏమిటని' ప్రశ్నించాడు. ''ఆళవందారు భౌతిక కాయాన్ని వదలి శ్రీరంగనాధుడి పదములకు చేరారు. ఆ శిష్యులు అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నారు''. అని వారిలో ఒకడు విషాదంగా చెప్పాడు.

మహాపూర్ణుడు గురువుగారి మరణ వార్త విని భోరున ఏడ్చాడు. కడసారి చూపు దక్కలేదని కన్నీరు మున్నీరయ్యాడు. రామానుజుల ఆశాభంగానికి హద్దుల్లేవు. తనంత దురదృష్టవంతుడు ఈ భూమండలం మీద లేడని, సదాచార్యుని దర్శనం పొందలేని పాపినని రామానుజుడు లోలోన కుమిలి పోయాడు. దుఃఖ భారాన్ని ఆపుకొని ఇరువురూ యామునుల చరమసంస్కారం జరిగే ప్రదేశానికి చేరారు. యామునుల మిగిలిన శిష్యులు మహాపూర్ణుడిని చూసి, గురువియోగ క్లేశాన్ని తలచుకొని, బాధపడ్డారు.

శ్రీరంగంలోని వైష్ణవ భక్తులందరూ యామునులకు అంతిమ శ్రద్ధాంజలి సమర్పించేందుకు అక్కడికి వచ్చి చేరారు. ''కష్టపడి కంచి నుండి వచ్చి యామునుల చరమ దేహాన్ని దర్శించవలసి వచ్చిందే! ఈ రంగనాధుడెంత క్రూరుడు? నాకు గురు అనుగ్రహం దక్కకుండా

చేసి, యామునులను తన అక్కున చేర్చుకొంటాడా”?

మౌనంగా రామానుజులు రోదిస్తూ, యామునుల చరమ కాయాన్ని చూస్తూ నిశ్చేష్టుడై నిలబడి పోయాడు. రామానుజుల మనస్సును గ్రహించిన మహాపూర్ణుడు తన దుఃఖాన్ని నిగ్రహించుకొని, రామానుజుల భుజంపైన చేయివేసి అనునయించాడు.

శ్రీయామునాచార్యులతో సహా అక్కడి వారందరూ తనకు క్రొత్తవారే. “కంచి నుండి పని గొట్టుకొని యామునాచార్యులు తనను ఎందుకు పిలిపించారు? తన నుండి ఆయన ఏమి ఆశించి, అంత్య కాలంలో అప్పుడైన మహాపూర్ణుడిని తనను తీసుకొని రమ్మని పంపారు”?

ప్రశ్నలతో రామానుజుల మెదడు వేడెక్కింది. పరిచయస్తుడైన మహాపూర్ణుడే తన సందేహాలకు సమాధానం చెప్పాలి. ఇంతలో రామానుజుల దృష్టి ఆళవందారుయొక్క కుడిచేతి మూడువేళ్ళపై పడింది. అవి ముడుచుకొని ఉండటాన్ని గమనించాడు. అక్కడివారిని అందుకేమైనా కారణమున్నదా? అని అడిగారు. ఎవ్వరూ దానిని గ్రహించనేలేదు. కలకలం చెలరేగి, అందరిదృష్టీ మూడు వేళ్ళపై పడింది. దాంతో గుసగుసలు మొదలయ్యాయి.

గుంపులోంచి ఎవరో “గురువుగారికి తీరని కోరికలు ఏమన్నా ఉన్నాయేమో ! తెలుసుంటే వాటిని తీరుస్తామని చెప్పండి. ఆ మహానుభావునికిది తృప్తి” అంటూ సలహాఇచ్చారు. శిష్యులు వాళ్ళల్లో వారు చర్చచేసుకొంటున్నారు.


మహాపూర్ణుడు రామానుజులను చూస్తూ, వంకపెట్టలేని వైష్ణవ భక్తి ఉద్యమ నిర్మాణం ఆళవందార్‌ల చిరకాల వాంఛ. వారి దృష్టిలో భక్తి అంటే కేవలం భావోద్వేగంతో సాగించే కార్యకలాపం కాదు. మనందరికీ ప్రీతిపాత్రుడైన భగవంతునికి సంబంధించిన ప్రత్యేకజ్ఞానం. అనంతకళ్యాణ గుణసంపన్నుడైన ఆ భగవంతుని పరత్వాన్ని చాటే ప్రామాణిక మైన బ్రహ్మసూత్రవ్యాఖ్య ద్వారా విజ్ఞాన సంధానం ఎవరు చేస్తారా అని ఆయన తహతహలాడేవారు''. అన్నారు. క్షణకాలం మౌనం.

రామానుజుల కళ్ళు మెరిసాయి. మహాపూర్ణుడి వైపు, యామునుల వైపు చూస్తూ 'వారి కృప ఉంటే బ్రహ్మసూత్రాలకి యోగ్యమైన భాష్యం వ్రాస్తా'నన్నాడు. ఆశ్చర్యంగా ఒకవేలు తెరచుకుంది. జనంలో ఆశ్చర్యం, ఆనందం, ఆ పిల్లవానిపై ఆదరం. త్రివేణిలా పెనవేసుకున్నాయి.

మహాపూర్ణుడి ప్రక్కనే ఉన్న మరోశిష్యుడు ''యామునాచార్యుల వారికి పురాణరత్నమైన విష్ణుపురాణమంటే, విపరీతమైన ప్రీతి. పరాశరుల హృదయాన్ని గ్రహించి, తదనుగుణంగా వైష్ణవ ప్రేమ తత్త్వాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్ళి ఆ మహానుభావుని పేరును, ఆయన కుమారుడూ వేద వాఙ్మయపరిష్కర్త అయిన వేదవ్యాసుని పేరునూ చిరస్మరణీయంగా భక్తుల గుండెల్లో నిలపాలని ఆయన పదేపదే చెప్పేవారు'', అని గురువుగారి జ్ఞాపకాలను తనకు తోచిన భాషలో పలికాడు. మళ్ళీ క్షణం మౌనం. ''వీరి కృపతో వ్యాస, పరాశరుల పేర్లు లోక ప్రసిద్ధినందేట్లు చేస్తా'', రామానుజుని నోట అప్రయత్నంగా మాటలు వెలువడ్డాయి. రెండవ వేలు తెరచుకోవడంతో అక్కడివారందరూ ఆనందంతో తత్తరపడ్డారు.

ఇంతలో మరొక శిష్యుడు, ''అందరూ మరచిపోయారా! మనగురువుగారికి నమ్మాళ్వార్ అంటే వల్లమాలిన అభిమానం కదూ! నమ్మాళ్వార్ పాశురాలంటే ఆయన చెవికోసుకొనే వారు. ఆ ద్రవిడ వేదాన్ని ఆర్తితో ఆలయాలలో కీర్తించాలని, వాటిసారం ఈ భూమి ఉన్నంత కాలం ప్రజల నాలుకపై నాట్యం చేయాలని ఎప్పుడూ మనతో చెప్పేవారు కదూ''! అన్నాడు.

రామానుజులు యామునుల దేహాన్ని చూస్తూ ''ముందుగ ఆ ప్రబంధాన్ని నేను నేర్చుకుంటాను. సరియైన వ్యాఖ్యతో ఆ తర్వాత లోకానికందిస్తా. ఈ యామునాచార్యులవారు నా జీవిత లక్ష్యాలను నిర్దేశించడానికే తన శిష్యులతో ఈ మాటలు పలికించారు. వరదరాజ స్వామి దయతో తప్పక ఈ వృద్ధుడి సంకల్పాలు నెరవేరుతాయి''.



అన్నాడు. మూడవ వ్రేలు తెరచుకొంది. అంత దు:ఖంలోనూ 'ఆచార్యుడు తృప్తిచెందాడనేది' వారికి ఉపశమనాన్ని, ఆనందాన్ని ఇచ్చింది. అందరూ రామానుజుణ్ణి అభినందించి ఆశీర్వదించారు.

యామునాచార్యుల అంత్యక్రియలు సముచితంగా పూర్తయిన వెంటనే ఎవరితో మాట్లాడకుండా కావేరీ నదిలో స్నానం చేసి రామానుజులు కంచికి తిరుగుముఖం పట్టాడు.

## గృహస్థు సన్యాసిగా

"పక్షులు తాము నివసించే చెట్టును చేరినట్లుగా అందరూ ఆ భగవంతుడిని ఆశ్రయిస్తారు." - ప్రశ్నోపనిషత్తు.

తన అంతరాలలో సాగుతున్న ఆధ్యాత్మిక సంక్షోభాన్ని శాంత పరచగల సద్గురువు లభించనున్నాడనే కొండంత ఆశతో రామానుజులు శ్రీరంగానికి వెళ్ళారు. తీరా అక్కడకు వెళ్ళే సరికి యామునాచార్యుల అంతిమయాత్ర రామానుజులకు తీవ్ర ఆశాభంగాన్ని కల్గించింది. నిరాశా నిస్పృహలతో ఆయన శ్రీరంగం నుండి కంచికి తిరిగివచ్చారు.

క్రీ.శ 1042లో ఈ సంఘటన జరిగే నాటికి రామానుజుల వయస్సు 25 సంవత్సరాలు. దివ్యానుభవం దిశగా తనను నడిపించగల గురువుకోసం సాగిన అన్వేషణ అర్ధాంతరంగా ముగిసి, తన కథ తిరిగి కంచికి చేరడం రామానుజులకు అంతులేని ఆవేదనను మిగిల్చింది.

యథాప్రకారం గుడికి రెండు మైళ్ళదూరంలో ఉన్న బావి 'శాలక్కిణరు' నుండి నీటిని తీసుకొని వరదరాజస్వామికి తీర్థకైంకర్యం చేస్తూ సేవలందించే కార్యాన్ని రామానుజులు కొనసాగించారు.

వరదరాజ స్వామి సన్నిధిలో కాంచీపూర్ణుడితో సత్సంగం రామానుజుల అంతులేని ఆధ్యాత్మిక దాహానికి తాత్కాలిక ఉపశమనా న్నిచ్చేది. రామానుజులు తరచు యామునాచార్యుల వారి 'స్తోత్రరత్న' జ్ఞాపకాలను కాంచీపూర్ణునితో ప్రస్తావించేవాడు.

"మాటలకందని ఆ ఘనదైవం యొక్క గుణ గుణాల్ని కీర్తించడంలో వేదాలు, బ్రహ్మరుద్రాదులు అలసిపోయితమ అసమర్థతను చాటుకొన్నారు. నిరంతరం సంసార సాగరంలో మునకలు వేసే నాలాంటి పాపికి, ఆత్మజ్ఞాన హీనుడికి, ధర్మభ్రష్టునికి సర్వేశ్వరుని దయను పొందే మార్గమేమిటి?

సర్వ వ్యాపి అయిన ఆ శ్రీమన్నారాయణుడు దయా సముద్రుడని శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలు, మహాభక్తులు కీర్తిస్తున్నారు. ఆర్తుల పాలిటి కల్పవృక్షమైన ఆ శ్రియఃపతికి నా హృదయపు వేడుకోలు ఎందుకు వినపడటం లేదు?

నా జిజ్ఞాసలో ఏమి దోషమున్నదో ఎఱుకపరచే వాడెవ్వడు ? దానిని సవరించి, నా తాపాలను తీర్చితరింపచేసే దైవం దిక్కుకు దారిచూపేవా డెవ్వడు? అంటూ ఆ మహానుభావులే తపన చెందితే ఇక నాలాంటి వానికి గతి ఏమిటి? అందుకే ఆలస్యంచేయక, తనకు గురువై,

పరమపదానికి దారిచూప''మని కాంచీపూర్ణుడిని రామానుజులు పలుమార్లు ప్రాధేయపడేవారు.

'అన్నింటికీ ఆ ముకుందుడే మనకు దిక్కు'. అని వరదుని పాదాలపై భారంవేసి, కాంచీపూర్ణుడు తన దీనత్వాన్ని స్పష్టం చేసేవాడు. రామానుజులకు కాంచీపూర్ణుడికి మధ్య ఇలాంటి చర్చలతో మరో మూడేళ్ళు కాలం గడచిపోయింది.రామానుజుల యొక్క 28వ ఏట, క్రీ.శ. 1045లో వారి తల్లి కాంతిమతి తన దేహయాత్రను ముగించింది. రామానుజులకు తంజమాంబకు మధ్యఉన్న అభిప్రాయ వైవిధ్యాన్ని, భావోద్వేగ వైవిధ్యాలను ఉపశమింపచేసే పెద్ద దిక్కు మరిలేదు.

తంజమాంబ యొక్క ఆలోచనలు సమంజసమైనవే. రామానుజుల ఆలోచనలు కూడా సమంజసమైనవే. రామానుజుల తాత్త్విక హృదయపు లోతులను పెద్ద పండితుడననుకొనే యాదవ ప్రకాశులే దర్శించలేక పోయారు. సామాన్య గృహిణి అయిన తంజమాంబ ఏం అర్థం చేసుకోగలుగుతుంది?

వంశాచారాలు, వైదిక సహవాసాలూ వదిలితే పరువూ ప్రతిష్ఠా పోతాయికదా! సమాజంలో తలెత్తుకు తిరిగేదెలా? ఇలాంటి స్థితినెలా సహించాలీ. అనేది ఆమె ఆవేదన.

ఈ ధోరణి ఆమెలో భర్త జీవన శైలిపై అసంతృప్తి పెరగడానికి కారణమైంది. ఆకలిగొన్న ఆర్తుణ్ణి చూసి పిడికెడు అన్నం పెట్టమని ఇంటికి పంపితే, ఆరాధన కాకుండా, ఇంటి పెద్ద తినకుండా పెట్టతగదని చెప్పి ఖాళీ కడుపుతో ఆ ఆర్తుణ్ణి వెనక్కి పంపేది.

పలుమార్లు తన ఇంటికి భోజనానికి రమ్మని బలవంతం చేసినా, తిరస్కరించిన కాంచీపూర్ణుడు ఓరోజు రామానుజులకు తన సమ్మతి తెలిపాడు. కాంచీపూర్ణుడు అతిథిగా భోజనానికి వస్తున్నాడని, తగిన ఏర్పాట్లు చేయమని తంజమాంబకు రామానుజులు చెప్పాడు. వంక చెప్పాల్సిన అవకాశం ఇవ్వకుండా కావలసిన సామాన్లన్నింటినీ ఇంటచేర్చాడు.

భర్తకు అత్యంత ఆదరణీయుడు, గురుస్థానీయుడు అని తెలిసినప్పటికీ, తంజమాంబ కాంచీపూర్ణుడితో తన కాలం నాటి కట్టుబాట్లుకు తగ్గట్టుగా వ్యవహరించింది. అల్లునిగా భావించి జీవించే ఆ భాగవతోత్తముడు తనను వెదకడానికి పోయిన రామానుజుల రాకకు ముందే, ఆయన ఇంటికి వెళ్ళి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆమె నియమానికి తగ్గట్టు బయటి వరండాలో కూర్చొని తన భోజనం ముగించుకొని నిష్క్రమించాడు.

ఆచారాలకు అంకితమై జీవించే తంజమాంబ కాంచీపూర్ణుడికి వడ్డించిన వంటకాలను, తన భర్తకు పెట్టడం తగదని అన్యులకు సమర్పించేసి, భర్తకోసం మరలా మడిగా వంట ప్రారంభించింది. కాంచీపూర్ణుని శేష ప్రసాదాన్ని ఆరగించాలని ఆశపడ్డ రామానుజులకు తంజమాంబ తొందరపాటుదనం నిరాశను మిగిల్చింది. రామానుజులకు తంజమాంబకు మధ్య ఏర్పడ్డ ఇలాంటి సన్నివేశాలు మానసికంగా దూరాన్ని పెంచాయి.

ఒకరోజు ఉదయాన్నే రామానుజులు కాంచీపూర్ణుడిని కలసి, గంభీరంగా, 'మహానుభావా! వరదరాజస్వామి సేవలో ఇప్పటికి తొమ్మిదేళ్ళు గడచిపోయాయి. పదవఏడు నడుస్తున్నది. ఏం పాపం చేసుకున్నానో ఏమో! నా బ్రతుకంతా సమాధానాలు లేని ప్రశ్నలమయమైంది.

భ్రమ ప్రమాదాలతో కూడిన భవసాగరం నుండి బ్రతుకునావను క్షేమంగా చేర్చగల చుక్కానిగా భావించి తత్త్వశాస్త్రాన్ని ఉపాసించాను. ఋషుల జీవితానుభవాల సారమైన ఉపనిషత్తులు నాకు అంతర్దర్శనుభవాన్ని ఇస్తుందని ఆశపడ్డాను.

తర్కము, శాస్త్రము, తత్త్వము, మతాల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలుసుకోవడం ద్వారా పరమ సత్యాన్ని అర్థంచేసుకోవడానికి ఎనిమిదేళ్ళు యాదవప్రకాశులవద్ద ఎనలేని శ్రద్ధతో శుశ్రూష చేసాను.

జ్ఞాన, కర్మలు స్వతంత్రంగ ఏమీ సాధించలేవని, అవి పక్వమై సాగే భక్తితో భగవంతుడి కృపను పొందడం సాధ్యమౌతుందని నమ్మి వరదుడిని, మిమ్మల్ని ఆశ్రయించాను. నా బుద్ధికి నిరర్థకపు వెతుకులాటే తప్ప చిత్త ప్రశాంతత లభ్యం కావడం లేదు. నిర్గుణాద్వైత భావజాలపు గందరగోళాన్ని ఎంతత్రోసి వేద్దామనుకొన్నా, అది వినక నాపై స్వారీ చేస్తున్నది.

1) జీవుడైన నేను, దివ్యమైన ఆ పరబ్రహ్మము ఒక్కటేనా? వేరా? ఈ రెండింటి సంబంధము స్వరూపమేమిటి?

2) పరమసత్యంగా ప్రకాశించే ఆతత్త్వం ఏది?

3) ముక్తికి దారి ఏది?

4) ముక్తి ఎప్పుడు లభిస్తుంది?

5) ఊపిరి ఆగే సమయం వరకూ పరమ సత్యస్మరణ అవసరమా? శరీరం మాట వినకపోతే, ఆ అంత్యస్మరణ మన చేతులలో ఉండదు కదా?

6) నాకు మార్గదర్శనం చేసే గురువు ఎవ్వడు?

ఈ ఆరుప్రశ్నలూ నా మనస్సును తొలిచి వేస్తున్నాయి. వరదరాజస్వామి మీతో మాటలాడుతాడట. ఈ ప్రశ్నలకు సమాధానాలడిగి నాకు శాంతచిత్తాన్ని అనుగ్రహించండి''.

అని రామానుజులు కాంచీపూర్ణుడిని వేడుకొన్నాడు. రామానుజుల హృదయ వేదనను అర్థం చేసుకొన్న కాంచీపూర్ణుడు "తండ్రీ వరదరాజా! హద్దులు లేని దయ నీ సొంతం. నీ తత్త్వాన్ని అర్థం చేసుకోవడానికై అలమటిస్తున్న రామానుజుడిని ఇంకా శోధించడం నీకు తగదు. అతని ప్రశ్నలకు సమాధానమిచ్చి స్వాంతనను ప్రసాదించు.

వరదరాజా! నీవు సర్వులకూ హితుడవు. సమస్త ఫలాలను అనుగ్రహించే కరుణా సముద్రుడవు. నిన్ను శరణు వేడిన ఈ యువకుడి ఆర్తిని తొలగించే బాధ్యత నీదే కదా''! అంటూ పలువిధాలుగా వరదరాజ స్వామిని, కాంచీపూర్ణుడు రామానుజుల దు:ఖోపశమనంకోసం ప్రార్థించాడు. వరదరాజస్వామి ద్వారా తనకు అందిన సందేశాన్ని

కాంచీపూర్ణుడు మరుసటిరోజు రామానుజులకు ఎరుక పరచి అతని హృదయ భారాన్ని తీర్చాడు.

కాంచీపూర్ణుడి ద్వారా వరదరాజస్వామి అందించిన సమాధానాలు రామానుజులకు అపరిమితానందాన్నిచ్చాయి. ముఖ్యంగా తనకు మార్గదర్శకత్వాన్ని చూపే గురువుగా ఆత్మగుణ సంపన్నుడైన మహాపూర్ణుడిని వరదరాజస్వామి ఎంపికి చేసినందుకు రామానుజులకు ఎంతో తృప్తినిచ్చింది.

మహాపూర్ణుడిని ఆశ్రయించి, జన్మను సార్థకం చేసుకొనే మార్గం తెలుసుకోవాలనే తహతహ రామానుజుల్ని క్షణం నిలువనీయలేదు. కాంచీపూర్ణునికి, వరదరాజస్వామికి కృత్జ్ఞతాభివందనాలు సమర్పించి మహాపూర్ణుడి అనుగ్రహం కోసం రామానుజులు శ్రీరంగానికి బయలు దేరారు.


''నారాయణుడే పరమతత్త్వమనీ, జీవాత్మకు పరమాత్మకు భేదమున్నదనీ, ప్రపత్తియే పరమాత్మను పొందేందుకు చేసే సాధనమని, దేహయాత్ర ముగిసాకే ముక్తి లభిస్తుందని, శరణాగతునికి అంతిమ స్మృతి అవసరం లేద''ని ఇతర ప్రశ్నల సమాధానాలలోని మర్మ సూక్ష్మాలను విప్పితెలిపే గురు అనుగ్రహంకోసం రామానుజులు ఉత్సాహంతో కంచిని విడిచిపెట్టాడు. గృహిణికి, తన గురు అన్వేషణ కార్యాన్ని విశదపరచి రామానుజులు శ్రీరంగం వైపు బయలుదేరారు. తన ప్రయాణక్రమంలో మధురాంతకం అనే దివ్యక్షేత్రాన్ని చేరాడు.

ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం జిల్లాలో మధురాంతకమనే పట్టణమున్నది. ఇది కంచికి 40 మైళ్ళ దూరంలో, చెన్నైకి 89 కి.మీ దూరంలో ఉన్న నగరం. పల్లవులకాలంలో, 1600 సంవత్సరాల క్రితం నిర్మితమైన సీతారామలక్ష్మణుల ఆలయం ఇక్కడ ఎంతో ప్రసిద్ధంగా ఇప్పటికీ వర్ధిల్లుతున్నది.

'మధురాంతక చతుర్వేది మంగళం' పేరుతో బ్రాహ్మణ అగ్రహారంగా ఉండేది. 1300 సంవత్సరాల క్రితం మధురాంతక ఉత్తమచోళుని కాలంలో ఈ ఊరి పేరు ప్రఖ్యాతిని పొందింది. శ్రీరామాలయానికి సమీపంలో, మొత్తం తమిళనాడు రాష్ట్రంలోనే అతిపెద్ద మానవ నిర్మిత సరస్సును ఆ చోళరాజు ఇక్కడ నిర్మించాడు. 12 మంది ఆళ్వార్లలో ఒక్కరైన తిరుమళ్లిశై ఆళ్వారు ఈ ఊరిలోనే సిద్ధిపొందారు.

క్రీ.శ 1795-1799 మధ్య బ్రిటిష్‌వారి పాలనలో చెంగల్పట్టు జిల్లాలో ఉన్న ఈ ప్రాంతానికి కలెక్టర్‌గా కల్నల్‌బ్లేజ్ అనే ఆంగ్లేయాధికారి ఉండేవాడు. మధురాంతకం చెరువుకు వర్షాకాలంలో పెద్ద వరద వచ్చింది. ఆనకట్ట తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఉపద్రవాన్ని అరికట్టటానికి విఫలుడైన ఆ కలెక్టర్ ఇక చేసేదిలేక ఆలయంలో ఉన్న శ్రీరాముణ్ణి ప్రార్థించాడు.

ఆ రాత్రివేళ వర్షంతో చెరువుకు గండి పడకుండా గట్టుపై కాపలా కాస్తూ లక్ష్మణ సమేత శ్రీరామ చంద్రుడు తిరుగుతున్నట్లు కల్నల్ బ్లేజ్ కు కనిపించాడు. చెరువుగట్టు గండిపడకుండా కాపాడిన శ్రీరామ



చంద్రుడికి కల్నల్ బ్లేజ్ చెరువు ప్రక్కనే మరో మందిరం నిర్మించాడు. ఆ కలెక్టర్ గారి శాసనం ఆ ఆలయంలో ఇప్పటికీ ఉన్నది.

అంతటి మహిమ, ప్రసిద్ధి కలిగిన మధురాంతకంలోని శ్రీరామచంద్రుడిని క్రీ.శ. 1049లో రామానుజులు దర్శించాడు. అదే సమయంలో భార్యా సమేతంగా శ్రీరంగం నుండి కంచికి బయలు దేరిన మహాపూర్ణుడు మధురాంతకం చేరాడు.

ఇద్దరు మహానుభావులూ చెరువు గట్టున కలిశారు. మహాపూర్ణుడిని చూడగానే రామానుజులు ఆశ్చర్యచకితుడై సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆడబోయిన తీర్థమే తనకు ఎదురైందని ఆయన ఆనందించాడు.

వరదరాజస్వామి ఆజ్ఞను మహాపూర్ణుడికి విన్నవించి, తనను శిష్యుడిగా స్వీకరించమని వినయంగా రామానుజులు ప్రార్థించారు. శ్రీరంగంలోనే ఉన్నప్పటికీ మహాపూర్ణుడికి వరదరాజస్వామియే కులదైవం. తన గృహార్చనలందుకొనే వరదుడు, రామానుజులద్వారా అందించిన ఆజ్ఞ తన గురువు అభిమతాన్ని నెరవేర్చేదేకావడం మహాపూర్ణుడికి మహదానందాన్ని కలిగించింది. ప్రేమతో రామానుజుల్ని ఆయన ఆలింగనం చేసుకొని ఆశీర్వదించాడు.

అటు కంచికి పోదామన్నారు మహాపూర్ణులు. రామానుజులు అంగీరించలేదు. పోనీ ఆలయంలోకైనాపోయి అక్కడ పంచ సంస్కారాలు చేస్తానన్నారు మహాపూర్ణులు. పై క్షణానికి ప్రాణము ఉంటుందో లేదో తెలియదు. మనస్సులో ఏ మార్పులొస్తాయో కూడా తెలియదు. అందుచేత వెంటనే ఇప్పుడే, ఇక్కడే తనకు దీక్షనిచ్చి తరింపచేయుమని తన త్వరను ప్రకటించారు రామానుజులు. మహాపూర్ణుల ఆనందానికి అవధులు లేవు.

అప్పటికి రామానుజులకు 32 సంవత్సరాలు. మహాపూర్ణుడికి 52 సంవత్సరాల వయస్సు, రామానుజులను పుత్రసమానుడిగా స్వీకరించి, చెరువు గట్టునే పంచ సంస్కారాలనందించాడు మహాపూర్ణుడు.

శ్రీ వైష్ణవ సంప్రదాయంలో గురువు ద్వారా శిష్యుడు 'అష్టాక్షరీ మంత్రోపదేశాన్ని' పొందే విధానం పంచసంస్కారాలతో పరిపుష్ట మౌతుంది. మహాపూర్ణుడు శ్రీరామచంద్రుని సన్నిధానంలో తనకు

జ్ఞానజన్మను ప్రసాదించినందుకు రామానుజులు పరమానందభరితు డయ్యాడు.

దంపతులిద్దరూ తనతోపాటు కంచికివచ్చి ఆతిధ్యాన్ని స్వీకరించి, వైష్ణవతత్త్వాన్ని ఎరుక పరచి ధన్యుడిని చేయవలసిందిగా రామానుజులు గురువును వేడుకొన్నాడు. తన ఆచార్యుడైన యామునుల కడపటి కోరికను నెరవేర్చే లక్ష్యంతో శ్రీరంగం నుండి కంచికి బయలు దేరిన మహాపూర్ణుడు తన కార్యాన్ని వరదుడు ఇంత సులభతరం చేసినందుకు ఆ దేవదేవుడికి అంజలి ఘటించాడు. గురువునూ, గురుపత్నినీ తీసుకొని రామానుజులు కంచికి చేరాడు.

నూతన అతిథులను చూసిన తంజమాంబ తనకు కొత్త తలనొప్పులు ప్రారంభమయ్యాయని భావించింది. ''భర్తను భక్తిలో ముంచడానికి కాంచీపూర్ణుడు ఒక్కడే చాలనట్లు ఇప్పుడు శ్రీరంగం నుండి ఈ మహాపూర్ణుడు కూడా దిగబడ్డాడు. ఉన్న వెఱ్ఱి చాలనట్లు తన భర్త కొత్తపైత్యాన్ని కొంప మీదకు తెచ్చాడని'' ఆమె యాష్టపోయింది. రామానుజులపై చూపలేని అసంతృప్తిని, కోపతాపాలను తంజమాంబ వ్యంగ్యంగా మహాపూర్ణుడి ఇల్లాలిపై చూపసాగింది.

మహాపూర్ణుని భార్య గొప్ప సాధుశీలి. తంజమాంబ మనస్తత్వాన్ని అర్థంచేసుకొని సర్దుకుపోతూండేది.

ఆడవాళ్ళ వ్యవహారం ఇలా ఉండగా, మహాపూర్ణుల, రామానుజుల సత్సంగ గోష్ఠి పరమాద్భుతంగా జరుగుతున్నది. వేదవ్యాస, పరాశరులు,

ఆళ్వారులు కలసి ఆవహించి మాట్లాడుతున్నారా అన్నట్లుగా సాగిన మహాపూర్ణుని వాగ్వైభవం రామానుజులకు క్రొత్త తాత్త్విక అర్థాలను తెలిపింది. దైవం అర్చాస్వరూపాన్ని స్వీకరించి మనల్ని అనుగ్రహిస్తున్నవైనాన్ని మహాపూర్ణుడు వివరిస్తుంటే రామానుజులు సందేహాలు మటుమాయం కాసాగాయి.

చేతనా చేతనాలతో కూడిన ఈ జగత్తు అంతటినీ ఆవరించిన ఆ దైవం, అల్పుడు, అధికుడు అని తేడా చూపకుండా తన అనుగ్రహాన్ని అర్చారూపంలో మనకు ఎలా అందిస్తున్నాడో ఆళ్వార్ల బోధనల ద్వారా మహాపూర్ణుడు వర్ణిస్తుంటే రామానుజుల దేహం భక్తి భావంతో పులకరించింది.

ఇలా ఆరు నెలల పాటు నిర్విరామంగా సాగుతున్న భగవద్వైభవ గోష్ఠికి హఠాత్తుగా ఆటంకం ఏర్పడింది. రామానుజులు వరదరాజ స్వామి సేవకై గుడికి వెళ్ళి ఇంటికి వచ్చారు. యథాప్రకారం ఎప్పటిలాగే మహాపూర్ణుల రాకకోసం రామానుజులు సత్సంగ గోష్ఠి స్థలంలో ఎదురు చూస్తున్నారు.

ఎంతసేపైనా మహాపూర్ణుల జాడ తెలియలేదు. ఆతృతతో ఆయన ఉన్న విడిదికి వెళ్ళి చూసారు రామానుజులు. భార్యా భర్తలిరువురూ అక్కడలేరు. ఇరుగు పొరుగు వారిని వివరాలడిగారు. విషయం తెలిసిన రామానుజులు మనస్సు వెయ్యి ముక్కలయ్యింది. ఆ వేళ తన భార్య తంజమాంబ వ్యవహారం శ్రుతిమించి రాగాన పడిందని ఆయనకు అర్థమైంది. మంచినీటి బావి దగ్గర తంజమాంబ మహాపూర్ణుని భార్యను

అధిక్షేపిస్తూ మాటలాడింది. ఆ దొడ్డ ఇల్లాలికా క్లేశం భరింపరాని స్థాయికి వెళ్ళింది.

రామానుజుల సంసారంలో తాము గొడవలకు కారణమౌతున్నామని గ్రహించిన ఆ ఉత్తమ దంపతులు ఊరిని వదలి వెళ్ళాలని నిశ్చయించుకొన్నారు. రామానుజులకు చెప్పి ఆయనను బాధ పెట్టడం ఇష్టంలేక గుట్టుచప్పుడు కాకుండా మహాపూర్ణులు శ్రీరంగానికి బయలు దేరారు. ఈ విషయం తెలిసిన రామానుజుల హృదయం బాధతో విలవిల్లాడి పోయింది.

తంజమాంబకు తనమీద ఉన్న ప్రీతి రామానుజులకు ఎఱుకే. అయితే తన కేదో మేలు చేస్తున్నానని భావించి, ఆమె తన చేష్టలతో దు:ఖ భారాన్ని రెట్టింపు చేస్తున్నది. ఆమె తనకి సుఖ, దు:ఖ స్వరూపి అయింది. అర్ధాంగిగా ఆమె ప్రవర్తన ఆమె దృష్టిలో దోషం కాదు. తనకు నచ్చని పనులు చేయవద్దంటే ఆమెకు దు:ఖం. ఆమె మెచ్చే పనులు చేయాలంటే తనకు కష్టం.

ఒకరికొకరు పరస్పరం "మీది తప్పంటే మీది తప్పని" దూషించు కొంటూ సాగించే కలహాల కాపురం ఎప్పుడూ నరక సదృశమే అవుతుంది. ఇంటిని నరకంగా మార్చడం ఇష్టపడక రామానుజులు నేరుగా వరదరాజ స్వామి సన్నిధికి చేరారు. తన సంసారపు సమస్యకు పరిష్కారం చూపవలసిందిగా ఆ సర్వ మంగళ స్వరూపుని ముంగిట రామానుజులు మోకరిల్లాడు. "వరద రాజా ! నీ పాదాశ్రితులతో నిరంతర

నెయ్యాన్ని నీ లీలా విలాస గాథల స్మరణను నాకు వ్యసనంగా మార్చావు. ఇల్లాలు, పిల్లలు, ఇల్లు వాకిళ్ళు అంటే వెగటు పుట్టించి వింత చూస్తున్నావు.

అవివేకపు మేఘాలు సృష్టిస్తున్న దుఃఖాల జడివానలో మునిగి దిక్కుతోచక దిగులుగానున్న నా స్థితికి ఎవరిని దోషులుగా చూపగలను? దేవరాజా ! మకరి నోటికి చిక్కి కాలు కదుపలేని కరిరాజును కాచిన దయను కొంచెమైనా నాపై చూపి వెంటనే కర్తవ్యాన్ని ఉపదేశించవూ!" అంటూ రామానుజులు పరిపరివిధాల వరదరాజస్వామిని వేదనతో వేడుకొన్నారు. ధ్యాననిమగ్నుడైన రామానుజులకు విష్ణు పురాణాంతర్గతమైన ఓ సందేశం స్ఫురణకు వచ్చింది.

"సుఖ దుఃఖ, తటస్థానుభవాలు జీవులకు ఆయావిషయాల సంపర్కంచేత ఏర్పడుతుంటాయి. అయితే ఈ అనుభవం విషయ రూపంలో ఉన్న వస్తువులో ఉన్నదా? ఆలోచిస్తే ప్రపంచంలో ఏ వస్తువూ, వ్యక్తీ, విషయమూ, సుఖరూపంగానో, దుఃఖ రూపంగానో, తటస్థ రూపంగానో ఉండటం లేదు. ఒకే వస్తువు లేదా వ్యక్తి లేదా విషయం మనకు దుఃఖానికి, సుఖానికి, ఈర్ష్యకు, కోపానికి కూడా కారణ మౌతున్నది. కనుక వస్తువును బట్టి కాక కర్మ సంబంధంచేత మనకు వివిధ అనుభవాలు లభిస్తున్నాయి. ఆ పరబ్రహ్మము తప్ప సమస్త వస్తుజాలము కర్మసంబంధంచేత తాత్కాలికమైన దుఃఖాది అనుభవాలకు కారణమౌతున్నది. వివేకవంతుడు ఇది తెలిసి పరమాత్మను ఆశ్రయించి స్థిరమైన సుఖానుభవం పొందుతాడు".

ఈ వాక్యాలు గుర్తుకు రాగానే రామానుజుల మనస్సు వరదరాజ స్వామి పాదాల చెంతకు చేరింది. "ప్రభూ! నీపద ప్రాప్తికి విరోధం కాని కోరికలనే నీవు నెరవేర్చు! నీవు సర్వులకూ హితుడవు. సమస్త ఫలాలను అనుగ్రహించెడివాడవు. దేవా! నీ దాస్యరుచిని నామనసుకు అలవరచినావు. బ్రహ్మ శివాది పదవులు, స్వర్గమోక్షాదులు నాకు ఉప్పునీరువలె విడువదగినవి.

దయానిధీ! నీ గుణ గానమును చేసే బుద్ధి నిచ్చి నీసేవకు నన్ను కట్టి వేసావు. ఇక అన్య విషయ చింతన నాకేల? నీ ఊడిగమే నాకు ఉజ్జీవ కారణము'. అంటూ రామానుజులు తన అంత: కరణాన్ని ఆ హస్తగిరినాధుని వశంచేశాడు. రామానుజులకు కర్తవ్యం బోధపడింది. భార్యను నొప్పించకుండా, ఆమె పుట్టింట జరగనున్న శుభకార్యాన్ని వ్యాజ్యంగా చేసుకొని ఆమెను అక్కడకు పంపాడు.

అనంతరం గృహస్థాశ్రమానికి స్వస్తి పలికి వరదరాజ స్వామి చెంత కాషాయ వస్త్రాలను ధరించి త్రిదండాన్ని కమండలును చేపట్టి సన్యాస దీక్షను స్వీకరించారు.

## శ్రీవత్సాంక మిశ్రులు

"సత్యమైన ధర్మ మార్గాన్ని నిర్ణయించడం చాలా కష్టం. అది లోతైన హృదయాంతరాళాల్లో దాగి ఉంది. అందుచేత తెలివైన వారు వివేకవంతులైన తమ పూర్వీకుల బాటను అనుసరిస్తారు". - మహాభారతం

కంచి పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో కూరం అనే ఒక అగ్రహారం ఉన్నది. శ్రోత్రియ బ్రాహ్మణుల నిలయమైన ఈ గ్రామానికి అధిపతి అనంత భట్టారకుడు. హారీత గోత్రుడైన ఆ వేద పండితుని కుమారుడు శ్రీవత్సాంక మిశ్రుడు.

వేద శాస్త్రాదులలో అపార పాండిత్యం సంపాదించిన శ్రీవత్సాంక మిశ్రుని భార్య ఆండాళ్ కూడా గొప్ప ప్రజ్ఞాశాలి. వారిరువురిదీ అనుకూల దాంపత్యం.

శ్రీవత్సాంకుని హృదయసంపద ఎంతో గొప్పది. ఆయన ఏర్పరచిన ధర్మశాల అన్నార్తులకు ఆకలిని తీర్చి అభయమిచ్చే భాగ్యశాల. 'రండి ! భోజనం చేయండి'. అంటూ ఆత్మీయంగా అతిథుల చెవులకు అమృత జల్లులా సాగే ఆదరణ వాక్యాలెప్పుడూ ఆ ప్రాంగణంలో వినపడేవి. వికలాంగులు, వృద్ధులు, అనాథలు, దీనులు.....ఇలా ఎందరో ఆపన్నులను ఆదుకొనే కేంద్రం ఆయన ఇల్లు. రాత్రింబవళ్ళు విసుగు విరామం లేకుండా శ్రీ వత్సాంకుని దంపతులు ఆర్తజన సేవావ్రతాన్ని కొనసాగించారు.

శ్రీవత్సాంకుని సేవానిరతి చుట్టు ప్రక్కల గ్రామాలలో బహుళ ప్రచారం పొందింది. రోజూ అంతో ఇంతో సాయం పొంది కృతజ్ఞతతో ఆ దంపతులను ఆశీర్వదించి వెళ్ళే ప్రజలకు లెక్కలేదు.

వారంతా శ్రీవత్సాంక మిశ్రుడిని ప్రేమతో **'కూరేశుడని, కూరనాథుడని'** పిలిచేవారు. అభాగ్యులపట్ల ఆయన చూపే వాత్సల్యం, ఆదరణ ఆయన కీర్తిని సుదూర ప్రాంతాలకు విస్తరింపచేసాయి.

సంపద గర్వమూ, పాండిత్య గర్వమూ, పుట్టుక గర్వమూ,అంటే, ధన మదము, విద్యా మదము, అభిజన మదమూ అనే మదత్రయం లేని వినయ శీలి శ్రీ వత్సాంక మిశ్రుడు. వరదరాజ స్వామికి భక్తుడైన శ్రీవత్సాంకుడికి కాంచీపూర్ణుడి ద్వారా రామానుజులతో పరిచయ మేర్పడింది. అతి తక్కువ కాలంలోనే ఆ పరిచయం స్నేహమై ఆత్మీయంగా ఒకరికొకరిని దగ్గరకు చేర్చింది.

రోజుల తరబడి వారిమధ్య సాగిన వేదాంతచర్చ వారి మధ్య సాన్నిహిత్యాన్ని బాగా పెంచింది. రామానుజుల సునిశిత వేదాంత దృక్పథం, ఋజుత్వం, సౌశీల్యం శ్రీ వత్సాంకుడిని కట్టిపడవేసింది. శ్రీ వత్సాంకుడి హృదయ సౌకుమార్యం, సునిశిత పాండితీ ప్రతిభ రామానుజులను ఆకట్టుకొంది.

శ్రీవత్సాంకుడికి రామానుజులతో స్నేహం వ్యసనమైంది. రామానుజులతో మాట్లాడకుండా రోజు గడపలేని స్థితి శ్రీవత్సాంకుడికి ఏర్పడింది. ఇద్దరూ అత్యంత ఆప్తమిత్రులయ్యారు. అరమరికలు లేకుండా వారు తమ ఆలోచనలను పంచుకొన్నారు.

దైవానుగ్రహాన్ని పొందడానికి రామానుజులు పడుతున్న పరితాపం, ఆ క్రమంలో - రామానుజుల శ్రీరంగం ప్రయాణం, మహాపూర్ణుని శిష్యరికం అన్నీ శ్రీవత్సాంకుడికి ఎరుకే. రామానుజులు వరదరాజ స్వామి వద్ద సన్యాసాశ్రమం స్వీకరించిన ఘట్టంలో కూడా శ్రీ వత్సాంకుడు తోడుగా వెంట నిలచి ఉన్నాడు.

శ్రీరామానుజులు హఠాత్తుగా గృహస్థాశ్రమాన్ని విడచి సన్యాసాశ్రమం స్వీకరించారన్న సమాచారం కంచిలోనే కాదు, కూరం అగ్రహారంలో కూడా పెనుసంచలనం కలిగించింది. అగ్రహారంలోని శ్రోత్రియబ్రాహ్మణ స్త్రీలు ఈ విశేషవార్తపై పలువ్యాఖ్యానాలతో వాదోపవాదాలు సాగించారు. ఆ చర్చ చివరికి ఆండాళ్ చెవికి చేరింది. ఓ రోజు ఆండాళ్ అమ్మలక్కల సంవాద సారాన్ని తన సందేహాలతో మిళితంచేసి భర్త ముందుంచింది.

"రామానుజులు వయస్సులో మీకన్నా ఎనిమిదేళ్ళు పిన్నవారు. మీకిప్పుడు 40 సంవత్సరాలు. వారికి 32 ఏళ్ళు. మీరిరువురూ వేదాలను ప్రమాణంగా స్వీకరించి జీవిస్తున్న పండితులు. శాస్త్రమర్యాదలు తెలిసిన విజ్ఞులు. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమ ధర్మాలను మానవ జీవిత క్రమ వికాసాన్ని కలిగించే కర్మ మార్గమని కదా వేదం నిర్ణయించింది.

వేద మంత్రాల సాక్షిగా ధర్మార్థ కామ మోక్షాలను కలసి సాధిస్తామని ప్రతిజ్ఞ చేసి మీ మిత్రుడు మీలాగే గృహస్థాశ్రమం స్వీకరించారు. 16 ఏళ్ళు కాపురం చేసి ఇప్పుడు భార్యను అర్థాంతరంగా వదలి వారు కాషాయం స్వీకరించడం ఏమి ధర్మం? కర్మిష్ఠి అయిన ఓ బ్రాహ్మణ పండితుని భార్య అడిగిన ఈ ప్రశ్నను మీ ముందు ఉంచుతున్నాను".

'తన ఆత్మే ప్రపంచంలో కెల్లా విలువైనదనీ, ప్రాపంచిక బంధాల నుండి తానొక్కడే విముక్తి పొందాలనీ భావించడం స్వార్థం కాదా? జీవిత చరమాంకంలో స్వీకరించాల్సిన సన్యాసాశ్రమాన్ని ముందుగానే

స్వీకరించడం గృహస్థాశ్రమ బాధ్యతల నుండి పారిపోవడమే కదా' అని మరొక తర్క విద్వాంసుని భార్య లేవనెత్తిన సందేహం. 'దానికి మీ సమాధానమేమిటి?' అంటూ ఆండాళ్‌భర్త ముందు పలు ప్రశ్నలుంచింది.

'భార్య ప్రశ్నలు శ్రద్ధగా ఆలకించిన శ్రీ వత్సాంకుడు ఓ చిరునవ్వు నవ్వి నెమ్మదిగా,' రంధ్రాన్వేషణలో ఉన్న ఉబలాటం ఈ లోకానికి సత్యాన్వేషణలో ఉంటే ఎంతో బాగుపడేది కదా! మానసిక జాడ్యం చేత కొందరు ఉత్తములలో సైతం దోషదర్శనం చేసి ఆనందిస్తారు. అలాంటివారు మనకు ఆదర్శం కాదు. మనకు రామానుజులు ఆత్మీయుడైన మిత్రుడే కాదు అంతకుమించి అనుసరించి తీరాల్సిన ఉత్తమ ఆచార్యుడు.

చావు పుట్టుకల పరంపరకు కారణమైన రాగద్వేషాల వ్యామోహానికి తలవంచక దైవానికి దాసుడైన యతి మన రామానుజులు. ఆయన భగవతుని గూర్చి తెలిపే జ్ఞాన భాండాగారమే కాదు, ఆ దైవం యొక్క ప్రేమ పరిమళాలను లోకానికి గుబాళింప చేసేందుకు సిద్ధపడ్డ నడిచే చందనపు ముద్ద.

ఆయన ప్రాపంచిక సమస్యల నుండి పారిపోవడానికి సన్యాసం స్వీకరించలేదు. ప్రపంచానికి సమస్యల తరంగాల నుండి బయటపడే దారిచూపే నావికుడిగా జీవించడానికి త్రిదండాన్ని స్వీకరించారు. సాంఘిక బంధనాలనుండి తప్పించుకొనేందుకు ఆయన ఇల్లు వదలి పెట్టలేదు. సాంఘీక జీవనంలో మార్పును సాధించడానికి సన్యాస మార్గాన్ని స్వీకరించారు.

కాషాయంబరధారియై, భిక్షా పాత్రను స్వీకరించి కంచి వీధుల్లో సంచరిస్తున్న రామానుజుల కళ్ళల్లో కనిపిస్తున్న తృప్తి నన్ను కట్టివేస్తున్నది. ధ్యానం, ప్రార్థన, ఉపవాసాది నియమాలతో జీవిస్తున్న ఆ వినయశీలిలో వ్యక్తమౌతున్న దైవశక్తి "నన్ను అనుసరించమని" శాసిస్తున్నది. ఆయన పవిత్ర జీవనంలోని సౌందర్యం నన్ను వ్యామోహపరుస్తున్నది. ఈ మహానుభావుడు మంత్రాలు, మాయలు, మహిమలు చూపి నన్ను లోబరుచుకోలేదు. అనంతుడైన పరమాత్మకు జీవితాన్ని సమర్పించడం లోని ఆనందాన్ని రుచిచూపి నన్ను వశపరచుకొన్నాడు.

"ఓ సతీమణీ ! శ్రద్ధగా విను. మనకు దిక్కు, దారి, సంపద సర్వమూ ఈ రామానుజులే. ఆయనను అనుసరించడమే మన ఉత్తమ ధర్మం. వ్యర్థ ప్రసంగుల నిరర్ధక శంకలు మనకు అనవసరం. విశ్వసించు. రామానుజుల ఆశ్రయం ఆధ్యాత్మిక సాధకుల స్వర్గం. ఆయన సన్నిధి మన సంశయాలను, భ్రమలను, దుఃఖాన్ని దూరం చేస్తుంది. ఆయన పద సన్నిధిని దూరంచేసే భోగభాగ్యాలు, బంధు మిత్రులు మనకు అవసరం లేదు. గుర్తుపెట్టుకో". అని తన నిశ్చయాన్ని భార్యకు స్పష్టం చేశాడు శ్రీవత్సాంకమిశ్రుడు.

వివేకవంతురాలైన ఆ ఇల్లాలు భర్తమనసెరిగి, అనుసరించడానికి సిద్ధపడింది. వరదరాజ స్వామి సన్నిధికి సమీపంగా రామానుజులు తన మఠాన్ని ఏర్పరచుకొన్నారు. కంచికి తూర్పుదిక్కున ఉన్న పురుషమంగళంలో నివసిస్తున్న అనంతనారాయణ దీక్షితుడు,

భూమినాచ్చియార్‌ల కుమారుడైన దాశరథి రామానుజులకు తొలిశిష్యుడయ్యాడు. దాశరథి రామానుజులకు పూర్వాశ్రమంలో మేనల్లుడు. రామానుజుల కన్నా పదేళ్ళు చిన్నవాడు. తన తండ్రి దగ్గర సంస్కృత, ద్రావిడ భాషలలో పాండిత్యాన్ని పొంది మేనమామ వద్ద వేదాంతాన్ని అభ్యసించాలని క్రీ.శ 1044లో కంచికి విచ్చేశాడు. అప్పటికి రామానుజుల వయస్సు 27 సంవత్సరాలు ఆ నాటి నుండి దాశరథి రామానుజుల వద్ద వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేస్తూ వచ్చాడు. ఇయననే 'ముదలియాండాన్' అంటారు.

రామానుజులు సన్యాసాశ్రమం స్వీకరించిన అనంతరం దాశరథి పంచసంస్కారాలు పొంది తొలి శిష్యుడయ్యాడు. కూరత్తాళ్వాన్ ద్వితీయ శిష్యుడయ్యాడు. మరికొన్నాళ్ళకు రామానుజుల మరో మేనల్లుడు 'వరదవిష్ణు' రామానుజుని ఆశ్రయించి మరో శిష్యుడయ్యాడు. ఇతడు 'నడాదూరు ఆళ్వాన్'గా లోకప్రసిద్ధి చెందాడు. క్రమంగా రామానుజుల మఠం భక్తసందోహంతో కిటకిటలాడ సాగింది. తాత్త్విక చర్చలతో, ఆధ్యాత్మిక ప్రసంగాలతో రామానుజులు కొనసాగిస్తున్న మఠకార్య కలాపాలు జిజ్ఞాసువులను సుదూర ప్రాంతాల నుండి కూడా ఆకర్షించసాగాయి.

ఈ క్రమంలోనే రామానుజుల పూర్వాశ్రమంలోని గురువు యాదవప్రకాశులు రామానుజులకు శిష్యులై తరించారు. తనమీద గౌరవంకలిగి, వినయవిధేయతలుండీ, హానిచేసానని తెలిసినా పల్లెత్తు మాట లేకుండా అభిమానించిన రామానుజుల విషయంలో తను

చూపిన విధానం అనుచితమని, అంత క్రూరంగ తాను ఉండకుంటే బాగుండేదని యాదవప్రకాశుని హృదయం పలువిధాలుగ పరితపించసాగింది. కంచి వరదరాజస్వామి ప్రేరణ, తన తల్లిగారి ప్రోత్సాహము తోడుకాగ, కాంచీపూర్ణుల చొరవతో యాదవప్రకాశులు, రామానుజమతానికి విచ్చేసారు. తనకు గురువైన యాదవప్రకాశుని ఆదరించి, సత్కరించారు రామానుజులు.

పంచసంస్కారాల విషయంలో వారికుండే సంశయాలు తీర్చారు. సంతృప్తులైన యాదవప్రకాశులు మనస్ఫూర్తిగ పంచసంస్కార పూర్వకంగ యత్యాశ్రమాన్ని స్వీకరించారు. వారికి 'గోవింద జీయరు'గ నామకరణం చేసారు. వారే తదుపరి 'యతిధర్మసముచ్ఛయ'మనే ధర్మశాస్త్రగ్రంథాన్ని సన్యాసదీక్షలు, నియమాల విషయంతో వ్రాసి రామానుజులకు సమర్పించారు. ఈ సంఘటన వల్ల రామానుజుల ఖ్యాతి బహుదూరం వ్యాపించింది.



కంచి కేంద్రంగా శ్రీరామానుజాచార్యులనే వైష్ణవధర్మ ప్రచారకుడు సంపన్నులు, సామాన్యులు అన్న తేడా లేకుండా అందరికీ ధార్మిక సందేశాన్ని అందిస్తున్న తీరు లోకోత్తరంగా సాగుతోందన్న వార్త శ్రీరంగంలోని శ్రీ వైష్ణవ బృందానికి కూడా చేరింది.


శ్రీరామానుజుల వంటి గొప్పనాయకుడు శ్రీరంగం కేంద్రంగా వైష్ణవ ధర్మ ప్రచారం చేయాలని గతంలోనే యామునాచార్యులవారు అభిలషించారు. ఆ కోరిక నెరవేరకుండానే వారు దైవ సన్నిధికి చేరారు. శ్రీయామునాచార్యుల శిష్యుడైన మహాపూర్ణులు రామానుజులకు ప్రియతమ గురువు అయ్యారు. కానీ రామానుజులు శ్రీరంగానికి వచ్చేటట్లుగా ఆకర్షించలేకపోయారు. యామునాచార్యుల కుమారుడు, ముఖ్యశిష్యుడూ అయిన ‘‘తిరువరంగపెరుమాళ్ అరయర్’’కు రామానుజులను శ్రీరంగానికి రప్పించే బాధ్యతను శ్రీవైష్ణవగోష్ఠి అప్పగించింది.

తిరువరంగపెరుమాళ్ అరయర్ అద్భుతమైన గాయకుడు. ఆళ్వార్లు రచించిన స్తోత్రాలను ప్రబంధాలను రసవత్తరంగా గానం చేస్తూ నృత్యం చేయడంలో ఆయన దిట్ట. భగవంతుడిని, భక్తులను, తన నృత్యాభినయంతో, గానామృతంతో పరవశింపచేసే శక్తి అరయర్ సొత్తు. అరయర్ శ్రీరంగం నుండి కంచికి వచ్చి వరదరాజస్వామి సన్నిధిలో తమిళ భాషలో ఆళ్వార్లు పాడిన పాశురాలను పరమాద్భుతంగా గానం చేయసాగారు. భక్త సమూహం యొక్క చప్పట్లతో, ప్రశంసలతో, మండపం చక్కటి సంగీత వాయిద్యాలతో, దివ్యగానంతో మైమరిపింపచేసే

నృత్యభంగిమలతో అరయర్ భగవంతుని కీర్తించిన విధానం అక్కడున్న వారందరినీ మంత్రముగ్ధులను చేసింది.

వరదరాజస్వామి యొక్క అర్చక ప్రముఖుడు దివ్యావేశంతో "అరయరే! మీ దివ్యగానంతో వరదులమైన మేము సంతోషించాం. మీకు మేము ఏమిచేయగలము? సంకోచము వదలి చెప్పండి!" అన్నాడు.

అర్చక ప్రముఖుని పలుకులతో అక్కడి సభ అంతా ఏకగ్రీవంగా తమ ఆనందాన్ని, ఆమోదాన్ని తెలుపుతూ హర్షధ్వానాలు చేశారు. ఆ గాన మాధుర్యంతో పరవశించిపోయిన రామానుజాచార్యులు సైతం దానికి ఆమోదించారు. సందడి తగ్గాక అరయర్‌స్వామి నెమ్మదిగా, తన అభిమతాన్ని బయట పెట్టాడు. 'ఆడినమాట తప్పే అలవాటులేని కరుణాలవాలా! తమ సోదరులైన శ్రీరంగరాజు తన శ్రీరంగక్షేత్రాన్ని చక్కగ తీర్చిదిద్దేశక్తి తమవద్దకల శ్రీరామానుజులవారికున్నది కనుక,



వారిని శ్రీరంగక్షేత్రాభివృద్ధికై తక్షణమే పంపించమని ప్రార్థన' ఆ వరాన్ని ప్రసాదించు!. జనంతో నిండిన వరదరాజస్వామి ఆలయ మండపంలో కొద్దిసేపు నిశ్శబ్దం ఆవహించింది. వస్త్రాలు, ఆభరణాలు, పల్లకీలు, బిరుదులు కోరుతాడనుకుంటే, శ్రీరంగం నుండి వచ్చిన ఈ గాయకుడు కంచికి కిరీటంగా నిలచిన రామానుజులనే కోరుకున్నాడే!

వరదరాజస్వామి సన్నిధిలో ఆనందతరంగాలతో నిండిన గాన మండపం ఒక్క క్షణంలో 'త్యాగమండపం' అయిపోయింది. రామానుజులు సభ ఆదేశాన్ని శిరసావహించారు. వరదరాజ స్వామికి నమస్కరించి అరయర్‌ను అనుసరించడానికి సిద్ధపడ్డాడు. దాశరథిని మఠంలో ఉన్న తన వరదరాజస్వామి ఆరాధనా మూర్తులను తీసుకొని రమ్మనమని ఆజ్ఞాపించి, రామానుజులు వరదరాజస్వామి సన్నిధినుండి నేరుగా శ్రీరంగానికి బయలుదేరారు.

కంచిని త్యాగమండపం చేసి, తనను ఒంటరిగా వదలి వెళుతున్నారు రామానుజాచార్యులు. రాబోయే కాలానికి ఉజ్జ్వలమైన సిద్ధాన్తాన్ని, సత్సంప్రదాయాన్ని అందించడానికీ త్యాగం నాంది. శ్రీరంగం సంప్రదాయానికి కేంద్రం కావాలి. ఈసిద్ధాన్తాన్ని ఆచరణయోగ్యం చేయగల యోగ్యత కలవారు రామానుజులు మాత్రమే. తృప్తితో ఆలయంలోంచి వరదరాజస్వామి ఆశీర్వదించాడు అర్చకముఖంగ. మిగిలిన భక్తగోష్ఠి కన్నీటితో వీడ్కోలు పలికింది.

# శ్రీరామానుజులు- శ్రీరంగంలో సాగిన ఆలయసంస్కరణ

ప్రపంచంలో ఏ మానవుడైనా సమాజంతో కలిసేమనుగడ సాగించాలి. త్యాగ ధనులై, సహనశీలురై, విశేషించి, ప్రాణికోటియందు దయ కలవారే ఈ సమాజాన్ని సంస్కారవంతంగ సరిదిద్దగలరు. అరుదుగా ఉండే అలాంటి మహనీయులనే **'ఏతే సత్పురుషాః'** అంటారు. ఆ కోవకు చెందిన వారు శ్రీభగవద్రామానుజులు.

సమాజాన్ని సన్మార్గంలో పెట్టాలంటే మనలో సమాజంపై పరిపూర్ణమైన అవగాహన, స్నేహముండాలి. మనలో వాటిని పెంచుతూ సమాజాన్ని ఏకసూత్రంలో కూర్చడానికి ఏర్పడ్డ స్థలాలు ఆలయాలు. ప్రేమ కలవారందరినీ ఒకచోటికి చేర్చే ఉజ్జీవన కేంద్రాలవి. అందరిలో విశ్వాసాన్ని కలిగించి పోషించే స్థానాలు. నిజానికి ఆలయాలు వైదికధర్మానికి నిలయాలు. దైవంద్వారా సమాజం చైతన్యవంతమై ఉత్తమ సంస్కారాన్ని అందుకొనే ఆస్థానకేంద్రములు కూడా ఆలయాలే.

వాటిని నిర్వహించే అధికారులు, ఉత్తమసంస్కారయుక్తులుగా, భగవంతుని విభూతియందు, చుట్టు ప్రక్కలయుండే సమాజం పట్ల ఉదారమనస్కులై ఉండాలి. ఆలయధర్మకర్తలలో అలాంటి సంస్కారం కొరవడితే ఆ ఆలయాల శాస్త్రీయమైన వ్యవస్థ, ఆ పరిసర ప్రాంతాల ప్రగతి కొరవడి ప్రజలు ధార్మిక స్థితినించి దిగజారుతారు. వ్యాపార, విలాస ధోరణులే మిగులుతాయి. యాంత్రిక జీవనమవుతుంది. సేవాభావం కొఱవడి అనురాగాలు, ఆప్యాయతలు కనుమఱుగౌతాయి.

యౌవనం, ధన-సంపదలు, అధికారం, అవివేకం అనే ఈ నాలిగింటిలో ఒక వ్యక్తిని పెడదారి పట్టించడానికి ఒక్కొక్కటే చాలును. ఇక ఈ నాలుగు ఒకచోట కలిసుంటే అలాంటి వాడి సంగతి చెప్పనవసరం లేదు.

ఆలయనిధులతోవిలాసాలననుభవించడానికి అలవాటు పడినవాడు, దైవానికి చెందిన సంపదలను తాననుభవిస్తూ ఆ దైవాన్నే తిరస్కరిస్తాడు. తనకు హితాన్ని చెప్పే పెద్దలను అనాదరిస్తాడు. తన అహంకారానికి అడ్డు చెప్పే వారు గురువులైనా, మరొకరైనా లెక్కపెట్టడు సరికదా వారికి అపాయాన్ని కలిగించడానికైనా వెనుకాడడు. వానికి యుక్తాయుక్త వివేచనము లోపిస్తుంది. ఇలాంటి సన్నివేశాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి.

అలాంటి స్థితి-గతులను మార్పు చేసి సమాజానికి హితాన్ని సమకూర్చాలని భగవంతుడు సంకల్పించి అనూహ్యములైన పరిణామాలను పెద్దలద్వారా లోకానికందిస్తాడు. ఇలాంటి వాతావరణమే అలుముకుని ఉన్న ఆ సమయంలో శ్రీభగవద్రామానుజులు తమ ఆచార్యులైన శ్రీమహాపూర్ణులు మార్గదర్శనం చేయగా, కాంచీపురం నుండి శ్రీరంగక్షేత్రానికి చేరారు. వీరు ఉత్తమాశ్రములై ఆ శ్రీరంగపు ఆలయంలో అడుగు పెట్టారు. ఆనాడు వైష్ణవధర్మానికి మూలస్థానము శ్రీరంగమే. శ్రీరామానుజులకు పరమాచార్యులైన శ్రీయామునాచార్యుల వారు కూడా ఈ శ్రీరంగాన్నే కేంద్రంగా చేసుకొని పరమవైదికమైన

విశిష్టాద్వైతసిద్ధాన్తానికి వన్నె తెచ్చారు. ఇక్కడనుండే భవిష్యకాలంలో రామానుజులు శ్రీవిశిష్టాద్వైత దర్శనానికి, ఈ క్షేత్రానికి నిర్వాహకులు అవ్వాలని శ్రీయామునాచార్య స్వామి గతంలో సంకల్పించారు. ఆ సమయం వచ్చింది. శ్రీరామానుజులు ఆలయపు బాగోగులను గురించి బాగా పరిశీలించారు.

ఆ సమయంలో తిరువరంగత్తముదనార్ అనే మహనీయుడు ఆలయప్రధానధర్మకర్తగా ఉన్నాడు. ఆలయపు అధికారం ఆయన చేతిలో ఉంది. శ్రీరంగనాథుని సేవలు సన్నగిల్లాయి. ఆయన యువావస్థలో యున్నవాడు కనుక విలాసాలకు గురయ్యాడు. యౌవనం, సంపద, అధికారం, అవివేకంలాంటివి ఆయన్ని ఆవరించాయి. ఆయన ఉత్తమవంశానికి చెందినవాడే. బాగా అధ్యయనం చేసినవాడే. విద్యా-ధన-అభిజన, అంటే చుట్టూఉండే మందీ మార్బలం వంటివన్ని ఆయన్ని ఆక్రమించి దైవాన్ని కూడా అనాదరించడానికి కారణమయ్యాయి.

అదే సమయంలో కంచికి సమీపంలో నున్న 'కూరం' అనే గ్రామంలో వివేకసంపన్నులు, మహావిద్వాంసులు అయిన శ్రీకూరత్తాళ్వాన్ అనే జమీందారు ఉండేవారు శ్రీరామానుజులను వీరు ప్రాణప్రదులైన మిత్రునిగ, గురువుగ ఆరాధించేవారు. జ్ఞాన వైరాగ్య సంపన్నులైనవీరు తమ ధనసంపత్తిని శ్రీకంచివరదరాజులకు సమర్పించి శ్రీరామానుజుల సన్నిధానానికే వానప్రస్థులై భార్యతో సహ శ్రీరంగానికి చేరారు.

అక్కడి వ్యవస్థను తీర్చిదిద్దడం శ్రీరామానుజులకు ఒక గట్టి పరీక్షయే. కాని వారు దృఢసంకల్పులు. వివేకంతో పని చేయగలిగే దీర్ఘదర్శులు కనుక వారికి ఉపాయాలకు కొఱతేమిటి?

## తిరువరంగత్తముదనారులను తీర్చిదిద్దుట


ఒకనాడు తిరువరంగత్తముదనార్ అనే ఆలయ ధర్మాధికారికి ఇంట్లో తమ తల్లిగారి శ్రాద్ధతిథి తటస్థించింది. పదకొండవనాడు నిర్వహించే కార్యాలకు భోక్తలుగా మంచి స్వాములు కావాలని ఆయన శ్రీరామానుజులను కోరారు.

సామాన్యంగ ఆనాటి కార్యాలలో పాల్గొనడానికి స్వాములు ఇష్టపడరు. శిష్యులైన స్వాములు చాలమంది శ్రీరామానుజుల దగ్గర ఉన్నారని అముదనార్‌కి తెలిసింది. వారిలోంచి ఎవరినైనా ఈ నూతన సన్యాసి పంపకపోతాడా అని భావించి గత్యంతరంలేక శ్రీరామానుజులను ప్రార్థించారు అముదనార్.

ఇదే మంచి సమయ మనుకొని శ్రీరామానుజులు కూరేశులకు పాఠం చెప్పి పంపారు. మీరు భోక్తగా ప్రసాదాన్ని గ్రహించిన తరువాత 'తృప్తాః స్థ?' మీకు తృప్తి కలిగిందా? అని అడుగుతారు కద! అప్పుడు మీరు 'తృప్తో-స్మి' అని ప్రతివచనం చెప్పవద్దు. అయ్యో! మా పితృదేవతల కర్మ సఫలం కాలేదే ఇంకా మీకేం కావాలని వారు అడుగుతారు. అప్పుడు 'ఆలయపు తాళంచెవులు (అధికారం) మొత్తం మాకు కావాల'ని చెప్పండి.

వారు 'సరే' అని తాళము చెవులు అప్పచెప్పినపుడే **'తృప్తోఽస్మి'** అని సమాధానం చెప్పండి' అని బోధించి పంపారు, శ్రీరామానుజులు రహస్యంగ. అలానే చేసి శ్రీరంగ ఆలయ నిర్వహణనంతనూ శ్రీరామానుజులవారి పాదాల వద్ద అప్పగించారు, కృతజ్ఞతతో శ్రీఅముదనార్ ద్వారా కూరేశులు.

ఈ కూరేశులు చాలా గొప్ప వినయ-విధేయతలు కలవారు. ఆచార్యులైన శ్రీరామానుజులకు కుడి చేయిలాంటివారు. ఆలయపు అధికారాన్నే కాక ఆ అధికారియైన తిరువరంగత్తముదనారులో ఉండే లోపాలను కూడా సోపపత్తికంగా ఒప్పించి, సవరించి ఆయనను సన్మార్గంలోకి తీసుకోరాగలిగారు. మదత్రయం వల్ల దేవుడి ఊరేగింపు కూడా తన ఇంటికే రావాలి. దేవుడే తనకు దర్శనమివ్వాలి. **ఈశ్వరో-**





**హమహం భోగీ** అన్నట్లుగా తమనే సర్వస్వాధికారిగ భావించి, భగవంతుని ఉపచారాలలో లోపాలు కలిగించిన అముదనార్లే ఆతరువాతికాలంలో ఆ కూరత్తాళ్వాన్లను "మదత్రయానికి అతిదూరులు, వర్ణించలేని వైభవం కలవారు" అని స్తుతించారు. శ్రీరామానుజులను 108 తమిళ గానాలతో స్తుతించి, గతంలో ఆచరించిన దోషాలకు పశ్చాత్తాపమును పొందారు, శ్రీరామానుజులే తమకు సర్వస్వమనిచాటుకున్నారు శ్రీఅముదనార్లు. వీరు రచించిన ఆ తమిళగానాలనే **ఇరామానుశ నూత్తందాది** అంటారు.

లోకంలో హితాన్ని చెప్పేవారు దుర్లభులు. పెద్దలు చెప్పింది నాకు హితం అనుకొంటూ వినగలిగేవాడు ఆనాడే దుర్లభులంటే ఇక ఈనాడు అంతకంటే దుర్లభుడు అనేది ఏమి చెప్పాలి? భగవంతుని సేవ బాగా సాగాలి. సేవలందించే అధికారులు, కైంకర్యపరులు నియమ నిష్ఠలతో

సదాచారంతో ఉండాలి. అందులో ఎక్కడా లోటు పాటులుండకూడదని శ్రీరామానుజులు కటిబద్ధులై అస్తవ్యస్తంగా మారిన ఆలయవ్యవస్థను, ఉత్సవాదులను, చుట్టూ ఉండే సమాజాన్ని దీక్షతో తీర్చిదిద్దడం ఆరంభించారు.

స్వతంత్రంగా నడిచే వ్యక్తులకు సవరించేవారు ఎదురైతే కోపతాపాలు కలగడం సహజం. శ్రీరంగం క్షేత్రాన్ని కేంద్రంగా చేసుకొని ఆలయ వ్యవస్థతో పాటు శ్రీభగవద్రామానుజులు తమ విద్యావ్యాసంగాన్ని కూడా పెంచుకో సాగారు. అయితే, ఆలయసంస్కరణలు, దిద్దుబాట్లు అప్పటికే పాతుకుపోయి ఉన్న ఉద్యోగస్థులలో, అధికారులలోనూ అసంతృప్తిని, అనేకసార్లు వ్యతిరేకతని గూడ రేకెత్తించేవి. వాటి ప్రభావాన్ని కొంత ముందుకు సాగాక గమనిద్దాం.

పరమాచార్యులైన యామునమునులు విద్యానిధులను ఎక్కడెక్కడ స్థాపించారో వాటిని ఆ యా పెద్దల సన్నిధిని ఆశ్రయించి గ్రహించమని శ్రీమహాపూర్ణులు శ్రీరామానుజులకాదేశించారు.

# శ్రీరామానుజులు తిరుక్కోట్టియూర్‌నంబినాశ్రయించుట


శ్రీరంగానికి తిరుక్కోట్టియూర్ (గోష్ఠీపురం) సుమారు 100మైళ్ళ దూరం. ఆనాడు గోష్ఠీపూర్ణులు అనే మహానుభావులు ఆ తిరుక్కోట్టియూర్‌లో వేంచేసియుండేవారు. వారు శ్రీయామునాచార్యుల వారి ప్రధానశిష్యులు. వారిదగ్గర కొన్ని తత్త్వార్థాలను తెలుసుకోవాలని శ్రీరామానుజులు కాలినడకతో వారి సన్నిధికి చేరారు. తమకు చరమశ్లోక రహస్యమునుపదేశించమని వినయంగా ప్రార్థించారు. గురువుగారు, మరొకసారి రమ్మని త్రిప్పి పంపించారు. ఇంకొకసారి, మరొకసారి ఇలాగ ఎదురుచెప్పకుండా, వినయం, శ్రద్ధలతో 18 మార్లు తిరిగి వారిని ప్రసన్నులుగా చేసుకొన్నారు శ్రీరామానుజులు. చాలా కట్టుదిట్టమైన నియమాలతో శ్రీగోష్ఠీపూర్ణులు వీరికి చరమశ్లోకరహస్యాన్ని, మంత్రసారాన్ని ఉపదేశించారు.

కోమల సుకుమారగాత్రులైన శ్రీరామానుజులు 18 సార్లు కాలినడకన తిరుగడం గమనించిన ఎందరో ఆయా గ్రామాలలో ఉండే భక్తులైన జిజ్ఞాసువులు, వీరియాత్రకు గల కారణం తెలుసుకొని ఆశ్చర్యపోయేవారు. చిన్నవయసులోనే గురువును మించిన శిష్యునిగ జగత్ప్రసిద్ధి పొందిన యతీశ్వరులు వీరు. వీరికే తెలుసుకోదగిన అర్థాలున్నాయంటే, అవిఎంత గొప్పవై ఉంటాయి? ఇన్నిసార్లు తిరిగే వీరికే అవి లభించడంలేదంటే ఇక తమవంటివారికి అవి పొందడం

దుర్లభమే. 'మరి, మాగతి ఏమిటి?' అంటూ గ్రామాలలో ఉండే ఆ భక్తులు శ్రీరామానుజులవారిని ప్రార్థిస్తూ ఉండేవారు. వారి దీనతకు కరిగిన శ్రీరామానుజులు 'నాకే అది లభిస్తే తప్పక మీకందరకీ దానిని అందిస్తా'నంటూ వాగ్దానం చేసారు.

## గోష్ఠీపురంలోని గోపురమెక్కి మంత్రోపదేశం

ఇంత శ్రమకోర్చి సంయమనంతో శ్రీగోష్ఠీపూర్ణుల సన్నిధానంలో పెన్నిధిగా పొందిన మూలమైన నారాయణ మంత్రాన్ని, తత్త్వార్థాన్ని గతంలోనే చేసిన వాగ్దానాన్ని నిజం చేస్తూ అప్పటికే ఆశతో అక్కడ చేరి యున్న భక్తబృందాలకు గోష్ఠీపురంలోని గోపురాన్ని ఎక్కి ఉపదేశించారు, శ్రీరామానుజులు. ఆచార్యుల అనుగ్రహంతో అందిన ఈ



సంజీవనిలాంటి అమోఘమైన మంత్రం ఈ లోకంలో ఉండగా ఈ జీవరాశి అంతా అజ్ఞానంతో బాధపడుతున్నారే? మా ఆచార్యుల అనుగ్రహంతో ఆర్తి-అభినివేశం కలవారంతా కూడా తరించాలనే ఆర్ద్రహృదయంతో, ఇతరుల అనర్థాన్ని చూడలేక తామేమైనా ఫరవాలేదు. అనుకుంటూ మంత్రాన్ని, దాని రహస్యాన్ని కూడా శ్రీరామానుజులు బహిర్గతం చేసారు.

## గోష్ఠీపూర్ణుల ఆగ్రహం

గురువుగారైన శ్రీగోష్ఠీపూర్ణులకు క్షణాల్లో ఆ విషయం తెలిసిపోయింది. శ్రీరామానుజులను నిలదీసి వారడిగారు. ''నీతో శపథం చేయించి ఎన్నో పరీక్షలు చేసి ఉపదేశించిన మంత్రాన్ని, అందరికి ఎందుకు చెప్పేశావు? నా ఆజ్ఞను ఉల్లంఘించినందుకు ఫలమేమిటో తెలుసునా''? అని ఆగ్రహంతో ప్రశ్నించారు. వారి ప్రశ్నకు సవినయంగా స్పందిస్తూ రామానుజులు సమాధానం చెప్పారు-

## 'నావల్ల లోకం తరిస్తే నేను నరకానికైనా సిద్ధమే'

'స్వామీ ! దీనికి ఫలం రౌరవాది నరకమే'. 'మరి తెలిసి కూడా ఎందుకు అలా అందరికీ చాటి చెప్పావు? అంటూ ఆశ్చర్యపడ్డారు ఆచార్యచరణులు. రామానుజులు చాలా దూరదర్శులు. బాగా ఆలోచించే వారాపని చేసారు.

'స్వామీ! చాలామంది బాధపడ్డంకన్న ఒకడు బాధపడ్డం మంచిది గదా! నేనొక్కణ్ణే కదా! నరకం పాలయ్యేది. వీరంతా మీరందంచిన మంత్రప్రభావంతో దుఃఖసాగరాన్ని దాటుతారు కదా! బహుసంతాపాత్ ఏకసంతాపో వరమ్' అన్నారు శ్రీరామాజులు.

## ద్రవించిన గోష్ఠీపూర్ణులు

ఆ క్షణం చాల ప్రభావం కలిగినది. మరోసారి రామానుజులు గురువును మించిన శిష్యునిగ నిరూపించుకున్నారు. శ్రీరామానుజులకున్న ఓర్పు, దయ, హృదయవైశాల్యం, తమకు నరకమొచ్చినా ఫరవాలేదనగలిగే సాహసంలాంటి గుణాలు, శ్రీగోష్ఠీపూర్ణులను గుండెను కరిగించివేసాయి. వారి హృదయం పులకరించింది. మనసు మారింది. కోపం చల్లారింది. ప్రేమ పొంగింది. వారి నోట మాటలై వెలువడింది ఎమ్-పెరుం-ఆనారే! 'మమ్ము మించి పోయారు కదా' అప్రయత్నంగ గోష్ఠీపూర్ణులన్నారు.

రామానుజులు సామాన్యవ్యక్తి కాదని భావించి **'ఎమ్బెరుమానార్'** అని ఒక అందమైన అపూర్వనామంతో సంబోధిస్తూ శ్రీ రామానుజులను గాఢంగా కౌగలించుకున్నారు శ్రీగోష్ఠీపూర్ణులు. రామానుజా! మాకంటే ఈనాటినుండి మీరే గొప్పవారు 'మాస్వామీ!' అన్నట్లుగా సంబోధించారు. 'మన్నాథ!' అని ఆ తమిళపదానికర్థం. ఆనాటి వరకు సామాన్యులు మంత్రోపదేశం పొందడమనేది ఉండేదే కాదు. ఈ మానవులంతా భగవంతునికి చెందిన వారు కదా! శ్రద్ధ కలవారంతా ఉజ్జీవనానికర్హులే

అని శ్రీరామానుజులకు కలిగిన ఉదారభావాన్ని శ్రీగోష్ఠీపూర్ణులు ఒప్పుకొన్నారు. అట్టడుగుస్థాయిలో ఉన్నవారికి కూడా మంత్రంద్వారా భగవత్సంబంధాన్ని కలిగించిన శ్రీ రామానుజుల చరిత్రలో ఇదొక విప్లవాత్మకమైన ఘటన. అత్యద్భుతమైన సంఘటన.

## 'భవిష్యత్తును మీచేతుల్లో పెడుతున్నా'

ఆనాటి వారుచూపిన ఔదార్యమే శ్రీరామానుజులను ఆలయాలలో ఈనాటికీ ఆరాధింపచేస్తోంది. శ్రీగోష్ఠీపూర్ణులు అతిప్రసన్నులై తమ కుమారులైన తెర్కాళ్వాన్లను శ్రీరామానుజులకు శిష్యులుగా అప్పగించారు. మావలె మంత్రాలకు అర్థాలు చెప్పే జ్ఞానం చాలదు. మీవలె మంత్రార్థాన్ని ఆచరణలో చూపే విజ్ఞానాన్ని మీరు ఉపదేశించగలరు. ఇతణ్ణి అలా తయారు చేయండన్నారు.

శ్రీరామానుజాచార్యులువారు గురువును ధిక్కరించారనే అపప్రథ కొందరికి ఉంది. అది సరికాదు. తెర్కాళ్వాన్‌ని శిష్యునిగ అందించడం ద్వారా శ్రీరామానుజులవారిని గురువుగారు ఆదిలో ఆగ్రహించినా, వెంటనే ప్రసన్నులై ఆశీర్వదించారని స్పష్టమౌతోంది. ఆపై వారు చూపిన దయ, ముందు చరిత్రలో మరింత చక్కగ మనకు గోచరిస్తుంది.

ఆలయపరిష్కారానికి శ్రీరంగంలో శ్రీకారం చుట్టారు రామానుజులు. అస్తవ్యస్తమైన వ్యవస్థను సరిదిద్దడంలో వారు 'స్ఖాలిత్యే శాసితారమ్' అన్నట్లుగా దృఢమైన దీక్షను వహించారు. ఆలయ వ్యవస్థను సక్రమంగా నడిపించవలసిన అధికారులే భగవంతునిసేవను ప్రక్కకు పెట్టి తమ

తమ భోగవిలాసాలకు, వ్యక్తిగతసుఖాలకు లోనై ఉంటే, ఇక మిగతా సేవకవర్గంలో కూడా అశ్రద్ధ చోటు చేసుకోవడం సహజమే. **'రంగేశయం రాజవదర్హణీయమ్'** అన్నట్లుగా సకలలోకాధిపతి యైన ఆ శ్రీరంగనాథునికి రాజోపచారాలు జరగాలని ఆగమశాస్త్రం మాటి మాటికి తెలియచేస్తోంది. ఆ అధికారులలో ఉండే అహంకారాన్ని తమ వివేకపూర్ణమైన శాసనముతో శ్రీరామానుజులు శమింపచేశారు. ఆలయపు ఆరాధకవర్గంలో ఉండే లోటుపాట్లను కూడా వారు సవరించారు.

## ఫలించని విషం

విగ్రహంగ కనిపించే భగవంతుడు మన కోసం అచేతనంగ ఉంటాడే తప్ప, చేతకాక కాదు. ఆయన అతిసుకుమారుడు. ఆయనకన్నీ తెలుస్తాయి. ఆయనకు అర్చకులుగానో, మరోరకంగానో ఉపచారాలు చేసేవారు కూడా అలాంటి భావన కలవారే అయి ఉండాలి. అదిలేని వారు ఆలయసేవకులుగా పనికిరారు. అందుకే, అర్చారూపంలో ఉండే భగవంతుడికి ఉపచారాలు సమర్పించేటపుడు ఋతువులకు తగ్గట్లుగా భగవంతునికి ఆరోగ్యకరమైన పదార్థాలనే ప్రేమతో అర్పించాలని ఆగమశాస్త్రం విధిస్తోంది.

ఒకపుడు శ్రీరంగనాథస్వామికి రాత్రిపూట నేరేడు పండ్లు, దధ్యోదనం ఆరగింపు చేస్తున్నారు అర్చకులు. అది వర్షాకాలం. రెండూ పులుపు పదార్థాలు. రాత్రి తింటే ఆరోగ్యం పాడవుతుంది. ఎన్ని సార్లు అవి వద్దన్నా వారు వినలేదు. ఇలాంటివే నిర్లక్ష్యంతో చేసే మరికొన్ని

సన్నివేశాలను చూసి వాళ్ళను రంగనాథుని సేవలోంచి తీసివేశారు శ్రీరామానుజులు. హితమనేది కొందరకి త్వరగా జీర్ణం కాదు. కక్ష కట్టి అర్చకులు కొందరు రామానుజులవారికి తీర్థంలో విషం కల్పి ఇవ్వడానికి కూడా వెనుకాడలేదు. దైవంపై తమకున్న దృఢవిశ్వాసంతో రోజూలానే తీర్థాన్ని తీసేసుకున్నారు. వారికేమీ కాలేదు.అర్చకులకిది మింగుడు పడలేదు. కోపం మరింత వికృత రూపం దాల్చింది. శ్రీరామానుజుల చరిత్రలో 108 నామాలలో **'ప్రపీతవిషతీర్థాంభః ప్రకటీకృతవైభవః'** అని ఈ సంఘటనను ఒక నామంగా నేటికిన్నీ పెద్దలు కీర్తిస్తున్నారు.

రజస్తమోగుణాలు విజృభించినవాళ్ళు మంచిచెడులను నిర్ణయించలేరు. సంయమం, వివేకం లాంటివి లోపించి **'క్రుద్ధో హన్యాత్ గురూనపి'** అన్నట్లుగా పూజ్యులైన గురువులను కూడా హింసిస్తారు.

గతంకంటే అపాయకరమైన మరొక సన్నివేశం రామానుజుల కెదురైంది. వారు సంయమీంద్రులైన సన్యాసులు, కనుక, తిరుప్పావై ప్రబంధాన్ని అనుసంధానం చేసుకొంటూ తమ తురీయాశ్రమనియమం ప్రకారం ఏడుగురి భక్తుల భవనాలలో భిక్షను గ్రహించి దానిని పద్ధతిప్రకారం ప్రసాదంగా మార్చి స్వీకరిస్తూండేవారు.

## మరో విషప్రయోగం

ఒకనాడు రామానుజులపై కరుడు కట్టిన కసిగలఅర్చకుడు తానుగా ఏమిచేయకుండా విషం కల్పిన భిక్షనివ్వమని తన భార్యను ప్రేరేపించాడు. ఆమె సహజంగానే భక్తురాలు. సత్త్వగుణం కలిగి

రామానుజుల వైభవం చక్కగ గుర్తించిన ఇల్లాలు. విషంబాగ కలిపి ఇమ్మని, భర్త భయపెట్టి శాసించాడు. రామానుజులకు విషం కలిపిన అలాంటి భిక్షను అప్రసన్నముద్రతో సమర్పిస్తూ ఏనాడు పాదాలు తాకని ఆ తల్లి రామానుజుల పాదాలు స్పృశిస్తూ దండం పెట్టింది. ఆ విషపూరితమైన పదార్థం ఆమె సమర్పించే దాక వెనుక ఉండి భర్త చూస్తునే ఉన్నాడు. కావేరీతీరంలో ఆ ప్రసాదాన్ని రామానుజులు గట్టుపై ఉంచి ఆలోచనలో పడ్డారు.

ఇంతలో వెనుక నుంచి కాకి, శునకం లాంటివి ఆ పదార్థాన్ని తిన్నాయి. వెంటనే తమ అశువులను కోల్పోయాయి. తాను ఆలయంలో చేసే సంస్కారాల వల్ల విశృంఖలంగ ప్రవర్తించే కొందరు సేవకులలో రగిలే వ్యతిరేకాగ్ని ఇలా విజృంభిస్తోందని తెలిసింది. ఎవ్వరినీ విశ్వసించలేనిస్థితి అది. శ్రీరామానుజులు భిక్ష చేయడం, ప్రసాదగ్రహణాన్ని మానివేశారు. లీలావిభూతిలో ప్రకృతిసంపర్కంవల్ల ఇలాంటివి వ్యక్తులలో చోటు చేసుకోవడం ఆశ్చర్యం కాదనుకొన్నారు వారు. ఇలాంటి చికాకులతో మనస్సుకి అశాంతి కలిగి శ్రీరంగం వదలి సమీపంలో ఉన్న తిరువెళ్లారై దివ్యదేశానికి వేంచేశారు కొన్ని రోజులు శ్రీరామానుజులు.


## శ్రీగోష్ఠీపూర్ణుల శ్రీరంగం రాక

శ్రీరామానుజులు ప్రసాదస్వీకారము మానివేసిన విషయం నెలలోపే శ్రీగోష్ఠీపూర్ణులకు తెలిసింది. తమ శిష్యులైన శ్రీరామానుజుల స్థితికి పరిష్కారం సాధించాలని పరమదయతో గోష్ఠీపురం నుండి శ్రీరంగానికి

వేంచేశారు. ఆచార్యుల ఆగమనాన్ని విని స్వాగతించడానికి కావేరీ తీరానికి కొద్దిమంది శిష్యులతో వెళ్ళారు శ్రీరామానుజులు. అది మండువేసవికాలము. మిట్టమధ్యాహ్నపు సమయం. ఇసుకమైదానంలో పాదుకలతో కనిపించిన ఆచార్యులైన గోష్ఠీపూర్ణులకు శ్రీరామానుజులు సాష్టాంగనమస్కారం చేసారు. ఇసుక మండిపోతోంది. చాలాసేపైనా వారు రామానుజులను లెమ్మని చెప్పలేదు. ఆచార్యుల ఆజ్ఞకు పరతంత్రులైన ఆనాటి వినయవిధేయత కలిగిన శిష్యులు 'లెమ్మ'ని గురువు ఆదేశించేంతవరకు లేచేవారు కాదు.

## గురుభక్తిని నిలుపుటద్దం కిడాంబిఆచ్చాన్

కిడాంబిఆచ్చాన్ అనే యువకుడు రామానుజులకు చాలా ప్రియశిష్యుడు. గొప్ప ఆచార్యనిష్ఠ కలవాడు. సంస్క ృతభాషలో



ప్రణతార్తిహరాచార్యులని అంటారు. 'తమ ఆచార్యులైన రామానుజులను లెమ్మని చెప్పక తీవ్రమైన ఎండలో బాధపెడుతున్నారే! ఈయన' అని రామానుజులపై ఉన్న అతిశయప్రీతితో గోష్ఠీపూర్ణులపై కోపమా? అన్నట్లుగా ఆ ఇసుకపై తాను సాష్టాంగంగా పడుకొని తమ వీపుపై రామానుజులను చేర్చుకొన్నారు.

"ఇక ఎంతసేపైనా కదలక నిలుచోండి"అన్నట్లుగా ఉండిపోయారు. మిగిలిన వారు కాళ్ళు కాలుతున్నాయని గెంతులు వేస్తారే తప్ప ఏమీ చేయలేకపోయారు. సరియైన గురుభక్తి నిండినఆలోచనతో వీరు స్పందించారు. కిడాంబిఆచ్చాను వారి అనన్యమైన ఆచార్యనిష్ఠను చూసి శ్రీగోష్ఠీపూర్ణులు ఆనందంతో పొంగిపోయారు. రామానుజుల దేహాన్ని రక్షించడానికి ఇలాంటి మంచి శిష్యులున్నారే? ఓహో ! అని ఆనందించి శ్రీరామానుజులను ఇక లెమ్మని ఆదేశించారు.

'ఇదుగో! ఈ శిష్యునితో తళియ చేయించి భగవత్ప్రసాదాన్ని ఇకనుండి మీరు స్వీకరించండి' అని ఆదేశించారు. ఈ కిడాంబిఆచ్చాన్, ఇంతటి ఆచార్యనిష్ఠ కల్గి ఉండడంతోపాటు వేదాంతవిద్యలో కూడ ఆరితేరినవారు. ఒకప్పుడు న్యాయశాస్త్రంలో బాగా పేరు పొందిన మహనీయుడు ఉదయనాచార్యుడు అనే పండితుడు. ఆశాస్త్రంలో వీరు అంత సమర్థులుగ ఉండేవారు. వీరికి కూడా రామానుజులు '**వేదాంతోదయనుడు**' అనే బిరుదునిచ్చారు.

ఆనాటినుండి ఈ కిడాంబిఆచ్చాన్‌వారే శ్రీరామానుజుల పెరుమాళ్ళకు ప్రసాదం తయారు చేసేవారు. అందుకే రామానుజుల

108 నామాలలో **ప్రణతార్తిహరాచార్య దత్త భిక్షైకభోజనః** అని ఈ సన్నివేశాన్ని తెలియజేసే ఒక నామం చేర్చారు.

శ్రీయామునాచార్యులవారి తరువాత వారి ఆశయాన్ని సఫలం చేస్తూ శ్రీమహాపూర్ణులు, శ్రీరామానుజుల వారికి చక్కటి మార్గదర్శనం చేస్తూ ఉండేవారు. ఆగమశాస్త్రమర్యాద ప్రకారం ఆలయపు వ్యవస్థను, అధికారుల అక్రమమైన ఆధిపత్యాన్ని కూడా క్రమబద్ధంగా సంస్కరించి రాజాధిరాజైన రంగనాథునికి సకలవిధములైన సేవలనందించారు శ్రీభగవద్రామానుజులు.

## తిరుమాలైఆండాన్ సన్నిధిలో తిరువాయ్‌మొళ్ళి అధ్యయనం

యామునమునుల మరో శిష్యులైన తిరుమాలైఆండాన్ అనే మహానుభావులననుసరించి నమ్మాళ్వార్లు ప్రసాదించిన **తిరువాయ్‌మొ**ళ్ళి ప్రబంధంయొక్క వివరణను కూడా శ్రీరామానుజులు అధ్యయనంగా అధికరించారు. గంభీరమైన తత్త్వాన్ని అన్వేషించడంలో రామానుజులకు రామానుజులే సాటి. అసదృశమైన వారి మేధాసంపత్తు, గురువులకు కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తూండేది. చదివే పాఠాలకు ఎన్నోతరాలుగ చెప్పే అర్థాలకంటే విశేషార్థాలను వ్యక్తంచేస్తూండేవారు శ్రీరామానుజులు. వారి సన్నిధానంలో తిరువాయ్‌మొళ్ళి వ్యాఖ్యానాన్ని శ్రీరామానుజులు సమగ్రంగా అధ్యయనం చేసి కృతార్థులయ్యారు.

# తిరువరంగప్పెరుమాళ్ అరయర్ సన్నిధిలో దివ్యప్రబంధ రహస్యాధ్యయనం

అలానే శ్రీవరరంగాచార్యులు అనే పేరుతో యామునాచార్యుల వారి మరో శిష్యులుండేవారు. వీరినే **తిరువరంగప్పెరుమాళ్ అత్తైయర్** అనేవారు. వారు, ఆళ్వార్లుపాడిన నాలాయిరదివ్య ప్రబంధంలో నిష్ణాతులు. వారి సన్నిధానంలో నాలుగువేల పాశురాల రహస్యార్థాన్ని శ్రీరామానుజులు అధ్యయనం చేసారు. తానెంత మేధావి అయినా ఆచార్యులనాశ్రయించే విద్యను గ్రహించాలన్న విషయాన్ని తమ ఆచరణద్వారా లోకానికి నేర్పారు శ్రీరామానుజులు.


కొంత వ్యవధానంతో అస్తవ్యస్తమైన శ్రీరంగపు ఆలయ వ్యవస్థను, క్షేత్రవైభవాన్ని కూడా వారు తీర్చిదిద్ది ఒక క్రొత్త దీప్తిని సమకూర్చారు. ఆ సమయంలోనే దాశరథి, తిరుక్కురుగైపిరాన్‌పిళ్ళాన్, వడుగనంబిలాంటి ఎంతో మంది మహనీయులు రామానుజులనాశ్రయించి వారి సన్నిధిలో శాస్త్రాధ్యయనం చేసి వారి సిద్ధాన్త ప్రచారంలో తోడయ్యారు. తత్త్వదర్శులైన ఆళ్వార్లు అనుగ్రహించిన దివ్యప్రబంధాలకు, వేదవ్యాసభగవానుడు ప్రసాదించిన బ్రహ్మసూత్రాలకు కూడా ప్రామాణికమైన వ్యాఖ్యానాలు వ్రాయాలని వారు సంకల్పించారు. పరమాచార్యులైన శ్రీయామునాచార్యులవారు రచించియున్న సిద్ధిత్రయం, గీతార్థసంగ్రహం, ఆగమప్రామాణ్యం లాంటి గ్రంథాలను వీరు సూక్ష్మంగాను సమగ్రంగాను అధ్యయనం చేసారు.

అధికారివర్గము, పండితులు, పామరులూ అనే తారతమ్యం లేకుండా అందరినీ భగవంతుణ్ణి ప్రేమించేవారిగా తీర్చిదిద్దాలనుకొన్నారు శ్రీరామానుజులు. శ్రీరంగనాథుని ఆలయంలోని వ్యవస్థను తీర్చిదిద్దడానికే కొన్ని సంవత్సరాలు పట్టింది. సమాజంలో అజ్ఞులు, విజ్ఞులు, ప్రాజ్ఞులుగా విభిన్న కోవలకు చెందిన మనుష్యులు జీవిస్తూంటారు. 'ఎలాంటివారైనా, భగవంతుణ్ణి ఆశ్రయించి ఉజ్జీవించడానికి అందరు అర్హులే. ఆశ్రయించే వారిలో ఉండే తారతమ్యాన్ని చూడకుండా వారి శ్రద్ధకే నేనందుతాను' అన్నాడు గీతాచార్యుడు. 'సమోఽహం సర్వభూతేషు' అని కద? ఆయన సూక్తి!

అలాంటి సమస్వభావం కల పరమాత్మని పొందడానికి అన్ని వర్గాలవారికి చైతన్యాన్ని కలిగించాలనే బుద్ధి కలవారు శ్రీభగవద్రామానుజులు. శ్రీరంగనాథుని ఆరాధన వ్యవస్థను సరిదిద్ది చక్కటి వైదిక వాఙ్మయవైభవాన్ని కూడా పెంచుతూ సమాజాన్ని భగవత్సేవాపరంగా తీర్చిదిద్దసాగారు శ్రీరామానుజులు.

## ధనుర్దాసుపై శ్రీరామానుజుల కటాక్షము

మనిషి అన్నాక నూరు శాతం సరిగ్గా ఉంటాడని చెప్పలేం. ఎన్నోకొన్ని లోపాలు ప్రతివ్యక్తిలోనూ ఉంటాయి. ఆక్షేపించే దృష్టితోనే సామాన్యులు చూస్తారు. కానీ ఆ లోపాలకు సరియైన దారిచూపితే అవే ఉత్తమగుణాలుగ మారతాయని శ్రీరామానుజులు నిరూపించారు.



ప్రకృతి సౌందర్యాన్ని బాగా ఆరాధించగలిగిన గుణం కలవాడు,



ధనుర్దాసుడు అనే వీరుడు. ఎండలో ప్రయాణం చేస్తున్నపుడు వాడిపోకుండా ఉండాలని తన భార్యయొక్క నేత్రాలకు గొడుగు పట్టి నడిచే వాడు. ఇతరులంతా అతణ్ణి గేలి చేస్తూంటే ఆ స్థితిని మానిపించి శ్రీరంగనాథుని అతిలోకసుందరమైన విశాలనేత్రములను సేవింపచేసి చరిత్రలోనే ఉదాహరణగా ఉండేలాగా ఉత్తమభాగవతశిఖామణిగా అతనిని తీర్చిదిద్దారు శ్రీభగవద్రామానుజులు. భగవంతునికి మంగళాశాసనం చేసే ప్రేమపూరిత మనస్సు కల ఆళ్వారుల సరసనే ఈ ధనుర్దాసుణ్ణి కూడా లెక్కపెట్టారు పిళ్ళైలోకాచార్యులనే పూర్వాచార్యులు.

## మహాభక్తుడు మార్నేరినంబి

శ్రీయామునాచార్యులవారి శిష్యులలో 'మార్నేరినంబి' అనే దళితభక్తుడు కూడా ఒకాయన ఉండేవాడు. పుట్టుకతోటే ఆయనకి ఉత్తమసంస్కారం అబ్బింది. శ్రీయామునగురువుల అనుగ్రహం లభించిన పిదప ఆ సంస్కారం మరింత గుభాళించింది. పంచసంస్కారాలు పొంది, శ్రీవైష్ణవుడై ఆచార్యశుశ్రూషను లభించాడాయన.

యామునాచార్యులవారి శిష్యులందరు కూడా ఈ మార్నేరినంబి విషయంలో చాలా ప్రీతికలిగి ఉండేవారు. గ్రంథాలు చదవడం వేరు, వాటి అర్థాలను ఆకళింపచేసుకోవడం వేరు. మనఃస్ఫూర్తిగ ఆచరించడం వేరు. యామునాచార్యులవారి శిక్షణలో తయారైన శిష్యులు, తాము నేర్చిన మంచి విషయాలను నూరుశాతం ఆచరించే నిష్ఠ కలవారు అనడానికి శ్రీరామానుజులవారి గురువైన మహాపూర్ణుల చరిత్రలో అద్భుతములైన రెండు సన్నివేశాలున్నాయి.

భగవద్భక్తులకి వయస్సు, విత్తం, విద్య, కులంలాంటివి కొలమానాలు కావు. వారి ఆచరణలే కొలమానం. శ్రీహరియే సర్వస్వమనుకున్నవాణ్ని వాని శారీరక యోగ్యతలతో కాక, భగవత్సంబంధంతోటే ఆదరించవలెను. దీనికి ప్రమాణంగ ఋషివాక్యాలెన్నో ఉన్నాయి.

## మహాపూర్ణుల గృహప్రవేశం

శ్రీమహాపూర్ణుల గృహప్రవేశముహూర్తానికి కొంచెం ముందు, భవనం సిద్ధమౌతున్నప్పుడే మాఱ్నేరినంబిగారు ప్రవేశించి, ఎక్కడెక్కడ ఆరాధన మందిరం, ప్రసాదశాల, భక్తులకు ప్రసాదవితరణం చేసే స్థానంలాంటివి ఉన్నాయో, వాటిని చూసి సంతృప్తిగ బయటకు వచ్చారు. మహాభక్తుడు, మహాపూర్ణులకు మిత్రుడు, సబ్రహ్మచారి అయిన ఇతని ప్రవేశంతో గృహమంతా పావనమైంది కనుక, గృహప్రవేశం పూర్తయిందన్నారు మహాపూర్ణులు. వారి నిష్ఠ, మిగిలినవారందరినీ ఆశ్చర్యపరచింది.

ఆదరణ చూపడం వీరిసొత్తైతే, దానిని అలుసుగ తీసుకోకుండ తన హద్దులో తానుండడం మాఱ్నేరినంబిగారి సంస్కారానికి ప్రతీక. ఎవరి హద్దులో వారుండి నియమబద్ధంగ ప్రవర్తించే ఉత్తమసంస్కారం శ్రీరామానుజులవారికి ప్రేరణగా నిలచింది.

**ఇక రెండవది-**

మఱ్నేరినంబి, వయోవృద్ధులై దేహాన్ని చాలించేటప్పుడు మహాపూర్ణులు, వారితోటే ఉన్నారు. అప్పుడు మాఱ్నేరినంబి ఒక కోరికను కోరారు.

'పెరియనంబిస్వామీ! ఆచార్యులు వైష్ణవదీక్షతో సంస్కరించిన ఈ శరీరం, పుట్టుకతో దుష్టమే అయినా, ఆచార్యకృపతో దేవతలకు నివేదించే పురోడాశంవలె పవిత్రమైంది. దీనిని కుక్కలపాలు చేయవద్ద'ని కన్ను మూసారు. అంటే, వైష్ణవసంస్కారాలు పొందని దేహబంధువులకు ఈ శరీకాన్ని అప్పగించవద్దని తాత్పర్యం.

మహాపూర్ణులు దానికి అంగీకరించి, మార్నేరినంబిగారికి బ్రహ్మమేధ సంస్కారం చేసారు. ఇలాంటిది మహానుభావులైన పెద్దలకి మాత్రమే చేస్తారు. ఒక అంతిమజాతివానికి ఇలాంటి సంస్కారం చేయడం, మిగిలిన వర్గాలలో కలకలాన్ని లేపింది. మహాపూర్ణులను అందరూ తీవ్రంగ నిందిస్తున్నా, వారు తమ పని చేసుకుంటూ వెళ్ళారు.

ఆనాటి రాత్రి, ఏకాంతంలో రామానుజులవారు మహాపూర్ణులకు నమస్కరించి 'ఆచార్యా! సభ్యసమాజమంతా గర్హించినా, తాము మార్నేరినంబికి బ్రహ్మమేధసంస్కారం చేసారే? ఇందులోని అంతరార్థమేమో? అభ్యతరం లేకపోతే ఈ దాసునికి తెలియచేస్తారా?' అని వినయంతో ప్రార్థించారు.

మహాపూర్ణులు నవ్వి, 'ఈలోకానికి ఆక్షేపణంకానివంటూ ఏముంటాయి? పనిచేస్తే, తప్పుపడుతోంది. అది అలా ఉంచి, నేను ఆచారప్రధానుడైన శ్రీరామునికంటే గొప్పవాడ్ని కాను కదా! మార్నేరినంబి పక్షియైన జటాయువుకంటే, తక్కువవాడు ఏమీ కాదుకదా!' అన్నారు.


ఆ తరువాతి కాలంలో శ్రీరామానుజులు చేసిన కార్యాలకి ఈ సన్నివేశం స్ఫూర్తిదాయకమైంది.

# యజ్ఞమూర్తిపై విజయం

ఒకప్పుడు **యజ్ఞమూర్తి** అని ప్రసిద్ధిని పొందిన ఒక మహాపండితుడు కాశీలాంటి పవిత్ర క్షేత్రాలను పర్యటించి శాస్త్రవాదంలో పండితులను జయించి ఏకదండసన్యాసిగా ఉండేవాడు. శ్రీరంగంలో శ్రీరామానుజులు వైభవంగా, మంచి ప్రతిభాశాలి విద్వాంసులుగా, త్రిదండియతీశ్వరులుగా వేంచేసియున్నారని విని ఆయనతో శాస్త్రార్థం చేయాలనే కుతూహలంతో శ్రీరంగానికి వచ్చాడట. 'మీతో శాస్త్రార్థం చేయాలని వచ్చాను' అని శ్రీరామానుజులతో చెప్పాడు. 'ఒకవేళ ఓడిపోతే ఏం చేస్తారు' అని శ్రీరామానుజులు అడిగారు. 'మీకు శిష్యుడనై మీపాదదాసుడను కాగలను'అన్నాడు. మరి మీరు ఓడిపోతేనో! అడిగాడు ఆ యజ్ఞమూర్తి. గ్రంథసన్యాసం చేసి, మాటలాడక ఉండిపోతానని శ్రీరామానుజులు చెప్పినారట. ఆయన మాయావాదంలో బాగా ఆరితేరిన పండితుడు. 17 రోజులు అవిచ్ఛిన్నంగా శాస్త్రార్థం జరిగింది. 17వ రోజు రాత్రి శ్రీరామానుజులు, తమ ఆరాధ్యదైవమైన శ్రీవరదరాజస్వామితో 'మాపూర్వులు కాపాడిన నీ సిద్ధాన్తాన్ని కాపాడుకోవడం నీ బాధ్యతే కదా?' అని అన్నారట.

రాత్రి స్వప్నంలో శ్రీవరదరాజస్వామి, సాక్షాత్కరించి 'మీకేమి చింత లేదు. పరమాచార్యులైన శ్రీయామునమునీంద్రులు తమ సిద్ధిత్రయాది గ్రంథాలలో చూపిన విషయాలను చూసుకొని శాస్త్రార్థానికి వెళ్ళండి' అని ఆదేశించాడు. మరునాడు 18వ రోజున వాదం ప్రారంభించక ముందే శ్రీరామానుజుల ముఖమండలంలో వెలిగే కాంతిని చూసి, ఆ 'యజ్ఞమూర్తి' అనే మహాపండితుడు శిష్యుడయ్యాడు. శ్రీవరదరాజ పెరుమాళ్ళ

అనుగ్రహాన్ని స్మరిస్తూ ఆయనకు త్రిదండసన్యాసదీక్షను ప్రసాదించి **'అరుళాళ పెరుమాళ్ ఎంబెరుమానార్'**- అని నామకరణం చేసారు. చక్కటి మఠాన్ని ఏర్పాటు చేసి ఆయనని విశిష్టాద్వైతసిద్ధాంత ప్రవర్తకుడుగా తీర్చిదిద్దారు శ్రీభగవద్రామానుజులు. శ్రీరామానుజుల విశిష్టప్రతిభకు ఇదొక అద్భుతమైన ఉదాహరణం.



ఎంతో మంది విద్యావంతులను వేదాంతశాస్త్రపారంగతులుగా, సత్సంప్రదాయసంరక్షణసమర్థులుగా శ్రీరంగంలో తీర్చిదిద్దారు శ్రీరామానుజులు. చుట్టుప్రక్కల ఉండే మిగిలిన దివ్యదేశాలను కూడా శ్రీరంగాన్నే కేంద్రంగా చేసుకొని వారు సంస్కరించారు.

# గద్యత్రయావతరణం

పంగుని (ఫాల్గున)మాసంలోని ఉత్తరఫల్గునినక్షత్రం శ్రీరంగ నాచ్చియార్ అవతరించిన దినం. సంవత్సరంలో ఆ ఒక్కరోజు మాత్రమే ఉత్తరఫల్గునికి అమ్మసన్నిధికి వేంచేసి శ్రీరంగనాథుడు అమ్మను పలుకరిస్తాడు. శ్రీరంగనాథదంపతులు అలంకారంతో ఒక మండపంలో కొలువుగా వేంచేసియున్నారు. ఆ దివ్యదంపతుల అద్భుతమైన చేరికను సేవించారు శ్రీభగవద్రామానుజులు. ఉదారహృదయులైన స్వామి రామానుజుల శ్రీముఖారవిందం నుండి పరిపక్వమైన భక్తిభావం, వాఙ్మయరూపంగా వెలువడింది. అదే **గద్యత్రయం.**

**'శరణాగతిమంత్రం'** అని పేరుకల ద్వయమంత్రానికి సారభూతమైన గ్రంథమిది. ఇందులో **'శరణాగతిగద్య, శ్రీరంగగద్య, వైకుంఠగద్య'** అని మూడూభాగాలున్నాయి. సరళమైన సులలితభాషలో సాగిన చక్కటి ప్రబంధమిది.

ప్రపన్నుడు, ప్రతిదినం ఆ భగవంతుణ్ణి గురించి ఎలా చింతనం చేసుకోవాలో ఆ విషయాన్ని ఈ గ్రంథం సమగ్రంగా ప్రబోధిస్తోంది. తమ నైచ్యానుసంధానాన్ని, జగన్నాయకుడైన శ్రీరంగనాథుని ఆశ్రిత రక్షణకు ఉపకరించే కళ్యాణగుణాలను, విభూతిని శ్రీరంగనాయికా పురుషకారంతో తామనుభవించి మనకందించిన అపూర్వవాఙ్మయం ఈ గద్యత్రయం. శ్రియఃపతి అయిన శ్రీరంగనాథుడికిని యతిపతి అయిన శ్రీభగవద్రామానుజులకిన్ని సంవాదం ఇందులో సాగింది.

ప్రతిసంవత్సరం **పంగుని ఉత్తరమహోత్సవం**గా ఈ గద్యత్రయ మవతరించిన దినాన్ని దివ్యదేశాలలో గౌరవంగా సంభావిస్తారు పెద్దలు. దీనినే తమిళభాషలో **'పంగుని ఉత్తర త్తిరునాళ్'** అని వ్యవహరిస్తారు. ఈ గద్యత్రయం, బాగుపడాలనుకొనేవారందరికి నిత్యానుసంధేయం.

## శ్రీవ్యాస-పరాశరభట్టరుల ఆవిర్భావం

మహాజ్ఞానులు, శ్రీభగవద్రామానుజులకు ప్రధానశిష్యులైన శ్రీకూరత్తాళ్వాన్‌కి కవలపిల్లలుగ పుట్టిన కుమారులే వ్యాస-పరాశర భట్టరులు. ఆండాళమ్మగారు కూరేశుల ధర్మపత్ని. శ్రీరంగనాథుని ప్రసాదప్రభావంతో జన్మించినందుకు ఆరంగనాథుని పిల్లలుగానే భావించారు శ్రీరామానుజులవారూ, మిగిలిన పెద్దలందరూను.

శుభకృత్ సంవత్సరం వైశాఖమాస పూర్ణిమతిథి, అనూరాధా నక్షత్రాన శ్రీరంగంలో ఆవిర్భవించారు ఈ కవలపిల్లలు.

శ్రీభగవద్రామానుజులు, వ్యాస-పరాశరమహర్షులు తమ గ్రంథాల ద్వారా లోకానికి చేసిన మహోపకారాన్ని గుర్తించి, ఈ కవలపిల్లలకు **'వ్యాసభట్టర్, పరాశరభట్టర్'** అని నామకరణం చేసారు. పరమాచార్యులైన యామునమునులకు మిగిలిన సంకల్పాలలో **బ్రహ్మసూత్ర భాష్యనిర్మాణం, నమ్మాళ్వార్ల ప్రబంధానికి వ్యాఖ్యానం, వ్యాస-పరాశరుల పేర్లకు ప్రఖ్యాతి** అనే మూడిటిలో ఈ నామకరణసన్నివేశంతో ఒక సంకల్పాన్ని తీర్చారు శ్రీభగవద్రామానుజులు. శ్రీపరాశరభట్టర్‌వారి పాండిత్యం జగత్ప్రసిద్ధం. వారు ప్రసాదించిన గ్రంథాలే వారి అసాధారణ

వైభవానికి గీటురాయి.

శ్రీలక్ష్మీదేవిని గురించిన **'శ్రీగుణరత్నకోశం'**, రంగనాథుడి వైభవాన్ని విశదంగా వర్ణించిన **'శ్రీరంగరాజస్తవం'** పూర్వోత్తరశతకాలు, మూడుమంత్రాలసారాన్ని సంగ్రహంగా అందంగాను వివరించిన **'అష్టశ్లోకి'**. **శ్రీరంగనాథస్తోత్రం**, విష్ణుసహస్రనామస్తోత్రానికి అత్యద్భుతమైనవ్యాఖ్య **శ్రీభగవద్గుణదర్పణం**, కైశికపురాణానికి **మణిప్రవాళవ్యాఖ్యానం**, మధురములైన **ముక్తశ్లోకాలు** శ్రీభట్టరు వారి రచనలు.

## తిరువాయ్‌మొళ్రికి మొదటివ్యాఖ్యానం 'ఆఱాయిరప్పడి'

శ్రీభగవద్రామానుజులకంటే ముందు దివ్యప్రబంధాలకు వ్యాఖ్యానం గ్రంథబద్ధంగ ఉండేది కాదు. అప్పటిలో మేధావులైన మహానుభావులు గ్రంథాలలో ఉండే గంభీరభావాలను ఆచార్యోపదేశం ద్వారా మూలంలోనే గ్రహించేవారు.

ఒకప్పుడు నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళ్రిలోని రెండవపత్తు- 4వ దశకంలో మొదటిపాటకి కొందరు కాదనడానికి వీలులేని అపార్థాన్ని కలిపించారు. **'ఆడి ఆడి అగం కరైన్దు...'** అని ఆపాట మొదలౌతుంది. భగవంతుణ్ణి పొందడానికి తహతహలాడుతున్న నమ్మాళ్వార్లు తాము నాయికాభావాన్ని పొంది, హృదయం ద్రవించి, నాట్యంచేస్తూ, మంచిరాగంతో పాడుతూ **'నరసింహా!'** అంటూ ఆస్వామిని అన్వేషించసాగారు అని పాశురానికి భావం.

శబ్దాలకు బాహ్యంగ స్ఫురించే అర్థాలెన్నో కనిపిస్తాయి కదా! ఆషాఢ శ్రావణమాసాలలో కావేరీనదిలో వరదలొస్తే ఇసుకదిమ్మలన్నీ కరిగిపోయాయి. నది కట్టలు త్రెంచి, పొంగి ప్రవహిస్తుంది. అప్పుడు జనాలు భయపడి **'నరసింహా!'** అని మొఱపెడుతున్నారు అన్నట్లుగా సరదాగా కొందరు అపార్థాలు కల్పించారు. ఆ తమిళ పదాలను వక్రంగ లాగినప్పుడు ఇలాంటి అపార్థాలు రావడానికి అవకాశముంది. అలాంటి అపార్థాలకు తావులేకుండా వ్యాఖ్యాన మవతరించాలనుకున్నారు శ్రీభగవద్రామానుజులు.

తమ శిష్యులలో ప్రాజ్ఞులైన **తిరుక్కురుగైపిరాన్‌పిళ్ళాన్** అనే మహానుభావుణ్ణి శ్రీవిష్ణుపురాణాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరువేల సంఖ్యకల ఆ పురాణగ్రంథానికి పోలికగా పదాలసంఖ్య ఉండేలా తిరువాయ్‌మొళ్రికి వ్యాఖ్యానాన్ని రచించమని ఆదేశించారు శ్రీరామానుజులు. ఆచార్యుల ఆజ్ఞకు వశులై **తిరుక్కురుగైపిరాన్‌పిళ్ళాన్ స్వామి,** అందమైన వ్యాఖ్యానాన్ని అందించారు. ఆ వ్యాఖ్యానాన్నే **'ఆరాయిఱప్పడి'** అని పెద్దలు వ్యవహరిస్తారు. ఆళ్వారుల తమిళ ప్రబంధాలకి వెలసిన మొదటివ్యాఖ్యానమిది. ఈ **'తిరువాయ్‌మొళ్రి'** ప్రబంధానికే తరువాతి ఆచార్యులు, మరొక నాలుగు వ్యాఖ్యానాలు అందించారు.

ఈ ఆరాయిఱప్పడి వ్యాఖ్యానమే మిగిలిన నాలుగువేల పాశురాల వ్యాఖ్యానానికి కూడా నాంది అయింది. వీటిలో అందించిన అనేక

సంప్రదాయ రహస్యాలను కలిపి '**ద్రావిడవేదాంత**'మంటారు. శ్రీవైష్ణవసంప్రదాయంలో అటు స్వతంత్రభాషామయంగ అందిన వేదాంతం, ఇటు ద్రవిడభాషామయంగ సులభతరమై అందిన వేదాంతం కూడా ఒకే లక్ష్యాన్ని బోధించడంవల్ల ఈ రెంటిని కలిపి '**ఉభయవేదాంతం**' అని కీర్తిస్తారు.

అంతవరకు కొన్నివర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే వేదాంతశాస్త్రాన్ని సామాన్యులుకూడా అందుకొనగలిగేట్టు చేసి, శ్రీరామానుజులు మరొక ఆధ్యాత్మిక సంస్కారానికి తెరతీసిన వారయ్యారు. దీనీతో యామునాచార్యులవారిదగ్గర చేసిన రెండవ ప్రతిజ్ఞను నెరవేర్చినట్లైంది.

## శ్రీరామానుజుల తొలి తిరుమల యాత్ర

ఆళ్వార్లు పాడిన, ఏడు కొండలకధిపతిగా వేంచేసియుండే తిరుమల శ్రీనివాసుణ్ణి సేవించుకోవాలని ఒకసారి సంకల్పం కలిగింది శ్రీరామానుజులకి. శిష్యులతో కలసి మొదటిసారిగా వారు తిరుమల క్షేత్రానికి ప్రయాణం చేసారు.

మధ్యలో ఎంతో మందిని తమ అనుగ్రహానికి పాత్రులుగా తీర్చిదిద్దుతూ కాలినడకతో తిరుపతి దివ్యక్షేత్రానికి చేరారు. వీరికి పూర్వాశ్రమంలో మేనమామగారు, నామకరణమూ చేసిన వారూ అయిన శ్రీశైలపూర్ణులనే పేరుగల '**తిరుమలనంబి**'గారు ఇక్కడే వేంచేసి యుండేవారు. వీరికి శ్రీరామాయణ రహస్యార్థాలు బాగా తెలుసును.

తమ గురువుగారైన శ్రీయామునాచార్యులవారి ఆదేశంతో తిరుమల కొండమీద శ్రీనివాసుడి ఆరాధనకోసం వీరే పాపవినాశం చెఱువునుండి తీర్థం తెచ్చి సమర్పించేవారు. వీరిచేతినుండే తీర్థం త్రాగాలని బాలుడైనాడట వేంకటేశ్వరుడు. వీరి కోసమే ఆకాశగంగను సృష్టించి, అక్కడనుంచే ఆరాధనకు నీటిని తెమ్మని చెప్పాడట. అప్పుడే వీరిని **'తాత'** అని శ్రీనివాసుడు పిలిచాడని, వీరికి **తాతాచార్యులు** అనే బిరుదు వచ్చింది. వీరిని సేవించి తరించాలని రామానుజులు తిరుపతి చేరారు.

ఆ తిరుమలక్షేత్రాన్ని భగవ త్స్వరూపంగాను, నిత్యసూరుల రూపంగాను భావిస్తారు. ఆ కొండపై పాదాలు పెట్టి ఎక్కడానికి భగవ ద్రామానుజులు బొత్తిగ అంగీకరించలేదు. కొన్ని రోజులు, క్రిందనే నివాసం చేసారు. అక్కడున్న కైంకర్యపరులైన జ్ఞానులు శ్రీభగవ ద్రామానుజులను ప్రార్థిస్తూ వినయపూర్వకంగా -"స్వామీ! కొండపైన శ్రీనివాసుడి సేవ సాగాలి కదా! మీరు పైకి వెళ్ళకపోతే మంగళాశాసనం చేసే మహానుభావులు కూడా వెళ్ళరు కదా! తప్పకుండా మీరు కొండపైకి వేంచేసి ఆ వెంకటాచలపతికి మంగళాశాసనం చేయా"లన్నారు.

## మోకాళ్ళపర్వతం

భాగవతోత్తముల ఆదేశాన్ని పురస్కరించుకొని మోకాళ్ళకు వస్త్రాలను కట్టుకొని ఆ పర్వతస్వరూపుడైన పరమాత్మను స్మరిస్తూ కొండపైకి నడిచారు శ్రీరామానుజులు. మధ్యలో వీరు అలసి, కాస్సేపు కూర్చున్న కొండనే మోకాళ్ళపర్వతంగ పిలుస్తారు. తర్వాత అక్కడ **త్రోవ భాష్యకార్లు** అనే పేరుతో

రామానుజులవారి విగ్రహం ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నారు. కోట్ల పవిత్ర తీర్థాలకి నిలయం ఆ **'నారాయణాద్రి'** అనే తిరుమలక్షేత్రం. భాగవతోత్తము లను పురస్కరించుకొని ఆ క్షేత్రాన్ని, క్షేత్రాధిపతి అయిన శ్రీవరాహస్వామిని, ఆపై శ్రీనివాసుణ్ణి కూడా భక్తిభావంతో సేవించుకొన్నారు శ్రీభగవద్రామానుజులు.

## ప్రథమగ్రంథావిష్కరణ

ఈ మొదటి యాత్రలోనే వేదవేదాన్తవేద్యుడైన ఆ వెంకటేశ్వర స్వామి ఎదుట అవిచ్ఛిన్నంగ ఒక ఉపన్యాసం చేసారు. అన్ని ఉపనిషత్తుల సారంగ సాగిన ఆ ప్రవచనాన్ని **'వేదార్థసంగ్రహం'** అంటారు. పరాత్పరుడైన ఆ పరమాత్మయొక్క వాస్తవికమైన స్వరూపాన్ని, గుణాలను, ఆయన దివ్య విభూతులను, దివ్యమంగళవిగ్రహ సౌందర్యాన్ని సమగ్రంగా వర్ణిస్తూ శ్రుతివాక్యాలకు పరస్పరవిరోధం లేకుండా అతిసమంజసమైన సమన్వయాన్ని ఈ **'వేదార్థసంగ్రహ'**మనే గ్రంథంలో చూపారు శ్రీరామానుజులు. శ్రీరంగక్షేత్రాన్ని సంస్కరించినట్లు భవిష్యత్తులో ఈ క్షేత్రాన్ని కూడా ఎలా సంస్కరించవచ్చో అనే విషయాన్ని కూడా శ్రీరామానుజులు సూక్ష్మంగా పరిశీలించారు. వేదార్థసంగ్రహాన్ని ఉపదేశించి శ్రీనివాసుడైన శ్రీవేంకటేశ్వరుడికి కూడా గురువయ్యారు శ్రీరామానుజులు. ఆ తరువాత తిరిగి శ్రీరంగానికే వేంచేశారు.

## అనంతాళ్వాన్‌ను తిరుమలకు పంపించుట

శ్రీరంగం వెళ్ళిన తరువాత కూడా తిరుమల క్షేత్రవైభవాన్ని వృద్ధి

చేయాలనే భావం వారి మనస్సులో దృఢంగా నాటుకొంది. **'అనంతాళ్వాన్'** అనే తమ శిష్యులను తిరుమలకు వెళ్ళి చక్కటి నందనవనం, పుష్కరిణిలాంటివి తయారు చేసి అక్కడ పెరుమాళ్ళకు ప్రీతివర్ధకమైన కైంకర్యం చేయాలని పంపించారు. ఆచార్యుల ఆజ్ఞను శిరసా వహించి శ్రీఅనంతాళ్వాన్లు గర్భవతియైన భార్యతో తిరుమలక్షేత్రానికి ప్రయాణం చేసారు.

జనసంచారం అంతగా లేని శ్రీనివాసుని ఆలయానికి నైఋతి మూలలో విశాలమైన తోటను, అందులో అందమైన పుష్కరిణిని స్వయంగ భార్యతో కలిసి త్రవ్వారు. దానికి **'రామానుజపుష్కరిణి'** అని పేరుపెట్టారు. ఆతోటలోనే తయారైన పూలతో మాలలు కట్టి పెరుమాళ్ళకు సమర్పిస్తూ ఆ క్షేత్రవైభవానికి నాంది పలికారు శ్రీఅనంతాళ్వాన్లు.

ఈ ప్రకృతిమండలంలో ఎక్కడైనా మంచి సమృద్ధిని చూస్తే ఓహో! అని సంతోషించేవారు అతికొద్దిమందే ఉంటారు. అసహనంతో అలాంటి వైభవాన్ని ఆక్రమించి తామే అనుభవించాలి లేక తొక్కివెయ్యాలనే ఈర్ష్యా-ద్వేషాలు కలవారు లోకంలో చాలామంది ఉంటారు. భగవత్సేవలో ఉండే అంతరంగులు, ఇరుగుపొరుగులో ఉండే మరికొందరు కలిసి సంస్కారహీనులై సర్వలోకాధిపతిగా అర్చావిగ్రహంగ విష్ణుస్వరూపమైన శ్రీనివాసుడ్ని వేరుదేవతగా చిత్రించాలనుకొన్నారు. అప్పటి అర్చకులు కూడా దురభ్యాసాలకు అనాచారాలకు వశులై రాజ దండనకు గురి అవుతూండేవారు.

అనంతాళ్వాన్‌ద్వారా శ్రీభగవద్రామానుజులు అక్కడి స్థితి-గతులను తెలుసుకొంటూండేవారు. ఆ సమయంలో 'ఇలాంటి సమస్యలను పరిష్కరించగలిగే పరమ ప్రామాణికులు, మంచి పేరు కలవారు శ్రీ భగవద్రామానుజులే' అని తెలుసుకొని ఆ ప్రాంతపరిపాలకుడైన యాదవరాజు, మిగతా పండితులతోపాటు రామానుజుల వారినీ శ్రీరంగంనుండి ఆహ్వానించారు. దృఢమైన శాస్త్రావగాహనతో పటిష్ఠమైన ప్రమాణాలతోను ఆ శ్రీనివాసునియొక్క వాస్తవస్వరూపాన్ని ఇదమిత్థంగా నిరూపించే సమయం కోసం ఎదురుచూస్తున్నారు అందరూ.


## రెండవసారి శ్రీరామానుజుల తిరుమలయాత్ర

### (వెంకటేశ్వరస్వామిని విష్ణుస్వరూపంగా నిర్ణయించుట)

నేరారోపణతో శిక్షితుడైన అర్చకుణ్ణి వెనుక వేసుకొచ్చే స్థానిక విద్వాంసులు దాడులు చేస్తూంటే వాస్తవాన్ని నిరూపించాలని అప్పటి రాజు నిర్ణయించాడు. సదస్సు ఏర్పాటైంది. యాదవరాజు దైవవిగ్రహంపై భిన్నభిన్న భావాలు కలిగియున్న వర్గాలను అందరినీ ఆహ్వానించి అవసరమైన శాస్త్రీయప్రమాణాలను చూపి ఈ దేవుడెవరనేది నిరూపించ మని కోరాడు.

ఎన్నోదినాలు వాదనలు జరిగాయి. 18 పురాణాలలోనూ ఉండే ప్రమాణాలను చూపించి ఈతడు శ్రీలక్ష్మీభర్త అయిన వేంకటేశ్వరుడే తప్ప వేరుదేవత కాదని నిరూపించారు. శంఖచక్రాలు లేని దేవుడు విష్ణువెలా అవుతాడని ప్రశ్నిస్తే, పురాణాలలో అవి తొండమానుకిచ్చిన

వివరణ చూపారు. తిరిగి కలియుగంలో భక్తుల ద్వారా గ్రహిస్తానని ఆయన చెప్పిన వచనాలు శ్రీరామానుజులు చూపించారు. అయినా పండితులు పూర్తిగ అంగీకరించలేదు. దానికి ఆ యాదవరాజు స్పందించి, అన్ని దేవతల ఆయుధాలు లోపల పెట్టిస్తామని, రాత్రి తలుపులు వేసాక, మరునాడు ఉదయం సుప్రభాతం కోసం తలుపులు తీసేసరికి ఏది ధరిస్తే ఆయనను అలానే నిర్ణయిస్తామని తీర్మానించాడు. ఆశ్చర్యం! రాజే మరునాటి ఉదయం దగ్గర ఉండి ద్వారాలు తీసేసరికి వేంకటేశుడు శంఖచక్రాలు ధరించి ఉన్నాడు. అయితే అవి గురువు ద్వారా ధరిస్తేనే శాస్త్రం అంగీకరిస్తుందనే నియమాన్ని బట్టి ఆ తర్వాత చక్కని శంఖచక్రాలను శ్రీరామానుజులవారే చేయించి శాశ్వతంగ ఉండేట్లు అమర్చారు.



విష్ణుస్వరూపుడైన ఆ వేంకటేశస్వామికి శంఖచక్రాలను సమర్పించి ఆనాటి పరిపాలకుడైన యాదవరాజుకి సరియైన వ్యవస్థకి మార్గదర్శనం చేసారు. తదితరులకు కూడా యథార్థమైన విషయాన్ని ప్రబోధించి **బింబాధరుడ**నే అర్చకులవంటి అందరికీ పంచసంస్కారాలను ప్రసాదించి కట్టుదిట్టమైన వైష్ణవారాధనను వ్యవస్థగ ఏర్పరిచారు. ఆలయార్చకులు, అధికారులు లాంటి వారి క్రమశిక్షణ, సమయానికి జరిగే ఆరాధనలు లోపిస్తే, అవసరమైతే దండన వంటి అధికారాలు గూడ అనంతళ్వాన్‌కి యిచ్చారు. అనంతాళ్వాన్ ఆజ్ఞప్రకారమే ఆలయ నిర్వహణ, అంతరంగకైంకర్యాలసైతం జరిగేలా శ్రీభగవద్రామానుజులు నియమించారు. ఈ అనంతాళ్వాన్ వల్లనే శ్రీనివాసుడికి గెడ్డానికి పచ్చకర్పూరంతో అలంకారం ఏర్పడింది. పద్మావతీదేవిని తోటలో కట్టివేసిన ఘనత గూడ ఈయనకే దక్కింది.

స్వామియొక్క బ్రహ్మోత్సవాలు క్రింద తిరుపతిలో పద్మావతీదేవి సన్నిధిలోనే జరుగుతూండేవి. ధ్వజారోహణం మాత్రం పైన పెరుమాళ్ళ సన్నిధిలో నిర్వహించుకొని ఉత్సవాలు దిగువన ముగించిన తరువాత ధ్వజావరోహణం తిరిగి కొండపైన స్వామిసన్నిధిలో జరుగుతూండేది.

భగవద్రామానుజులు ఆలయం చుట్టూ అర్చకులు, సేవకులవంటి ముఖ్యుల గృహాలతో మాడవీధులను నిర్మించి స్వామి ఉత్సవాలు కూడా కొండపైననే జరిగేలాగా చక్కటి ఏర్పాట్లు చేయించారు. వరాహస్వామికి కూడా శ్రీనివాసుని కంటే ప్రథమ ఆరాధన, నైవేద్యం, ఉత్సవాలు కల్పించారు.

త్రిదండిసన్యాసులకు మూడు అంగాలు ఉంటాయి. దండ, కాషాయ, కమండలాలు. వాటిల్లో ఒక అంగమైన కాషాయదీక్షను మాత్రం ఇచ్చి ఆలయములోని సేవలను సక్రమంగా నడిపించే అధికారిగ వైరాగ్యంకల ఒక శిష్యుణ్ణి ఏకాంగిగా నియమించారు. అతణ్ణే **'విష్వక్సేనజీయర్'** అంటారు. శ్రీఅనంతాళ్వాన్లు, ఆచార్యులైన భగవద్రామానుజుల ఆజ్ఞను సమర్థవంతంగా నిర్వహిస్తూ శ్రీనివాసుని సేవను వృద్ధి పరిచారు.


ఆలయాలలో కైంకర్యం చేసే అర్చకులలోను వ్యవస్థను నిర్వహించే అధికారివర్గంలోను స్వార్థబుద్ధి చోటు చేసుకొని సదాచారాలు కొరవడినపుడు ఆయా ప్రాంతంలోని సమాజానికి కూడా హాని కలుగుతూంటుంది. ఆచారపద్ధతి, ఆలయ వ్యవస్థ, అక్కడ ఉండే సమాజానికి భగవత్సేవతో దృఢమైన సంబంధం ఏర్పరిచి శ్రీవేంకటేశ్వరుడికి, ఆ క్షేత్రానికిన్ని ప్రపంచంలోనే గొప్ప ఆలయంగ గుర్తింపు తేవాలని నిర్ణయించారు శ్రీభగవద్రామానుజులు. అందుకోసం శ్రీవేంకటేశ్వరుని వక్షఃస్థలంలో **'ద్విభుజవ్యూహలక్ష్మి'** అమ్మవారి మూర్తిని ప్రతిష్ఠించి, ఆమెకు శుక్రవారం ప్రత్యేకమైన అభిషేకం జరిగేలా ఏర్పాటు చేసారు.

ఆ తరువాత వారు, శ్రీరంగానికి వేంచేశారు. కూరత్తాళ్వాన్‌లాంటి విద్యావంతులైన శిష్యులతో శాస్త్రవ్యాసంగం కూడా నడుస్తూనే ఉండేది. బ్రహ్మసూత్రాలపై విస్తృతమైన భాష్యరచనకి కూడా వారు ఉద్యుక్తులయ్యారు. దానికి వ్యాసభగవానుడి ఆశయానికనుగుణంగ

బోధాయనుడు రచించిన **వృత్తిగ్రంథం**, కాశ్మీర్ ప్రదేశంలో శారదాపీఠం అనేచోట ఉన్నదని తెలుసుకొన్నారు.

భాష్యరచనకు ముందుగా ఆ గ్రంథాన్ని పరిశీలించాలనే సంకల్పం కూడా శ్రీరామానుజుల హృదయంలో కలిగింది. ప్రముఖమైన శిష్యబృందాన్ని కూడా తీసుకొని దక్షిణదేశంలో ఉండే దివ్యదేశాలను సేవించుకొని హిమాలయాల వరకు పర్యటించి ఆయాదివ్యక్షేత్రాలను సందర్శిస్తూ కాశ్మీరదేశం చేరారు. కొన్నిదినాలు శ్రీకూరత్తాళ్వాన్లతో కలిసి కూలంకషంగ **'బోధాయనవృత్తి'** గ్రంథాన్ని అధ్యయనం చేసారు.

అదే సందర్భంలో అక్కడి పండితప్రముఖులతో ఒక పెద్ద చర్చ జరుగుతోంది. వీరి వాదపటిమకు ప్రసన్నురాలైన సరస్వతీదేవి అక్కడ ప్రత్యక్షమైంది. వీరిని ప్రశంసించింది. "కప్యాస శ్రుతికి నీవు సరైన వివరణ నిచ్చావట. నీ నోట వినాలని కోరుతున్నా" అంటూ ఆ తల్లి ఆదేశించినది. రామానుజులు దానిపై ప్రసంగించి, ఆమెను ఆనందింపచేసారు.



పండితులంతా శిరస్సులు వంచారు. చదువులతల్లి

ఆనందంతో **'భాష్యకారా!'** అనే బిరుదుని ప్రసాదించడంతో పాటు ఒక హయగ్రీవస్వామి విగ్రహాన్ని కూడా ఆరాధనకోసం అనుగ్రహించింది. అక్కడ నుండే శ్రీరామానుజులు దిగ్విజయయాత్రనా రంభించారు. గీతాభాష్యం, బ్రహ్మసూత్రాలకు పరిమిత వ్యాఖ్యానమైన వేదాంత దీపం, వేదాంతసారం లాంటి గ్రంథాలను శ్రీరంగంలోనే స్వామి రచించారు. ఇదివరకే తిరుమలపై వేదార్థసంగ్రహాన్ని రచించి శ్రీనివాసుడికి వినిపించారు. ముందు ముందు విశదంగా బ్రహ్మసూత్రాలకు భాష్యరచన జరగాలనేది వారి హృదయంలో నాటుకొన్నది.

## శ్రీరామానుజులు-ఉత్తరదేశయాత్ర

ఉత్తరభారతపు పవిత్రభూభాగాలైన వ్రజమండలం, పుష్కరక్షేత్రం, ద్వారక, ప్రయాగ, గయ, నైమిశారణ్యం, అయోధ్య, సాలగ్రామక్షేత్రమైన ముక్తినాథ్, బదరికాశ్రమంలాంటి దివ్యక్షేత్రాలకు మంగళాశాసనం చేస్తూ విశిష్టాద్వైతసిద్ధాంత విజయధ్వజాన్ని దేశమంతటా ఎగురవేశారు స్వామి రామానుజులు. భగవద్రామానుజులలాంటి మహానుభావుల యాత్ర, **'తీర్థీకుర్వంతి తీర్థాని'** అన్నట్లుగా ఆయా క్షేత్రాలను, సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికే కదా !!

## శ్రీకూర్మంలో రెండవ ధ్వజస్తంభం

తిరుగు ప్రయాణంలో పురుషోత్తమక్షేత్రంగా ప్రసిద్ధి పొందిన పూరిలో జగన్నాథపెరుమాళ్ళను సేవించుకొని శ్రీకూర్మం క్షేత్రానికి వేంచేశారు. కూర్మనాథపెరుమాళ్ళ విషయంలో కూడా అక్కడ ఉండేవాళ్ళు

రకరకాలుగా తమకు తోచిన దైవంగా భావిస్తున్నప్పుడు ఆ స్వామియొక్క వాస్తవస్వరూపాన్ని గుర్తింపచేసి స్వామికి అవిచ్ఛిన్నంగా ఆరాధన-ఉత్సవాలు నడిచేలాగా మార్గదర్శనం చేసారు శ్రీరామానుజులు.

శ్రీకూర్మనాథుణ్ణి శివుడని భావించేవారు. ఆయన కూర్మనాథుడైన విష్ణువని రామానుజులు తెలిపారు. కావాలంటే తాము పశ్చిమదిశలో ఉండి ప్రార్థిస్తామని, అర్చకులు తూర్పుదిశలో ఉండి ప్రార్థించమన్నారు. ఆయన విష్ణువైతే ఉన్నస్థితిలోంచి అటు తిరుగుతాడు. లేకపోతే ఉన్నది ఉన్నట్లుగానే కొనసాగుతుందని తామే సవాలును స్వీకరించారు.

ఆమరునాడు జరిగిన ప్రార్థనలకు గర్భాలయంలోని మూర్తి పశ్చిమానికి తిరిగాడు. అందరూ ఆశ్చర్యంతో రామానుజులవారి ముందు మోకరిల్లారు. అర్చకులందరికీ పంచసంస్కారాలతో శ్రీవైష్ణవదీక్షను ప్రసాదించారు. శ్రీపాంచరాత్రాగమపద్ధతిలో ఆరాధనలను జరిపించి ముందుకుసాగారు.

ఆ తరువాత సింహాచలక్షేత్రంలోని శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామికి మంగళాశాసనం చేసి ఆ క్షేత్రంలో కొన్ని రోజులు వేంచేసి యుండి అక్కడుండే భాగవోత్తములకు సదుపదేశం చేసి భగవద్వైభవానికి వృద్ధి కలగాలని ఆశించారు. ఆ తరువాత మధ్యేమార్గం అక్కడక్కడ మానవసమాజానికి మంచి సందేశా న్నందిస్తూ మరల తిరుపతిక్షేత్రానికి చేరారు శ్రీరామానుజులు.

# మూడవసారి శ్రీరామానుజుల తిరుమలయాత్ర

మొదటసారిగా శ్రీరంగంనుండి తిరుమలక్షేత్రానికి వేంచేసి శ్రీనివాసుణ్ణి సేవించి అక్కడే తమ తొలిరచనగా శ్రీవేదార్థసంగ్రహాన్ని వినిపించారు శ్రీభగవద్రామానుజులు. ఆలయ స్థితిగతులను గమనించారు. పుష్పకైంకర్యానికి అనంతాళ్వాన్‌లను పంపి తోట నిర్మింపచేసారు.

రెండవసారి శ్రీరంగంనుండి తిరుమలకి వచ్చి శ్రీనివాసుని వాస్తవస్వరూపాన్ని నిర్ణయించారు. ఆ శ్రీనివాసునికి అసాధారణచిహ్నాలైన శంఖచక్రాలను, నుదుట ఊర్ధ్వపుండ్రాన్ని ధరింపజేసి మాడవీధులను నిర్మించారు. యోగనరసింహుని ఈశాన్యదిశలో ప్రతిష్ఠించి, విమానాన్ని బంగారు పూతతో జీర్ణోద్ధరణ జరిపించారు. బ్రహ్మోత్సవాలను కొండపైకి మార్చారు. ఏకాంగిని అధికారిగా నియమించారు.

**మూడవసారి**, సమగ్రంగా ఉత్తరభారతయాత్ర కాశ్మీరంలోని శారదాపీఠం దాకా చేసి, తిరుగుప్రయాణంలో తిరుమలకు వేంచేశారు. తిరుపతిలో శ్రీగోవిందరాజు సన్నిధి నిర్మాణం ఈ సమయంలోనే చేయించారు. శ్రీరామాయణం పాఠప్రవచనం జరుగుతూ ఉండగా మధురై నుండి వచ్చిన శ్రీరాముని మూర్తులతో సీతమ్మ విగ్రహాన్ని చేర్చి కొండపై ఆలయంలో చేర్చారు. ఆ విషయాన్ని తెలుసుకుందాం. ఈ మూడవసారి వేంచేసినపుడే శ్రీరామానుజులు ఒక సంవత్సరంపైగా తిరుపతిలోనే వేంచేసియున్నారు.

# శ్రీగోవిందరాజుల ప్రతిష్ఠకి ప్రయత్నం

దక్షిణదేశంలోని చిదంబరంలోనున్న **'తిల్లై త్తిరుచ్చిత్రకూటము'** అనే దివ్యదేశానికి కులశేఖరాళ్వార్లు, తిరుమంగైయాళ్వార్లును తమ పాశురాలతో మంగళాశాసనం చేశారు. శ్రీగోవిందరాజపెరుమాళ్, ఆ దివ్యదేశానికి ఆరాధ్యదైవం. సముద్రతీరాలలో పారే కాలువలకు ఇరువైపులా దట్టమైన పొట్టి చెట్లు నిండి ఉండే వనాలను **తిల్లైవనం** అంటారు. ప్రపంచంలో అతిపెద్ద వనాలు ఇక్కడ ఉండడం వల్ల ఈ క్షేత్రాన్ని 'తిల్లైత్తిరుచిత్తిరకూటం' అనేవారు. ఆళ్వారులు తమపాటల్లో కూడా ఆ పేరుతోనే ఇక్కడి స్వామిని పాడారు.

# కుళోత్తుంగుని ఉపద్రవం

ఆ ప్రాంతపు పాలకుడు కులోత్తుంగచోళుడు. గూడుకట్టుకొన్న వీరశైవాభిమానం అతనిలో విష్ణుద్వేషంగ మారింది. ఆ దివ్యదేశాన్ని కూల్చి గోవిందరాజమూల విగ్రహాన్ని సముద్రం పాలు చేశాడు. నిజానికి అతనికి వైష్ణవద్వేషం కాదు శివభక్తి అధికం. దానితో, మరొకరి ఆధిక్యాన్ని ఓర్వలేని తీవ్రభక్తిగ అది మారింది. **చిదంబరం** అనే పేరుకల ఆ తిరుచిత్రకూట క్షేత్రానికి పురాణచరిత్ర ఉంది. అందులో శివపార్వతులు నృత్యంలో పోటీపడి విష్ణువుని **'న్యాయనిర్ణేత'**గ పెట్టుకున్నారట. నాట్యంలో శివుడే గెలిచాడని శ్రీమహావిష్ణువు నిర్ణయించిన చోటు ఈ క్షేత్రం. అందుకే విష్ణువు ఎదుట శివుడు ఉంటాడు. 'శివుని గొప్పతనాన్ని విష్ణువు నిర్ణయిస్తే ఆయన్నే గొప్పవాడని లోకం తలుస్తుందనే భ్రమతో, ఆ చోళరాజు ఆ క్షేత్రంలో విష్ణువు ఉండకూడదని నిర్ణయించుకున్నాడు.

నిలబడి ఉండే గోవిందుని విగ్రహాన్ని తీసేసి, తానారాధించే శివుడి సన్నిధికి మెట్టుగ వేసాడు. అందరినీ దానిని తొక్కుతూ వెళ్లాలని ఆదేశించాడు. ఒకామె అలాకాకుండా ప్రక్కనుండి పోతూంటే ఆమెకు మరణదండన విధించాడు. చివరికోరికగ రాజుతో ఒకమాట చెప్పాలని ఆమె కోరింది. 'రాజా! చూస్తూ కద విగ్రహం తొక్కాలి. నాకసలు ఆ విగ్రహాన్ని చూడడమే ఇష్టం లేదయ్యా! అందుకే త్రొక్కలేదు' అంది. ఆమె తనకంటే గొప్ప శివభక్తురాలని భావించి, ఆమెను విడుదలచేసి, ఆ విగ్రహాన్ని సముద్రంపాలు చేసాడు రాజు. భక్తి వెఱ్ఱితలలు వేస్తే దైవద్వేషం ఇలానే తయారౌతుంది.

ఆసమయంలో శ్రీరామానుజులవారు తిరుపతిలోఉన్నారని తెలసి అక్కడి ఉత్సవవిగ్రహాలను అర్చకులు రహస్యంగా తిరుపతిక్షేత్రానికి తెచ్చి శ్రీరామానుజులవారి ముందుంచారు. విషయం తెలుసుకున్న శ్రీరామానుజులు 108 దివ్యదేశాలలో ఒకక్షేత్రం నామరూపాలు కోల్పోయి అలా నశించరాదు. దీనికేదో ఒక వ్యవస్థ చేయాలనుకున్నారు. తన స్థితి వదలి సముద్రానికి ఆదేవుడు చేరాడంటే, ఆయనకు శయనించిన మూర్తిగా దర్శనమివ్వాలన్నది ఇష్టం కాబోలు అని భావించి విశాలమైన మూలవిగ్రహాన్ని ఆదిశేషునిపై పవ్వళించినట్లు సుధామూర్తిగ తయారు చేయించి **గోవిందరాజస్వామి** అనేపేరుతో అప్పటికే తన శిష్యుడైన యాదవరాజుద్వారా ఆలయాన్ని నిర్మింపజేశారు.

ఆ ఆలయంలో ఆళ్వార్లందరిని ప్రతిష్ఠిచేటపుడు వారందరినీ తిరుమలైకి మంగళాశాసనం చేస్తున్నట్లే, అటుతిరిగి వేంచేసి ఉన్నట్లు

ప్రతిష్ఠించారు శ్రీరామానుజులు. చరిత్రను జాగ్రత్తగ గమనించి, రక్షించేవిషయంలో వారికుండే శ్రద్ధ అనన్య సామాన్యము కద!

ఒకే విగ్రహంలో శయనస్వామితో పరివారం కూడా కలిసియున్న రూపం కనుక నిర్మాణానికి చాలా సమయమవసరమయింది. అందుకే శ్రీభగవద్రామానుజులు ఏడాదికిపైగా అక్కడ ఉండవలసివచ్చింది.

## శ్రీశైలపూర్ణులసన్నిధిలో శ్రీరామాయణశ్రవణం

తిరుపతిలో ఉండే ఈ సమయంలోనే శ్రీశైలపూర్ణులసన్నిధానంలో శ్రీరామాయణాన్ని కూడా 18 ఆవృత్తులు కాలక్షేపంగా గ్రహించారు శ్రీరామానుజులు. తిరుమల పర్వతానికి క్రింది భాగంలో వీరికి పాఠం జరిగినచోటే తిరుమలనంబిగారికోసమే భగవంతుని పాదాలు వెలిశాయి. కనుక, **'అలిపిరి'** అనే ఆ స్థానంలోనే శ్రీరామానుజులు ఆ పాదాలవద్దనే ఆళ్వార్లను ప్రతిష్ఠించారు.

శ్రీనివాసుడు వీరి శ్రీరామాయణ కాలక్షేప గోష్ఠికోసం వచ్చి, ఆ రూపంలో వెలిసాడు. కనుకనే కొండనెక్కేవారంతా ముందిక్కడే నమస్కరించి ఆపై కొండనెక్కడమనేది సంప్రదాయ నియమం.

శ్రీశైలపూర్ణులు, కొండపైనే నిత్యభగవత్ కైంకర్యంలో ఉండేవారు. భగవద్రామానుజులు, గోవిందరాజస్వామి విగ్రహనిర్మాణాదులను పరిశీలిస్తూ క్రింద తిరుపతిలో ఉండవలసి వచ్చేది. స్వామి సేవను ముగించుకొని ఏరోజుకారోజు మధ్యాహ్నం శ్రీశైలపూర్ణులు క్రిందకి వచ్చేవారు. శ్రీరామాయణమంటే వాల్మీకి నోట వెలువడిన వాగమృతం

కదా! **'పాఠ్యే గేయే చ మధురమ్'** అన్నట్లుగా సామాన్యంగా అర్థం తెలియకుండా చదువుకొనేవారికి కూడా ఆ గ్రంథం ఆనందాన్నిస్తుంది.

విశేషజ్ఞులైన భగవద్రామానుజులు, వారి ఆచార్యులైన శ్రీశైలపూర్ణుల లాంటివారికి ప్రతి ఆవృత్తిలోను విశేషమైన రహస్యార్థాలు స్ఫురిస్తూండేవి. అంటే, 18 ఆవృత్తులలో 18 విధాలుగ రహస్యార్థాలను వివరించారు. వీటి సంక్షిప్త పరిచయాన్ని మన ఆచార్యపీఠం ముద్రించిన శ్రీరామాయణకోశాలలో ముందుగ శ్రీగోవిందరాజీయవ్యాఖ్యగ ముద్రించి ఉంచారు.


## తానై వచ్చిన శ్రీరామచంద్రుడు

ఒకరోజు, శ్రీరామాయణంలో విభీషణునికి రాముడు అభయ ప్రదానం చేసిన ఘట్టం శ్రీరామానుజులకు శ్రీశైలపూర్ణుల సన్నిధిలో పాఠప్రవచనంగా జరుగుతోంది. ఆ రామచంద్రస్వామి కృప, ఎంత విచిత్రంగా ఫలిస్తుందో చెప్పలేము. పెరుమాళ్ళు అర్చారూపంగా వచ్చి దర్శనమిచ్చారు. దక్షిణమధురైకి పశ్చిమదిక్కులో కృతమాలా నదీతీరాన **'కురువిత్తురై'**అని ఒక ఊరుంది. అక్కడ విశ్వంభరుడనే భక్తునికి కలలో సాక్షాత్కరించగ, అదేక్రమంలో ఆతడు నిర్మించుకుని ఆరాధించిన శ్రీరామపరివారం విభీషణ- అభయప్రదాన సన్నివేశంతో అర్చారూపంగా ఉండేది. శరణాగతి సమయంలో శ్రీరామునితో సీతమ్మ లేదుగద! అందుకే ఆపరివారంలో కూడా సీతమ్మ లేకుండానే ఉండేది.

ఒకరోజు ఆ పాకకు అగ్నిప్రమాదం కలిగింది. పరిస్థితి కొంత

చికాకుగా మారింది. అపుడు ఒక భక్తుడిలో ఆవేశం కలిగి 'నన్ను తిరుమల క్షేత్రానికి చేర్చండి' అని స్వామి చెప్పాడు. దైవవాక్కుని ఆధారంచేసుకొని మార్గాదులు తెలియకపోయినా కొందరు భక్తులు ఆ విగ్రహాలను తిరుపతికి తెచ్చి, పాఠం చదువుకుంటున్న శ్రీరామానుజుల దగ్గరికి చేర్చగలిగారు. భక్తులు చేయగలిగినదేమీ తెలియక ఆ విగ్రహాలను భగవద్రామానుజులవారి సన్నిధిలో అర్పించారు.

ఆ అర్చామూర్తుల సన్నివేశం సరిగ్గా పాఠం జరుగుతున్న సన్నివేశాన్నే వివరిస్తున్నది. ఎలాగంటే, ఇతనివల్ల మా రాముడుకి ఏమైన అపాయం కలుగుతుందేమో? అన్నట్లుగా అంగదుడు విభీషణునికేసి ఆకాశంవైపు చేయి చూపిస్తున్నాడు. సుగ్రీవుడు నమస్కరించి, శత్రుపక్షంవాడితడు.



సోదరుని వదలి వచ్చినవాడిని నమ్మవీలులేదని ప్రార్థిస్తున్నాడు. లక్ష్మణస్వామి ప్రక్కనే చేతులు కట్టుకొని నిలబడియున్నాడు. ఆంజనేయస్వామి, ఎవరిమీద పక్షపాతం లేకుండా ముఖం దగ్గర, కుడిచేతిని పెట్టుకొని 'రామా! నీవడిగావు కనుక నా అభిప్రాయాన్ని విన్నపం చేస్తున్నా' అన్నట్లుగా వినయంతో కనిపిస్తున్నాడు.

శ్రీరామానుజులు, శ్రీశైలపూర్ణులు కూడా విభీషణశరణాగతి ఘట్టాన్నే పరిశీలిస్తూన్న పుడు సరిగ్గా అదే సన్నివేశంతో అర్చా రూపుడైన శ్రీరామాచంద్ర స్వామి దర్శనమిచ్చినందుకు చాలా సంతోషించారు.

కొండమీద శ్రీనివాసుడు ఈ రాముడూ వేరుకాదు కనుకనే ఇక్కడికి చేర్చమని ఆదేశించాడని గుర్తించారు. సీతమ్మవారి మూర్తిని కూడా నిర్మించి ఆ సన్నివేశంలో స్వామితో చేర్చారు శ్రీభగవద్రామానుజులు. శ్రీనివాసుని ఆలయంలోనే ఈ మూర్తులను శాస్త్రవిధానంతో ప్రతిష్ఠించి కళ్యాణోత్సవాన్ని జరిపి ఆరాధనవ్యవస్థను ఏర్పరిచారు. ప్రతిసంవత్సరం శ్రీరామనవమికి మరునాడు ఆ సీతారామచంద్రమూర్తులకు కళ్యాణోత్సవం జరగాలని అనంతాళ్వాన్లకు అధికారులకు ఆదేశించారు శ్రీభగవద్రామానుజులు.

## శ్రీగోవిందరాజుల ఆలయ ప్రతిష్ఠ

శ్రీగోవిందరాజ పెరుమాళ్ళ విశాలమైన మూలవిగ్రహనిర్మాణం పూర్తయిన తరువాత ఆ గోవిందరాజస్వామికి పట్టమహిషిగా భూదేవికి ప్రతిరూపమైన శ్రీగోదాదేవియొక్క మూర్తిని స్వామికి దక్షిణభాగంలో

ప్రతిష్ఠంచారు శ్రీరామానుజులు. కొండపైన జరిగే శ్రీనివాసుని ఉత్సవాలకు అడ్డు లేకుండా శ్రీగోవిందరాజుల ఉత్సవాలు జరిగేలా ఏర్పాటు చేయించారు.

అళ్వార్లు పర్వతారోహణం చేయకుండా క్రిందనుండే మంగళాశాసనం చేశారు కనుక వారిని ఈ ఆలయంలో పర్వతాభి ముఖులు గానే ప్రతిష్ఠ చేశారు. యాదవరాజు శ్రీభగవద్రామానుజులకు అభిమతశిష్యుడయ్యాడు. ఆచార్యుల ఆదేశాన్ని, సంకల్పాన్ని కూడా పూర్తిగా గుర్తించి పని చేస్తుండేవాడు. ఆ గోవిందరాజపెరుమాళ్లకు విశాలమైన వీధులను, గోపుర, ప్రాకార, మండపాదులను నిర్మించాడు. ఆచార్యులైన భగవద్రామానుజుల పేరుతోనే **'శ్రీరామానుజపురము'** అని ఆ నగరాన్ని నామకరణం చేసాడు. వారి ఆదేశం ప్రకారం అంతా ఏర్పాటు చేశాడు.

శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీగోవిందరాజస్వామి ఇద్దరును తోడుగ ఉండి లోకాన్ని అనుగ్రహించాలని సంకల్పించి ఉంటారు. అందుకే సహోదరులుగా ఏకకుటుంబంగా ఆశ్రితులకు అందారు. కొండపైన శ్రీనివాసుని సన్నిధిలోను, కొండ దిగువన గోవిందరాజస్వామి సన్నిధిలోను నిత్యసేవాకాలం ఒకేలాగా జరగాలని భగవద్రామానుజులు ఒకే దివ్యదేశంగా వ్యవస్థ చేశారు. **త్తిల్లైత్తిరుచ్చిత్రకూటం** అనే దివ్యదేశాన్ని కులశేఖరాళ్వార్లు, తిరుమంగైయాళ్వార్లు ఇద్దరు పాడారు. ఆ పాటలుండే దశకాలను శ్రీగోవిందరాజులసన్నిధిలోను శ్రీనివాసుని సన్నిధిలో కూడా అనుసన్ధానం చేయాలని ఏర్పాటు చేశారు స్వామి శ్రీరామానుజులు. వరాహ

పురాణంలోని వెంకటేశాష్టోత్తరశతనామావళిలో **గోవిందాయ నమో నిత్యం శ్రీనివాసాయ తే నమః** అని గానం చేశాడు వ్యాసమహర్షి. ఆ ఋషి వాక్యాన్ని నిజంసేచ్తూ శ్రీనివాసుడికి, గోవిందరాజులకి సన్నిహితమైన సంబంధముందని శ్రీరామానుజులు నిరూపించారు.

## శ్రీనరసింహస్వామికి ఆరాధన వ్యవస్థ

తిరుమలలో లక్ష్మీదేవి లేకుండా ఉన్న యోగనరసింహస్వామి ఆరాధన వల్ల విఘ్నాలు చికాకులు వస్తున్నాయని భావించి ఆ మూర్తిని ఉగ్రమూర్తిగ భావించి, ఆయనకి ఆరాధనలు మాని, పుష్కరిణికి పశ్చిమాన పారవేసారు. శ్రీభగవద్రామానుజులు ఆ విషయాన్ని గమనించి క్షేత్రాధిపతి అయిన నరసింహస్వామికి ఆరాధనాలోపం, క్షేత్రం యొక్క అభ్యుదయానికి హానిని కలిగిస్తుందని నిర్ణయించి. ఆనందనిలయమనే దివ్యవిమానానికి అభిముఖంగా అంటే పశ్చిమం వైపు చూసేట్టు ఆలయంలోనే ఈశాన్యభాగంలో ఎత్తుగ ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఇలా భిన్నభిన్నసమయాలలో వేంచేసి శ్రీభగవద్రామానుజుల వారు తిరుపతి-తిరుమలక్షేత్రాన్ని, ఆలయవ్యవస్థను, అధికారుల ఆచరణలను సరిదిద్దారు.

## తిరుపతిలోనే భాష్యరచన ప్రారంభం

ఈ తిరుపతినివాసకాలంలోనే శ్రీభాష్యరచనను కూరత్తాళ్వాన్లతో కలసి కొంత సాగించారు స్వామి శ్రీరామానుజులు. సమగ్రభాష్యరచనకు

కావలసిన పూర్వరంగాన్ని కూడా ఇక్కడ ఉండగానే తయారు చేసుకున్నారు. జీవుడుకి స్వరూపం జ్ఞాతృత్వంతో కూడిన శేషత్వమా? శేషత్వంతో కూడిన జ్ఞాతృత్వమా? ఇలాంటి ప్రశ్నలు వచ్చాయి. ఇవి చిన్ని ప్రశ్నలుగ మనకి అనిపించినా శాస్త్రగహనమైన విషయాలు. శిష్టాగ్రేసరులైన గోష్ఠీపూర్ణులు వేంచేసియున్నారు కనుక వారి సన్నిధికి కూరేశులను పంపించారు శ్రీరామానుజులు. ఆళ్వారుల **అడియేనుళ్లాన్** లాంటి పాశురాలను చూపించి భగవంతుడికి సేవచేయడమనే శేషత్వమే ఆత్మకు ప్రధానలక్షణం. ఆ శేషత్వం ప్రధానంగా ఉన్న జ్ఞాతృత్వమే జీవుడికి స్వరూపమని శ్రీగోష్ఠీపూర్ణులు సమాధానమిచ్చారు. దీనినే **శేషత్వే సతి జ్ఞాతృత్వం** అనే లక్షణంగ తమగ్రంథంలో నిరూపించారు శ్రీరామానుజులు.

## మరల శ్రీరంగానికి ప్రస్థానం

మిగతా రచన, శ్రీరంగం వెళ్ళిన తరువాత చేద్దామని సంకల్పించి తిరుపతిలో ఆలయపరిష్కారాదులు పూర్తయ్యాక శ్రీనివాసుని సన్నిధిలోను, శ్రీశైలపూర్ణుల సన్నిధానంలోను ఆజ్ఞను తీసుకొని శ్రీశైలపూర్ణులదగ్గర శిష్యరికం చేస్తూ అతినిష్ఠతో మెలుగుతున్న గోవిందభట్టర్‌ని కూడా తమతో చేర్చుకొని శ్రీరామానుజులు దీర్ఘకాలం తరువాత శ్రీరంగానికి పయనించారు.

ఇలా తమ పరమాచార్యులైన యామునాచార్యులవారి ఆశయాని కనుగుణంగా మహాపూర్ణులవారి, మిగిలిన ఆచార్యుల మార్గదర్శనంతో శ్రీభగవద్రామానుజులు శ్రీరంగక్షేత్ర వ్యవస్థను సంస్కరించారు. తిరుమల

తిరుపతి క్షేత్రాన్ని కూడా సంస్కరించారు. ఇలా శ్రీరంగం-తిరుమల క్షేత్రాలను పరిష్కరించడంతోను, ఆసేతుహిమాచలం పరమవైదికమైన వైష్ణవధర్మాన్ని వ్యాపింప చేయడంతోను భగవద్రామానుజుల కీర్తి దిగంతాలకు వ్యాపించింది.

## కలత చెందిన కుళోత్తుంగుడు

కుళోత్తుంగచోళుడు ఈ వైభవాన్ని తన గూఢచారులద్వారా తెలుసుకొంటూనే ఉండేవాడు. తాను వీరశైవుడు. తనదైన సంప్రదాయాన్ని ఆరాధిస్తూ మిగతావాటిని ఆదరించగలిగితే సమాజానికి హాని ఉండదు. కాని తన భక్తి విష్ణుద్వేషమై, క్రమంగ వైష్ణవధర్మం అంటే అసహనం పెరగడమే ఎన్నో ఉపద్రవాలకు దారితీసింది. అతణ్ణి వ్యాధిగ్రస్తుణ్ణి చేసింది. చివరికి అతనిపేరునే **'క్రిమికంఠుడి'**గా ప్రసిద్ధమయేట్టు చేసింది.

తిరుమల ఆలయం వైష్ణవాలయంగ నిరూపించడం, తాను నాశనం చేసిన చిదంబర గోవిందరాజ పెరుమాళ్ళకి తిరుపతిలో ఆలయం కట్టి పునరుద్ధరించడం, ఇలాంటివన్నీ గోరుచుట్ట మీద రోకటి పోటులా ఆరాజుగారి అహాన్ని దెబ్బతీసాయి. కసి తీర్చుకోవడానికి శ్రీరామానుజుల వారిని అదనుచూసి అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. అతని ఆస్థానంలోనే **నాలూరాన్** అనే వైష్ణవుడు ఉండేవాడు. వానికి ఏదో కారణంగ శ్రీరామానుజులవారిపై ద్వేషం కలిగింది. రాజుగారికి గల విష్ణుద్వేషాన్ని తనకు తగ్గట్టు మలచుకోవాలనుకున్నాడు.

“విష్ణువు విగ్రహాన్ని సముద్రంలో కలిపితే ఏమౌతుందయ్యా? ఆ ధర్మానికి ప్రచారకుడైన మూలపురుషుడు రామానుజులు. ఆయన్ని అరికడితే నీ కోరిక ఫలించినట్లే” అంటూ రాజుకి విషాన్ని నూరిపోసాడు. మంచికంటే చెడు త్వరగా ఫలిస్తుంది. కుళోత్తుంగచోళునికి ఈ విషం బాగా తలకెక్కింది. తిరుపతియాత్ర నుండి వీరు శ్రీరంగం చేరారనే విషయాన్ని తెలుసుకున్నాడు రాజు. తన సైన్యాన్ని పంపి, ‘వాదన’ అనే మిషతో వారిని తెమ్మన్నాడు. ఒకవేళ సవ్యంగ రాకపోతే వారిని బంధించి అయినా ఆస్థానానికి తీసుకురమ్మని సైన్యాన్ని పంపించాడు.

కుళోత్తుంగుడి సైన్యం శ్రీరంగానికి చేరిన సమయంలో శ్రీభగవద్రమానుజులు అనుష్ఠానానికి లోపల వెళ్ళియున్నారు. అప్పుడు, జరగబోయే అనర్థాన్ని శ్రీకూరేశులు పసికట్టారు. శ్రీరామానుజులవారి ఆచూకీ తెలిస్తే ప్రమాదమని వారు తెలుసుకొన్నారు.

ఆ వచ్చిన కుళోత్తుంగుని సైన్యానికి రామానుజులు ఎవరో తెలియదు. ఆ రామానుజులవారి దండ-కాషాయాలను తానే ధరించి తానే రామానుజులన్నట్లుగా నటించారు. వెంటనే తమతో బయలుదేరాలని సైనికులు ఆదేశించారు. సభలో వాదానికి నిలువవలసి ఉంటుందని, ఇది రాజాజ్ఞ అని తెలిపారు. శ్రీకూరత్తాళ్వాన్లు ఒంటరిగా వెడితే ఏమవుతుందో ఊహించి శ్రీమహాపూర్ణులుగూడ వారితో బయలు దేరాలని నిర్ణయించారు. వృద్ధులైన తండ్రిగారికి తోడుండాలని వారి కుమార్తె అత్తుళాయమ్మకూడ వారితో బయలుదేరింది.

శ్రీమహాపూర్ణులవారే తమ శిష్యులన్నట్లుగా వారి కుమార్తె శ్రీ అత్తుళాయమ్మని కూడా తీసుకొని శ్రీకూరత్తాళ్వాన్లు రాజసభకు బయలుదేరారు. బయలుదేరబోతూ కూరత్తాళ్వాన్లు, ముదలి యాండాన్, ధనుర్దాసు మొదలైనవారితో భగవద్రామానుజులను అతిజాగ్రత్తగ సురక్షితప్రాంతానికి వీలైతే కర్ణాటక రాజ్యానికి పశ్చిమదిశగ వెంటనే తరలించమని రహస్యంగ చెప్పి బయలుదేరారు.

వారి పరిశీలన ఫలితమే మేల్కోటక్షేత్ర ఆవిర్భావానికి దారి తీసింది. కుళోత్తుంగుడి పాలన శ్రీరంగానికి ఉత్తరభాగంలో కళింగరాజ్యందాక ఉంది. దక్షిణభాగం మధురై వరకు ఉంది. అందుచేత రామానుజుల వారిని అక్కడ సురక్షితంగ ఉంచలేరు. పూర్తి పశ్చిమదిక్కులోనైతే కళ్యాణచాళుక్యుల పాలన సాగుతోంది. వీరు హోయసాల రాజుల సామంతులు. వారికీ కుళోత్తుంగుడికీ వైరం. కనుక, రామానుజులను అటువైపు పంపడమే శ్రేయస్కరమని శ్రీరంగానికి పశ్చిమంగ ఉండే తొండనూరు రాజ్యానికి తీసుకువెళ్ళి సురక్షితంగ ఉంచండని శ్రీకూరేశులు తెలిపి, తాము రాజసభకు బయలుదేరారు. వారి ఊహయే భవిష్యత్తులో శ్రీరామానుజులకీర్తి దిగంతాలకు వ్యాపించే సంస్కరణ లకు దారితీసింది.

శ్రీరామానుజలవారిపై చిన్నలు, పెద్దలు అనే తేడా లేకుండా అప్పటివారికందరికీ ఉండే ఆరాధ్యభావానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే.

# మూర్ఖుల సభలో కూరేశుల ప్రయాస

చోళరాజు పండితసభకి కూరత్తాళ్వాన్ పరివారాన్ని తెచ్చారు. ఉగ్రవాదులతో నిండి ఉందా సభ. వాదనకి, తర్కానికి చోటు కనిపించలేదు వీరికి. పండితవాదం జరగాలనేది లక్ష్యం కానేకాదు కద! తాను నమ్ముకొన్న తత్త్వమే వాస్తవమని ముద్ర వేయించుకోవడమే ఆ రాజు లక్ష్యం. తాననుకొన్న విషయాన్ని అంగీకరించనివారిని అంతం చేయాలి. వితండవాదం, మొండివాదమే వారి విధానం.

శ్రీకూరేశులు మొదట శాస్త్రాన్ని వివరించి సభలో తత్త్వాన్ని నిరూపించే ప్రయత్నం చేసారు. వీళ్ళ తీరు కూరత్తాళ్వాన్లకు విసుగు పుట్టించింది. 'శివాత్ పరతరం నాస్తి' 'శివునిమించిన పెద్దదేమీలేదు'. అనమంటాడు. విసిగి వేసారిన కూరేశులు "ద్రోణమస్తి తతఃపరం" అని ప్రతిపాదించి ఊరుకున్నారు.

'శివ'మంటే ఒక తవ్వెడు అని అర్థం. 'ద్రోణ'మంటే నాలుగు తవ్వలు అని అర్థం. 'ద్రోణ'మనేది నీవు చెప్పిన శివముకంటే పెద్దది. అని కూరేశులు ముగించారు. రాజుకిది పుండు మీద కారం చల్లినట్లైంది. వెంటనే వీరి కన్ను తీయించాడు. తాను కోరినవారు వీరుకాదు, రామానుజులు తప్పించుకుని, తమని మోసం చేసారని కూడా భావించారు. అహం దెబ్బతిని, అవమానానికి మండిపడి శ్రీమహాపూర్ణులు, కూరత్తాళ్వాన్లు ఇరువురి నేత్రాలు పెకలింపచేసాడు. మహాపూర్ణులు, అప్పటికే 105సంవత్సరాల పెద్దవయస్సు కలవారు. క్రూరంగ పీడించి సభలోంచి

బయటకు తోయించేసాడా క్రూరనృపతి. ఎవ్వరూ తోడుపడే సాహసం చేయలేకపోయారు. ఒంటరి అత్తుళాయమ్మ సహాయంతో వారిద్దరు శ్రీరంగందారిపట్టారు. వస్తూ వస్తూ మార్గమధ్యంలోనే బాధకు ఓర్వలేక



105 సంవత్సరాల వృద్ధులైన శ్రీమహాపూర్ణులు పరమపదించారు. (ఆ సమయం క్రీ.శ. 1102)

సంప్రదాయాన్ని, శ్రీభగవద్రామానుజులను కూడా సంరక్షించడానికి శ్రీకూరత్తాళ్వాన్లు, శ్రీమహాపూర్ణులిరువురు చేసిన త్యాగం, సాహసం కూడా విలువ కట్టలేనివి. ఆచార్య సంరక్షణ విషయంలో వారు చేసిన త్యాగమే కద, శ్రీరామానుజులవారిని మనకి దక్కించింది.

శ్రీకూరత్తాళ్వాన్లు, అత్తుళాయమ్మ సహాయంతో అలా దారిలోనే మహాపూర్ణులకు సంస్కారం చేసి శ్రీరంగానికొచ్చారు. బాధాకరంగా ఇంతా

జరిగినా, శ్రీభగవద్రామానుజులు సురక్షితంగా పశ్చిమదేశానికి (కర్ణాటక) పయనించారని తెలిసి శ్రీకూరత్తాళ్వాన్లు సంతోషించారు.

శ్రీరామానుజులు, శ్వేతవస్త్రంతో బయలుదేరి ధనుర్దాసు, దాశరథి (ముదలియాండాన్) లాంటి ప్రధానశిష్యులు తోడురాగా, ఇష్టం లేకపోయినా పశ్చిమప్రాంతంలోని ఘోరమైన అడవులను దాటుతూ ప్రస్థానం చేసారు. శ్రీకూరేశులు, మహాపూర్ణులు కూడా సాహసించి తన ప్రాణరక్షణకై తనతో చెప్పకుండానే ఆ క్రూరుల సభకు వెళ్ళినందుకు బాధపడ్డారు శ్రీరామానుజులు. ఫలితాన్ని పరమాత్మాధీనం చేసి, కీకారణ్యాలగుండా పశ్చిమదిశగ ప్రయాణం చేసారు.

## శ్రీరామానుజుల కర్ణాటక యాత్ర

### గిరుజనులపై కురిసిన కృప

శ్రీరామానుజులవారు, శిష్యులతో కలసి కర్ణాటక ప్రాంతానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వైష్ణవులైన గిరిజనులెందలో వచ్చి, వారిని సేవించుకున్నారు. వాళ్ళు తేనె, పండ్లు లాంటి వన్యపదార్థాలను కానుకగ తీసుకువచ్చారు. వీరంతా శ్రీరంగం నుండి వస్తున్నారని తెలిసి ఉప్పొంగిపోయారు.

'రామానుజులవారు బాగున్నారా!' అని ఆ వనేచరులైన భక్తులు శ్వేతవస్త్రంలోనున్న శ్రీరామానుజులను వారి బృందాన్ని అడిగారు. ఈ అడవులలో సంచరించే మీకు రామానుజుల గురించి ఎలా తెలుసు?

అని వీరు ప్రశ్నించారు. మాకు '**నల్లాన్‌చక్రవర్తి**' అనే ఆచార్యులు పంచసంస్కారదీక్షను ప్రసాదించారు. అప్పుడు మాకు హితోపదేశం చేస్తూ... 'ఎంబెరుమానార్లు మీకు పరమాచార్యులు. వారి పాదాలనే రక్షకమనినమ్మి ఉండండి' అని చెప్పారు. అప్పుడు 'భగవద్రామానుజులు వీరే' అని శిష్యులు పరిచయం చేసారు. ఆ గిరిజనులది చెదరని గురుభక్తి. అనుకోకుండా ఎదురైన అదృష్టానికి అవధులులేని ఆనందాన్ని పొందారు వారు. ఆ అడవులన్నీ వెన్నెలపూచినట్లైంది. భగవంతుడికి ఆ గిరిజనులంటే ఉండే ప్రేమను శ్రీరామానుజులు ఆశీర్వదించి ముందుకు సాగారు. ఇలా అరణ్యప్రాంతాలలో కూడ ప్రేమపూరితమైన రామానుజుల వైభవం వ్యాపించింది. అరణ్యవాసులైతేనేమి? భగవద్రామానుజులను గుర్తించి, వారనుగ్రహాన్ని పొందిన ఆ గిరిజన భక్తులు ఎంతో ధన్యులు కద!

## కొంగుపిరాట్టి (చేలాచలాంబ) పై శ్రీరామానుజుల అనుగ్రహం

ఈ కొంగుపిరాట్టి, కర్ణాటకప్రాంతానికే చెందిన మహిళామతల్లి. ఒకప్పుడు ఆమె నివసించి ఉండే ఆప్రాంతంలో చాలాకాలం వానలు కురవలేదు. ఆమె తనభర్తతో శ్రీరంగక్షేత్రానికి వెళ్ళి, కొన్నాళ్ళు నివాసం ఏర్పరచుకుంది. ఒకనాడు చాలామంది శిష్యులతో శ్రీరామానుజులు శ్రీరంగంలో వీధిపరిక్రమణ చేస్తున్న సన్నివేశాన్ని దూరంనుండి ఆమె చూసింది. వారి వైభవానికి ఆశ్చర్యపడి, దగ్గరకు వెళ్ళి, దండంపెట్టి వారి సన్నిధిలో వినయంగ నిలబడింది. 'ఏమమ్మా?' అని అడిగారు శ్రీరామానుజులు.


'ఇంతమంది మహానుభావులు మిమ్మల్ని అనుసరించడానికి కారణమేమి?' అని ఆమె అడిగింది. 'ఈ దుఃఖసాగరాన్ని దాటించే మంత్రం మానుండి పొందారు. ఆ కృతజ్ఞతతో వీళ్ళంతా నన్నుసరిస్తున్నారు' అనికూడ సమాధనమిచ్చారు శ్రీరామానుజులు. నన్నుకూడా దుఃఖసాగరాన్ని దాటించరూ! అని దీనంగ ప్రార్థించింది. ఆమె ఆర్తిని గమనించి వైష్ణవదీక్షనిచ్చారు ఆమెకు. వారినుండి పాదుకలను కోరి లభించుకుంది. అప్పుడు ఆ కొంగుపిరాట్టి కూడా ఆర్తితో శ్రీరామానుజుల వారి సన్నిధిలో వైష్ణవదీక్షను గ్రహించింది. స్త్రీకైనా, పురుషునికైనా భగవంతుని మంత్రం గ్రహించడానికి సమాన అర్హత ఉందని ఈ సంఘటనద్వారా శ్రీరామానుజులు నిరూపించారు. శ్రీరామానుజులకు పూర్వము స్త్రీలకు మంత్రం పొందే అవకాశం లేదు కాబోలు. ఆ నియమాన్ని దాటి, పురాణేతిహాసాలు కూడా తెలిపినట్లు భగవంతుని కందరూ సమానులేనన్నారు. తరువాతికాలంలో ఆమెకున్న ఆచార్య నిష్ఠను గమనించే కర్ణాటకకు సాగే దినాల్లో ఆమె ఆరాధనను కూడా శ్రీరామానుజులు తమపరివారంతో స్వీకరించారు.

## దండకాషాయాల పునర్ధారణ

కొన్ని దినాలకి శ్రీరామానుజులు తమపరివారంతో మేల్కోటలో కొండపై వేంచేసియున్న నరసింహస్వామిని చేరారు. అక్కడ వేదపుష్కరిణిని దర్శించారు. శ్రీమద్భాగవతం, వేదోద్ధారం చేసిన అవతారాలలో ఒకటిగా కీర్తిస్తుంది దత్తాత్రేయుణ్ణి.

చరిత్రలో మొదటి త్రిదండి సన్యాసిగా దత్తాత్రేయునికి గుర్తింపు ఉన్నది. అక్కడికి చేరిన త్రిదండి సన్యాసులు తమ దండ కాషాయాలను ఆ దత్తాత్రేయుని పాదాల దగ్గర సమర్పించి స్వీకరించడం వారికి తేజోదాయకంగా భావిస్తారు. హోయసాలరాజుల సామంతుడైన కళ్యాణ చాళుక్యుడికి చెందిన ఆ సురక్షిత ప్రాంతానికి చేరి, దండ కాషాయాలను దత్తాత్రేయుని సన్నిధిలో సమర్పించి భగవద్రామానుజులు తిరిగి స్వీకరించారు. శ్రీరంగంనుండి బయలుదేరి నెలలు కావడంతో నుదుట ధరించే తెల్లని తిరుమణ్ పూర్తైపోయింది. ఆ ప్రాంతాలలో వెదికారు.

ఆనాటి రాత్రి స్వప్నంలో ఒక పుట్టలో విష్ణుస్వరూపంతోపాటు తిరుమణ్ కూడా ఉన్నట్లు దర్శించారు. ఆ గుర్తులను బట్టి సాగిన అన్వేషణలో 6 అడుగుల తిరునారాయణుని సుందరమూర్తి, తిరుమణ్ కూడా వారికి



లభించింది. చాలాకాలం క్రితం ఇక్కడ ఒక ఆలయముండేదని, నాస్తికుల ప్రభావంవల్ల అదెప్పుడో మట్టిలో కలసి పోయిందని స్థానికభక్తులు చెప్పారు. ఆ దేవుడు తిరిగి ఇలా ప్రత్యక్షమవ్వడంతో పశువులను కాచుకొనే అక్కడి భక్తుల ఆనందానికి అవధులు లేవు. దగ్గరలో ఉండే కళ్యాణి పుష్కరిణిలో విగ్రహాన్ని శుద్ధి చేసారు రామానుజులు. ఆలయాన్ని నిర్మించడానకి ఎలా ప్రయత్నించాలో ఆలోచించసాగారు.

రాజాశ్రయణ లేనిదే ఇలాంటి బృహత్కార్యాలు సాగవు. అక్కడి బీద పశువుల కాపరులలో ధనవంతులు లేనే లేరు. సమయంకోసం ప్రతీక్షించసాగారు శ్రీరామానుజులు.

## తొండనూర్‌నంబి ఉపకారం

చోళరాజుకి శత్రువులైన కళ్యాణచాళుక్యుల సామంతరాజవంశమైన హోయసాలురు తొండనూరు రాజధానిగ పాలించే రోజులవి. రామానుజులు ప్రభావం తెలిసిన **తొండనూర్‌నంబి** అప్పటిరాజైన **విట్టిదేవుని** ఆస్థానంలో ప్రధానమైన అధికారి. ఆ రాజుగారి కుమార్తె, దీర్ఘకాలంగా భూతావేశంతో బాధపడుతోంది. జైనమతావలంబులైన ఎందరో మునులు ఆ ప్రాంతమంతా ఉండేవారు. వీరి ప్రభావంవల్ల అదే మార్గంలో ఆ రాజుకూడా ఉండేవాడు. వారందరు ఎన్నో రకాలుగా ఆ రాజకుమార్తెను బాగు చేయడానికి ప్రయత్నాలు చేసి విఫలురయ్యారు. రాజుగారికి అదొక తీరని దుఃఖాన్ని కలిగిస్తూండేది.

తొండనూర్‌నంబి, రామానుజులవారు ఆ ప్రాంతానికొచ్చిన విషయాన్ని తెలుసుకొని వారిని సేవించుకొన్నాడు. ఆ ప్రాంతమంతా అనావృష్టితో పీడతమౌతోందనీ ఆ రాజుగారికుమార్తె గ్రహావేశంతో పీడితమౌతోందని రామానుజులవారికి వివరించాడు. క్రొత్తగా బయటపడ్డ నారాయణుడి విగ్రహాన్ని గురించి కూడా భక్తులద్వారా ఆయన తెలుసుకున్నాడు. రామానుజులవారిని రాకుమార్తె బాధను తొలగించే ప్రయత్నం చేయమని, దానివల్ల రాజుకి సంతోషం కలిగితే ఆలయనిర్మాణం వెంటనే అయిపోతుందని ప్రేరణ కలిగించాడు. రామానుజులవారు దాని కంగీకరించారు.

నంబిగారు, రాజుగారితో క్రొత్తగా వచ్చిన యతీశ్వరులను, వారి వైభవాన్ని వివరించారు. రామానుజులవారు చిన్న వయస్సులోనే కాంచీపురాన్ని పాలించే రాజుగారి కూతురికి గ్రహపీడను తొలగించిన చరిత్రను చెప్పారు. నియమబద్ధంగా వారిని ఆహ్వానిస్తే తమ కుమార్తెకు కూడా శ్రేయస్సు కలుగుతుందని బోధించారు. రాజుగారికి చీకటిలో దీపం పెట్టినట్లయింది. రాణులతో రామానుజుల వద్దకు వెళ్ళి తన కుమార్తె బాధను తొలగించమని అర్థించారు.

## విట్టిదేవుని దుఃఖం దూరమైంది

ఆచార్యులంగీకరించి రాజభవనానికి చేరారు. అంతవరకు ఉద్రిక్తంగా ఉండే యువరాణి, రామానుజులను సేవించగానే శాంతించి వారి పాదస్పర్శను, శ్రీపాదతీర్థాన్ని అర్థించింది. వారనుగ్రహిస్తే తాను ఈ పిల్లను

వదిలి పోతానని చెప్పింది. దానికి నిరూపకమేమి? అని ప్రశ్నిస్తే దూరంగా కనిపించే పెద్ద చెట్టు కొమ్మ, తానామెను వదిలిన ఉత్తరక్షణంలో విరిగిపోతుంది. ఈమెను తానొదిలిపోతున్నందుకు అదే గుర్తు అని చెప్పింది.

రాజు, దీనుడై ప్రార్థించగా రామానుజులు శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించి ఆమెతలపై తమ శ్రీపాదాన్ని ఉంచారు. యువరాణి స్పృహ తప్పిపడిపోవడం, కొద్దిక్షణాల్లో ఆ కొమ్మ ఫెళఫెళమంటూ విరిగిపడటం రాజుగారి ఆనందం ఆకాశాన్ని అంటడం క్రమంగా జరిగాయి. **విట్టిదేవుడు**, సంతోషసాగరంలో మునిగి తేలుతూ తనని, తన పరివారాన్ని కాపాడిన రామానుజులవారిని దైవంగా భావించి, తమను శిష్యులుగా స్వీకరించమని ప్రార్థించాడు. భగవద్రామానుజులు ఆయనకు, పరివారానికీ పంచసంస్కారదీక్షనిచ్చారు. **విష్ణువర్ధనుడు** అని నామకరణం చేసారు.

ఎంతోకాలంగా అధికారం చలాయించే అర్హమునులకు ఈ పరిణామం జీర్ణం కాలేదు. ఇది తమను అవమానించడంగ భావించారు. ఆవేశం కట్టలు తెంచుకొంది. తమ మార్గంలోంచి రాజు దూరమవ్వడం వారికి మింగుడుపడలేదు. వారిలో కొందరు దిగంబరులున్నారు. మరికొందరు శ్వేతాంబరులున్నారు. వీరంతా రామానుజులవారిపై వాదానికి దిగుతామన్నారు. రాజు రామానుజులవారిని ఈ విషయంలో ప్రస్తావించగా అందుకు 'తాము సిద్ధమే' అని అంగీకారాన్ని తెలిపారు.

రాజు వద్దనే ఒక ఒడంబడిక చేసుకున్నారు. ఓడినవారు గెలిచినవారి మార్గాన్ని అవలంబిచవలసి ఉంటుంది అనేది దాని సారం.

## ఓడిన జైనులు

వారు సుమారు పదివేలమంది ఉంటారని రాజు భయపడ్డాడు. దిగంబరులను చూడ్డం శాస్త్రనిషిద్ధం కనుక తాము తెరవెనుక ఉండే వారందరికి సమాధానం చెప్తామని రామానుజులవారు రాజుకి ధైర్యం చెప్పారు. పైగా ముఖాముఖిగా ఉన్నప్పుడు భావావేశాలు క్రమం తప్పే ప్రమాదం కూడా ఉందని తెర వ్యవధానంగా ఉండడంవల్ల ఆవేశాలకు కూడా తావుండదని రామానుజుల మధ్య తెర ఏర్పాటు చేయించారు.

రాజు నిర్ణేతగా ఉండగా వాదన జరిగింది. కొన్ని దినాలు జరిగిన ఉత్కంఠభరితమైన వాదనలో జైనమునులు మౌనాన్ని వహించవలసి వచ్చింది. రాజు, రామానుజులవారి ప్రామాణికమైన వాదనను యుక్తియుక్తంగా ఉన్నదని, వారే గెలుపు పొందారని ప్రకటించాడు.


రాజశాసనాన్ని అనుసరించి జైనమునులలో అధికులు వైష్ణవమార్గాన్ని అవలంబించారు. ఈ సన్నివేశాన్ని దర్శించిన అక్కడి పండితులు, ప్రజలు కూడా రామానుజులవారిని **వేలాది ఫణములుకల ఆదిశేషులే వీరంటూ** కీర్తించారు.

అనావృష్టిపీడితమైన ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయగలిగేటట్లు ఒక యోగ్యమైన స్థలాన్ని చూపి, అక్కడ ఒక ఆనకట్ట నిర్మించమని రామానుజులు రాజుని కోరారు. అందుకు కావలసిన సాంకేతిక

విధానాలను కూడా రామానుజులవారే సూచించారు. రామానుజులవారి సాంకేతిక ప్రతిభాపాటవాలకి ఆశ్చర్యపడ్డ **విష్ణువర్ధనరాజు**, వారికి మోకరిల్లాడు. ఇంతవరకు తాము చేయలేని ఈ నిర్మాణం ద్వారా వేలాది ఎకరాలు సాగుబడి జరిగి, ఆ ప్రాంతం సుభిక్షమౌతున్నందుకు కృతజ్ఞుడై, జలాశయాన్ని నిర్మించాడు. రామానుజులవారి సూచన మేరకు ఆ జలాశయానికి **"తిరుమలరాయసాగరం"** అని నామకరణం కూడా చేసాడు.

రామానుజులవారి వ్యావసాయిక విజ్ఞానానికి, నిర్మాణ నైపుణ్యానికి ఇదొక నిదర్శనం. దీనివల్ల ఆ ప్రాంతపు పశుసంపద కూడా సుఖపడింది.

శ్రీరామానుజులు, భౌతికమైన అవసరాలు ఆ ప్రాంతానికి తీరాయి కనుక, ఆధ్యాత్మికమైన అవసరాలు తీరేటట్లు చక్కటి ఆలయాన్ని



నిర్మించమని అందుకు భగవంతుడు విగ్రహరూపంలో అప్పటికే సిద్ధంగా వచ్చి ఉన్నాడని తెలిపారు. శ్రీరామానుజులవారి ఆజ్ఞప్రకారం విగ్రహం లభించిన ఆ ప్రాంతాన్ని **"మేలుకోట"**గా గుర్తించి అక్కడొక అద్భుతమైన ఆలయాన్ని శిల్పనైపుణ్యంతో రాజు నిర్మించాడు. అందులో రామానుజులవారు, **బహుధాన్య సంవత్సరం, మకరమాసం, (పుష్య శుక్ల) చతుర్దశి, గురువారం, పునర్వసు నక్షత్రంలో** విగ్రహప్రతిష్ఠ జరిపించి, ఆయనకి **"తిరునాయణపెరుమాళ్"**గా నామకరణం చేసారు. ఆ ప్రాంతాన్ని **"తిరునారాయణపుర"**మని వ్యవహరించారు. ఆళ్వార్ల పాశురాలలో తిరువాయ్మొళ్రిలో (4.1) నామసామ్యముంది కనుక, ఆ పాశురాలను రోజూ ఇక్కడ పఠించాలని నిర్ణయించారు.

తమ ఖజానాలలో ఏదో ప్రాచీన ఆలయానికి చెందిన **వజ్రకిరీట**ముందని రాజు తెలిపాడు. తెప్పించి చూస్తే ఆ కిరీటం శిలామూర్తికి చాలలేదు. వీరికి ఒక ఉత్సవమూర్తి ఉండిఉండాలని, వారెక్కడ ఉంటారని రామానుజులు ప్రశ్నించారు. ప్రాచీన ఆలయం శిథిలమైనప్పుడు ఆ విగ్రహాలను అప్పటి విద్రోహులు ఎత్తుకు పోయినట్టు, అవి క్రమంగా చేతులుమారి దేశానికి ఉత్తరాన దేహలీ ప్రాంతంలో ఎక్కడో సుల్తాన్ల పంచన చేరినట్లు కర్ణాకర్ణిగా విన్న గ్రామీణులు, పెద్దలు చెప్పారు.

# దేహలినగరానికి ప్రస్థానం


తానూ ఆ విగ్రహాన్ని తెచ్చే యాత్రలో పాల్గొనడానికి రాజు విష్ణువర్ధనుడు సిద్ధపడ్డా, రాజును వదలి, గ్రామీణులను తీసుకొని, రామానుజులు దేహలికి బయలుదేరారు. అక్కడి సుల్తానును కలువడానికి అంగీకారాన్ని పొందారు.

రామానుజులవారి రాకను తెలుసుకొని సుల్తాన్ ఆశ్చర్యపడ్డాడు. పరమసాత్త్వికులని తెలసి వారితో సంవాదానికి అంగీరించాడు. రామానుజులవారు ఆలయవివరాలు చెప్పి, తమ విగ్రహాన్ని తిరిగి ఇప్పించమని కోరారు. ఇలాంటివి విశ్వసించని ఆ సుల్తాన్ వెటకారంగా **"దేవుడు అంటున్నారు కదా! పిలవండి. ఆయన దేవుడైతే తప్పకుండా మీదగ్గరికి రావాలి కదా! మీ పిలుపుకి ప్రసన్నుడై వస్తే తప్పకుండా మీకిస్తాం"** అన్నాడు.

విశ్వాసం మూర్తీభవించిన రామానుజులు, రాజుగారి సవాలుకి అనుకూలంగా స్పందించారు. ‘‘అలా మా దేవుడు వస్తే ఆమూర్తిని తీసుకొని తిరిగివెళ్లడానికి వ్యవస్థనంతా చేసిపెడతారా?’’ అని ప్రశ్నించారు శ్రీరామానుజులు. రాజు దానికంగీకరించాడు కూడా.

# శ్రీరామానుజులను వరించిన శ్రీరామపిళ్ళై

నిమీలితనేత్రులై రామానుజులు చేసిన ప్రార్థన ఫలించింది. శంఖచక్రాలతో సలక్షణంగా ఉండే శ్రీరామపిళ్ళైవిగ్రహం, రామానుజుల



వారి ఒడిలో చేరింది. సభలో చప్పట్లు. సుల్తాన్ ముఖంలో ఆశ్చర్యంతో సంతోషం. రామానుజులవారి కనులలో ఆనందబాష్పాలు ఒకేసారి ఆవిర్భవించాయి.

సుల్తాన్, తన మాటకు కట్టుబడి వీరందరికి తిరుగు ప్రయాణానికి పూర్తి వ్యవస్థ చేసాడు. క్షణకాలం కూడా వ్యర్థం చేయకుండా రామానుజులు, పరివారం కూడా ఆ వాహనాల్లో తిరుగు ప్రయాణం చేసి మేలుకోటచేరారు. స్వతంత్ర సన్నిధిగా ప్రతిష్ఠించి ఆయనకు **"శెల్వపిళ్ళై"**గా నామకరణం చేసారు. గతంలో రాజుగారు చూపిన **వజ్రకిరీటం** సరిగ్గా ఈయనకి సరిపోవడంతో ఆయనే ఈయన అని నిశ్చయించారు. శిథిలమైన ఈ సన్నిధి దశాబ్దాల తరువాత తిరిగి ఇలా రూపుదిద్దుకొన్నందుకు అందరు ఆనందపరవశులయ్యారు.

కిరీటధారణ చేసిన ఫాల్గుణమాసపు పుష్యమీనక్షత్ర దినాన్ని ఇప్పటికి **"వైరముడి"** ఉత్సవంగా జరుపుతున్నారు.

ఇంతలో సుల్తాన్ అంతఃపురంలో కలకలం బయలుదేరింది. యువరాణి మందిరంలో ఆమె భద్రంగా దాచుకొన్న క్రీడావిగ్రహం మాయమైంది. ఎవరు తీసారో తెలయలేదు. సుల్తాన్‌కి ఫిర్యాదు చేసింది. విషయం సుల్తాన్ గ్రహించాడు. రామానుజుల ఒడిచేరగా సలక్షణంగా తాను పంపించింది ఈ విగ్రహమే అని గుర్తించాడు. గదిలోంచి రామానుజుల ఒడిలోకి చేరిన మాయ అర్థం కాకపోయినా జరిగిన విషయం యువరాణికి చెప్పి, దానిని తిరిగి తేవడం సాధ్యం కాదని ఆమెను ఓదార్చే ప్రయత్నం చేసాడు.

ఆమె వినలేదు సరికదా తానుకూడా అటే వెళ్లి విగ్రహాన్ని తెచ్చుకుంటానని మొండికేసింది. చేసేదిలేక తగిన భద్రతతో సుల్తాను ఆమెను పంపాడు. ఆమె తిరునారాయణపురం చేరేటప్పటికి పదిరోజులు గడిచిపోయింది. శాస్త్రీయంగా ప్రతిష్ఠితమైన మూర్తి దగ్గరకు చేరడానికి నియమాలు ఒప్పుకోలేదు. ఆ ఎడబాటును ఓర్వలేని ఆమె అక్కడే అశువులను బాసింది. గోదాదేవి వంటి ఆమె ఆర్తికి అచ్చెరువు పొందిన రామానుజులు ఈమె సామాన్యురాలు కాదని, లక్ష్మీదేవి అంశగా ఈమె ఆరాధనలందదగినదే అంటూ ఆమెకు **"బీబీ నాచ్చియార్"** అని నామకరణం చేసారు. ఈమెనే **"తులుక్కనాచ్చియార్"** అని కూడా అంటారు. ఈమెకు తగిన ఆరాధనను వ్యవస్థచేసి రామానుజులవారు తమ హృదయవైశాల్యాన్ని చాటుకున్నారు.

# దళితులు కారు, వీరు 'తిరుక్కులత్తార్'

సంపత్కుమారులు అక్కడకు రావడానికి కారణమైన వెనుకబడ్డ వర్గాలవారందరినీ ఉద్ధరించారు శ్రీరామానుజులు. బాగుపడాలని రుచికల జనులంతా భగవంతుని సేవలో అర్హులే. కొందరిని అస్పృశ్యులుగా సమాజంనుండి దూరం చేయడమనేది అనాగరికం. అందుకే రామానుజులవారు ఈ దళితవర్గానికి పంచసంస్కారాల్ని ప్రసాదించి వారికి నియమ నిష్ఠలను నేర్పి **"తిరుకులత్తార్"** అని పేరుపెట్టి, వాళ్ళకి మర్యాదను ఏర్పరచారు. వారికి భగవత్సేవలో కాహళిని ఊదే ఒక కైంకర్యాన్ని అప్పగించారు. అది ఈనాటికిన్నీ సాగుతోంది. భగవద్దర్శనానికి యోగ్యత కల్గించారు. ఈ రకంగా శతాబ్దాలనుండి సాగే అసమానతకు స్వస్తిపలికారు రామానుజులు. ఆధ్యాత్మిక పరివర్తనకు బాటలు వేసారు.

భగవద్రామానుజులు అక్కడ 52 శ్రీవైష్ణవకుటుంబాలను స్వామిసేవలో నియమించారు. వారు నేరుగా 12 సంవత్సరాలకాలం స్వామితిరువారాధనలో నిత్యం పాల్గొంటూ వారికి విధి విధానాలు స్పష్టం చేసారు. ఇదే సమయంలో కర్ణాటకరాజ్యంలోనే తొండనూర్ మొదలైన స్థానాలలో మరో 4 నారాయణసన్నిధులను ముదలియాండాన్ ద్వారా ప్రతిష్ఠింపచేసారు.

(1) నంబినారాయణ (2) తిరునారాయణ (3) వీరనారాయణ (4) విజయనారాయణ (5) కీర్తినారాయణ ఇలా "**పంచనారాయణులు**"

అని ప్రసిద్ధి పొందెట్టుగా శ్రీరామానుజులు ఆయా క్షేత్రాలను తీర్చిదిద్దారు. గతంలోనే వారు కూరత్తాళ్వాన్లతో కలిసి పరిష్కరించిన బ్రహ్మసూత్రభాష్యాన్ని ఇక్కడే సమగ్రంగా రూపుదిద్దారు. శ్రీయామునాచార్యులవారి చరమవిగ్రహ సన్నిధిలో తాము చేసిన మూడు ప్రతిజ్ఞలలో బోధాయనవృత్తిని అనుసరించి బ్రహ్మసూత్రాలకు భాష్యం రాయడం. దీనితో ఆ **మూడవ ప్రతిజ్ఞ కూడా నెరవేరింది.**

## జ్ఞానమండపం

1) యామునాచార్యులవారి ఇచ్ఛను పూర్తిచేయడంవల్ల.

2) జ్ఞానానికి ఫలితం-భగవంతుడికి దాసులై ఉండడమందరికి సమానమే. కులమేదైనా, మతమేదైనా యోగ్యత కలిగినట్లయితే వారిని భక్తులుగా స్వీకరించగలగడంకదా! ఆ విషయాన్ని ప్రకటించిన చోటు మేల్కోట. ఆ సమత్వాన్ని ప్రకాశింపజేసిన స్థలం కనుక ఈ క్షేత్రాన్ని "**జ్ఞానమండపం**" అని పెద్దలాదరించారు.

## తిరునారాయణపురం నుండి తిరుమలమీదుగ శ్రీరంగం

మేలుకోటలోని ఆలయవ్యవస్థ, కైంకర్యపరుల వ్యవస్థలన్నింటిని సుమారు 17 సంవత్సరాల కాలం అక్కడ ఉండి క్రమబద్ధం చేసారు శ్రీభగవద్రామానుజులు. అప్పటికే కుళోత్తుంగచోళుడు క్రిమికంఠుడై దేహాన్ని చాలించాడు. అప్పటికి 111 సంవత్సరాల వృద్ధులైన శ్రీకూరత్తాళ్వాన్లను కలవాలని శ్రీరామానుజులు త్వరపడ్డారు. తమకంటే

కూరేశులు వయస్సులో 9సం॥ల పెద్దవారు. పూర్వాచార్యులు సంరక్షించి, లోకానికందించిన పరమ వైదికదర్శనాన్ని కాపాడ్డంకోసం తమదృష్టినే సమర్పించినవారు శ్రీకూరేశులు. శ్రీరామానుజులు కర్ణాటక ప్రాంతానికి వేంచేసి చాలాకాలం గడిచిపోయింది.

**సంపత్కుమారజనకః** అంటూ శెల్వప్పిళ్ళై పెరుమాళ్ళకు తండ్రిగా కీర్తించారు శ్రీభగవద్రామానుజులను పెద్దలు. వారు పిలిస్తే ఒడికి చేరినవాడుకదా ఆ స్వామి! ఒక బావి గట్టుదగ్గర ఆడుకునే పిల్లవాడ్ని కన్నతల్లి తాను కూడా ఉండి, ఎంత సావధానంగా వాత్సల్యంతో కాపాడుతుందో, అలాగే ఈ శెల్వపిళ్ళై పెరుమాళ్ళను ప్రేమగా ఆరాధించండి! అని శ్రీభగవద్రామానుజులు తమ శిష్యులైన కైంకర్యపరులకు ప్రబోధించారు.

12 సంవత్సరాలు తామే ఆరాధనచేసి లాలించిన పెరుమాళ్ళను, తాము సంస్కరించి జ్ఞానమండపంగా తీర్చిదిద్దిన ఆ తిరునారాయణ పురక్షేత్రాన్ని కూడా విడిచి ప్రయాణం చేయడం, శ్రీభగవద్రామానుజుల మనస్సుకి ఒక విరహవేదనగానే మారింది. అయినా, **అత్రైవ శ్రీరంగే సుఖమాస్వ** అని శ్రీరంగనాథుడు తమకు విధించిన ఆదేశముంది. పరమాచార్యులైన శ్రీయామునమునుల అభిమతం కూడా అదే. కనుక శ్రీరామానుజులు మరల తిరుమలమీదుగా శ్రీరంగానికి ప్రస్థానం చేయడానికి సిద్ధమయ్యారు.

# తమర్ ఉగంద తిరుమేని

ఇంత సుదీర్ఘకాలం శ్రీరామానుజుల ఛత్రచ్ఛాయలో ఒదిగి ఉన్న శిష్యులకు తమ ఆచార్యులైన భగవద్రామానుజులు శ్రీరంగానికి బయలుదేరుతామని చెప్పినవార్త, దుఃఖాన్ని కలిగించింది. మిమ్మల్ని విడిచిపెట్టి మేముండలేమని ఏకగ్రీవంగా శిష్యులంతా వారిని ప్రార్థించారు.

స్వామి కైంకర్యం నడిపించాలికదా! 'మీకు ఆ వియోగదుఃఖం లేకుండా నా ప్రతికృతిని (ఒక విగ్రహాన్ని) నిర్మింపజేసి ఆ విగ్రహాన్ని ఆశ్లేషించి నా శక్తిని అందులో ఉంచి ప్రతిష్ఠ చేయిస్తాను. మీరంతా నేను ఈ రూపంగా ఇక్కడ ఉన్నానని భావించి పెరుమాళ్ళ సేవను నడిపించండి' అని శిష్యులకి, క్షేత్రప్రముఖులైన కైంకర్యపరులకు హితోపదేశం చేసారు శ్రీభగవద్రామానుజులు. శిష్యులు స్వయంగా ప్రేమతో ఆదరించిన శ్రీవిగ్రహం కనుక ఈ తిరునారాయణపురంలో వేంచేసియున్న శ్రీరామానుజుల అర్చావిగ్రహానికి **'తమరుగన్ద తిరుమేని'** అని పేరు.

ఇట్లా, ఈ క్షేత్రాన్ని పరిష్కరించి ఆ ప్రాంతపు పరిపాలకుడికి, అట్టడుగుస్థాయిలో ఉన్నవారికి, ఒకప్పుడు తమనే బుద్ధిమంతులుగా భావించుకునే జైనమునులకు, తదితరులందరికిన్ని భగవంతునిసేవలో యోగ్యతను కల్గించి ఒక నవీనమైన దివ్యవైభవాన్ని ఆ ప్రాంతానికి సమకూర్చారు శ్రీభగవద్రామానుజులు.

# నాల్గవసారి తిరుమలయాత్ర

భగవద్రామానుజులు, భగవంతుడికే ఆచార్యులు కనుక తాము పరిష్కరించి పరతత్త్వంగా నిరూపించిన తిరుమల శ్రీనివాసుణ్ణి పలకరించాలనుకున్నారు. శ్రీనివాసుణ్ణి చివరిసారిగా సేవించుకొని అక్కడ అవసరమైన వ్యవస్థను, వైభవాన్ని కూడా పెంచాలనుకున్నారు. అప్పటికే శతాధికమైన వయస్సు శ్రీభగవద్రామానుజులవారిది.

పరిమితమైన శిష్యబృందంతో తిరునారాయణపురం నుండి తిరుమలక్షేత్రానికి స్వామి రామానుజులు బయలుదేరారు. ఇంతకు ముందే శ్రీగోవిందరాజస్వామివారి ఆలయనిర్మాణం, ప్రతిష్ఠలాంటివి జరిపించారుకదా! కొండపైకి వేంచేసి శ్రీనివాసపెరుమాళ్ళని సేవించుకున్నారు శ్రీరామానుజులు.

శ్రీఅనంతార్యులను, పరమధార్మికుడైన యాదవరాజును కూడా పిలచి చివరిసారిగా తమ ఆజ్ఞను ఇలా విధించారు- ‘ అనంతాళ్వాన్! ఇప్పుడు నాకు 102 సంవత్సరాలవయస్సు, మీకు 66 ఏళ్ళ వయస్సు. ఆ సమయం (శాలివాహన శకం -1041) (క్రీ.శ. 1119) ఇక ముందు మాటిమాటికి నేనిక్కడికి రాలేను. ఉన్నవాళ్ళలో పరిపక్వమైన నిష్ఠ, వ్యవహారనైపుణ్యంలాంటి తగిన యోగ్యత మీకే ఉన్నది కనుక మీ నిర్దేశంతోనే ఇక్కడ ఆలయాలలో స్వామిసేవ జరగాలి’.

ఇంతకుముందు మేము నియమించిన ఏకాంగి, **‘సేనాపతిజీయర్’** ఒక్కడే అన్ని భారాలను నిర్వహించలేడు. కనుక ఆయనకు ప్రధానంగా

యత్యాశ్రమ దీక్షనిచ్చి సహాయంగా నలుగురు ఏకాంగులను నియమిస్తున్నాను. అప్పుడు పెరుమాళ్ళ కైంకర్యం నిర్విఘ్నంగ సాగుతుంది. నమ్మాళ్వార్లకు ఈ శ్రీనివాసునిసేవ అత్యంతప్రియం కనుక వారి పేరును కలిపి ఈ సేనాపతి, నాథమునుల శఠమర్షణవంశానికి చెందినందుకు పెరుమాళ్ళు, నమ్మాళ్వార్లు, నాథమునులు ముగ్గురి పేరొచ్చేలాగా **'శ్రీవేంకటనాథ శఠకోపజీయర్'** అని పేరు పెడుతున్నానని చెప్పారు.

ఇలా తిరుమలక్షేత్రానికి జీయర్‌స్వామిని ఏర్పరిచి నలుగురు ఏకాంగులను కూడా వ్యవస్థచేసి, ఆలయానికి ఈశాన్యదిశలో దాసాంజనేయస్వామి సన్నిధిలో మఠాన్ని నిర్మించి, శ్రీశైలపూర్ణులు తమకు అనుగ్రహించిన శ్రీరాములవారి తిరువారాధనామూర్తులను కూడాయిచ్చారు. శ్రీశఠకోపజీయర్‌కి బోధచేస్తూ "హనుమంతుడు శ్రీరాముని సేవలో ఎంత జాగరూకతతో ఉంటాడో, మీరు ఈ వేంకటేశుని సేవలో అప్రమత్తులై ఉంటారనే మీమఠాన్ని ఈ హనుమవద్ద ఏర్పరుస్తున్నా"మని ఆజ్ఞాపించారు శ్రీభగవద్రామానుజులు.

## రామానుజార్యదివ్యాజ్ఞా

ఇలానే, యాదవరాజుని సంబోధిస్తూ 'రాజా! ఇప్పటికే నాకు 102సంవత్సరాల వయసు. శేషజీవనాన్ని శ్రీరంగంలోనే గడపాలనుకుంటున్నాను. ఇంక నేను రాలేకపోవచ్చును. అనంతార్యుల వారి ఆధ్యక్ష్యంలో, వారి ఆజ్ఞానుసారంగ ఈ జీయర్‌స్వామి, నలుగురు

ఏకాంగులు పెరుమాళ్ళసేవలో ఉంటారు. ఆలయాల కైంకర్యవ్యవస్థను జాగ్రత్తగా నిర్వహించండి. అనంతాళ్వాన్ల అధీనంలో ఉండి సేవలు నడపండి. అవసరమైతే మార్పు-చేర్పులు దండన విధించే అధికారం కూడా వారికి పూర్తిగ ఇస్తున్నాను' అని యాదవరాజుకి కూడా శ్రీరామానుజులు హితశాసనం చేసారు.

అనంతార్యులవారు మాకు అత్యంతప్రియశిష్యులు, సర్వశాస్త్రవేత్త, శాస్త్రానుకూలమైన ఆచారవ్యవహారాలను నడిపించగల సమర్థులు. కనుక ఆచార్యపదనిర్వాహకులుగ వారిని నియమిస్తున్నాను. తాము నియమించిన పెద్దలను సమ్మానదృష్టితో వ్యవహరించమని శ్రీరామానుజులు రాజుకి సూచించారు. అప్పటికి శ్రీశైలపూర్ణులు, వారి కుమారులు కూడ పరమపదించారు. ఆ తరువాత శ్రీరామానుజులు, తిరుమలనుండి క్రింద తిరుపతికి దిగారు.

గోదాదేవి పురుషకారంగా శ్రీగోవిందరాజులను సేవించుకున్నారు శ్రీరామానుజులు. యాదవరాజు నిర్వహిస్తున్న ఆలయవ్యవస్థను చూసి చాలా సంతోషించారు రామానుజులు. అప్పుడు యాదవరాజుని దగ్గరకు పిలచి, "రాజా! శ్రీగోవిందరాజపెరుమాళ్ళు, శ్రీనివాసపెరుమాళ్ళుకూడా మునుపు కొందరి ఉపద్రవాలనుండి సురక్షితంగా మరల మనకి దక్కారు. ఏ ఉపద్రవాలు రానీయకుండా జాగ్రత్తగా పెరుమాళ్ళను, ఆలయవ్యవస్థనుకూడా రక్షించండి. ఆలయసేవలో క్రిందనుండి పైవరకు కూడా ఉండే అధికారులంతా చక్రాంకితులు మాత్రమే అర్హులు.

తదితరులకు ఎట్టి పరిస్థితిలోను ఈ ఆలయసేవలో ఏ విధమైన అధికారాన్ని ఇవ్వకుసుమా"! అని ఆదేశించారు.

'ఈ తిరుమలక్షేత్రంలోనే కాదు. వైష్ణవాలయాలన్నింటికిన్నీ ఈ నియమం వర్తిస్తుంది. వైదికమైన శైవ, శాక్తమతాలుకూడ ఆయా ఆగమాలప్రకారమున్న వ్యవస్థే ఉంటుంది. ఆయా విధానాలకి మరొకరి హస్తక్షేపం తగదు అని చాలా ఉదార హృదయంతో శాస్త్రీయవ్యవస్థను అందరూ కాపాడాల'ని ఆదేశించారు శ్రీరామానుజులు.

ఒకప్పుడు ద్వారకాక్షేత్రాన్ని విడిచి కొన్నిరోజులకి విరోధివర్గాన్ని తొలగించడానికి బయటికి వెడుతూ శ్రీకృష్ణుడు ఒక ఆజ్ఞను జారీ చేసాడు ద్వారపాలకులకు.

ఆ ఆజ్ఞారూపమైన శ్లోకమిది-

**చక్రాంకితాః ప్రవేష్టవ్యాః యావదాగమనం మమ ।**
**నాముద్రితాః ప్రవేష్టవ్యాః యావదాగమనం మమ ॥**

అంటే నేను బయటికి వెళ్ళి వచ్చేవరకు చక్రాంకితులను మాత్రమే ఈద్వారక లోనికి అనుమతించండి. చక్రాంకితులు కానివారిని అనుమతించకండి! అని శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించాడు.

అలాగే, తాము శ్రీరంగానికి ప్రయాణంచేస్తూ యాదవరాజుకి ఆలయవిషయమై ఆజ్ఞను విధించారు రామానుజులు.

అది విన్నవెంటనే శ్రీనివాసప్పెరుమాళ్, అర్చకునిపై ఆవహించి

**సర్వదేశ దశాకాలేష్వవ్యాహతపరాక్రమా ।**
**రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతామభివర్ధతామ్॥**

**రామానుజార్య దివ్యాజ్ఞా ప్రతివాసరముజ్జ్వలా।**
**దిగంతవ్యాపినీ భూయాత్ సా హి లోకహితైషిణీ॥**

“రామానుజులిచ్చిన ఈ దివ్యాజ్ఞ అన్ని సంప్రదాయాల ఆలయాలకూ వర్తిస్తుంది కనుక ఇది లోకములకు హితకారిణి. దీనిని అన్ని ఆలయాలలోను ఈనాటి నుండి అనుసంధించండి” అంటూ ఆదేశించాడు. శ్రీవైష్ణవదేవాలయాలలోనూ, శ్రీవైష్ణవుల భవనాలలోనూ ప్రతిదినం రెండుపూటలకు తక్కువలేకుండా వైష్ణవాగ్రేసరులు అనుసంధించే శ్లోకాలలోని రామానుజుల ఆజ్ఞ ఇదే సుమండీ! ప్రామాణికమైన వేంకటాచలఇతిహాసమాల, ఈ విషయాన్ని అతిస్పష్టంగా చెబుతోంది.

ఇలాగా నూటరెండేళ్ళవయస్సు నిండిన శ్రీభగవద్రామానుజులు తిరుపతిక్షేత్రం నుండి శ్రీరంగానికి బయలుదేరుతూ ముందుగ కాంచీపురం చేరారు. శ్రీరామానుజులు వస్తున్నారని తెలిసి, శ్రీకూరత్తాళ్వాన్ శ్రీరంగం నుండి కాంచికి వచ్చారు. దీర్ఘకాలానికి గురుశిష్యులకు సంయోగం ఏర్పడింది.

‘శ్రీవరదరాజస్వామి సకలఫలప్రదుడు. ఆయనను స్తోత్రంచేసి, మీరు కోల్పోయిన దృష్టిని పొందండి’ అని కూరేశులను ఆజ్ఞాపించారు

శ్రీరామానుజులు. వారి ఆజ్ఞప్రకారం 102 శ్లోకాలతో వరదరాజస్వామిని చాలా అద్భుతంగ స్తుతించారు శ్రీకూరేశులు. ఆ స్తోత్రానికి **'వరదరాజ స్తవం'** అని పేరు. శ్రీకూరేశులు ప్రాకృతనేత్రాలను కోరలేదు. పరమపదంలో నిత్యదర్శనం కావాలని కోరారు. 'అలాగే' అని కంచి వరదరాజస్వామి అర్చకముఖంగ అంగీకరించాడు. ఈ విషయం తెలిసిన శ్రీరామానుజులు 'ఏం ఇలా ప్రార్థించారు?' అని అడిగారు. అక్కడికి నేను ముందుగా వెళితే, ఆచార్యులైన మీకు స్వాగతం చేయగలను కదా! అని సరసంగ సమాధానమిచ్చారు కూరేశులు. అక్కడినుండి శ్రీరామానుజులు శ్రీరంగానికి బయలుదేరారు.

## శ్రీభగవద్రామానుజుల శ్రీరంగం రాక

చాలా సంవత్సరాల తరువాత శ్రీరామచంద్రుడు వనవాసం పూర్తిచేసి అయోధ్యకు తిరిగివచ్చినట్టు శ్రీభగవద్రామానుజులు మేల్కోట వాసం పూర్తిచేసి శ్రీరంగానికి వేంచేసారు. అప్పటికి శ్రీరంగశ్రీ, నిరుపద్రవంగా పరిణమించింది. ఉపద్రవానికి కారణమైన కుళోత్తుంగచోళుడు తన దేహాన్ని చాలించాడు. అతని కుమారుడు విక్రమచోళుడు చాలా సాత్త్వికుడు. మంచి విష్ణుభక్తుడు. ఇతడు క్రీ.శ.1117 నుండి పరిపాలకుడుగ సాగాడు.

శ్రీభగవద్రామానుజుల సన్నిధికి వచ్చి తన తండ్రి చేసిన అపరాధాలను మన్నించమని ప్రార్థించాడు. ఆ సమయంలో ఈ విక్రమచోళుడే పరిపాలకుడుగా బాధ్యతను తీసుకున్నాడు. ఇతడే

శ్రీరంగనాథుని ఆలయానికి ఐదవ ప్రాకారాన్ని కట్టించాడు. ఇంకా ఎన్నెన్నో చారిత్రకంగా ఉండే సేవలు చేసాడు. తండ్రివల్ల ఏర్పడ్డ కలంకాలని తొలగించి, మంచి సేవలు చేసిన పాలకుడని ఇతణ్ణి **'అకళంకచోళుడు'** అనే బిరుదుతో లోకం కీర్తించింది. ప్రహ్లాదుడులాగా ఇతడు వంశోద్ధారకుడుగా, విష్ణుభక్తశిఖామణిగా కూడా మెలిగాడు.

దీర్ఘకాలానికి సురక్షితంగా శ్రీరంగానికి వేంచేసిన భగవద్రామానుజులను శ్రీరంగక్షేత్రవాసులంతా సగౌరవంగా సేవించుకొన్నారు. కోల్పోయిన ప్రాణాలే తిరిగి వచ్చినట్లు భావించారు.

అప్పటికే 102 సంవత్సరాలు దాటిన వయస్సు శ్రీభగవద్రామానుజులది. అయినా వారు నిర్విరామంగా శ్రమించి ఆధ్యాత్మికంగాను, సామాజికంగాను తీర్చిదిద్ది అందించిన ఆచరణాత్మకమైన వ్యవస్థ, ఈ నాటికిన్ని సజీవంగా సాగుతోంది.

# 74 మంది
# సింహాసనాధిపతుల స్థాపన

పరమ ప్రామాణికమైన విశిష్టాద్వైత సిద్ధాంతవ్యాప్తికిని, ప్రేమపూరితమైన భగవత్తత్త్వాన్ని గురించి మారుమూలలలో ప్రచారం చేసి సందేశమందించడానికిన్ని సమర్థులైన 74 మంది ఆచార్యపురుషులను సింహాసనాధిపతులుగా స్థాపించారు శ్రీభగవద్రామానుజులు. ఆ 74 మంది మహానుభావుల పేర్లను తెలుసుకొందాం-

1. శొట్టైనంబి
2. ఎన్నాచ్చాన్
3. పిళ్లైఅప్పన్
4. పుండరీకర్
5. తెర్కాళ్వాన్
6. సుందరత్తోళుడైయాన్
7. రామానుజన్
8. పిళ్లైతిరుమలైనంబి
9. కందాడై ఆండాన్
10. నడువిలాళ్వాన్
11. గోమఠత్తాళ్వాన్
12. తిరుక్కోవలూరాళ్వాన్
13. తిరుమోకూరాళ్వాన్
14. పిళ్లైపిళ్లైఆళ్వాన్
15. నడాదూరాళ్వాన్
16. ఎంగళాళ్వాన్
17. అనంతాళ్వాన్
18. మిలగాళ్వాన్
19. నెయ్యుండాళ్వాన్
20. శెట్టలూర్‌శిరియాళ్వాన్
21. వేదాంతిఆళ్వాన్
22. కోయిలాళ్వాన్
23. ఉక్కలాళ్వాన్
24. అరణప్పురత్తాళ్వాన్
25. కిడాంబిఆచ్చాన్
26. కణియనూర్‌శిరియాచ్చాన్
27. ఈచ్చంబాడి ఆచ్చాన్
28. కొంగిలాచ్చాన్
29. ఈచ్చంబాడి జీయర్
30. తిరుమలైనల్లాన్

31. చట్టంపల్లిజీయర్
32. తిరువెళ్లరై జీయర్
33. ఆట్కొండవిల్లి జీయర్
34. తిరునగరిప్పిళ్లై
35. కారంజిసోమాజియార్
36. అలంకారవేంగడవర్
37. నంబికరుందేవర్
38. శిరుప్పళ్లిదేవరాజభట్టర్
39. పిళ్లై ఉరంధై ఉడైయార్
40. తిరుక్కురుగైపిరాన్‌పిళ్లాన్
41. పెరియకోయిల్‌వళ్లలార్
42. తిరుక్కణ్ణపురత్తైచ్చాన్
43. ఆసూరిప్పెరుమాళ్
44. మునిప్పెరుమాళ్
45. అమ్మంగిప్పెరుమాళ్
46. మారుతిప్పెరియాండాన్
47. మారొన్నిల్లామారుతిచ్చిరిఆండాన్
48. సోమాశి ఆండాన్
49. జీయరాండాన్
50. ఈశ్వరాండాన్
51. ఈయుణ్ణిపిళ్లై ఆండాన్
52. పెరియాండాన్
53. శిరియాండాన్
54. కురింజిప్పురచ్చిరియాండాన్
55. అమ్మంగిఆండాన్
56. ఆళవందారాండాన్
57. అరుళాళప్పెరుమానెంబెరుమానార్
58. తొండనూర్‌నంబి
59. మరుదూర్‌నంబి
60. మఝైయూర్‌నంబి
61. తిరుక్కురుంగుడినంబి
62. కురవనంబి
63. ముడుంబైనంబి
64. వడుగనంబి
65. వంగిపురత్తునంబి
66. శ్రీపరాంకుశనంబి
67. అమ్మంగిఅమ్మాళ్
68. పరిత్తిక్కొళ్లై అమ్మాళ్
69. ఉక్కలమ్మాళ్
70. శొట్టైఅమ్మాళ్
71. ముడుంబై అమ్మాళ్
72. కొంమాండూర్ పిళ్లై
73 కొమాండూర్ ఇళైయవిల్లి
కిడాంబిప్పెరుమాళ్
74. ఆర్కాట్టుప్పిళ్లాన్

శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రచారానికి, భగవంతుని అవిచ్ఛిన్నకైంకర్యానికిని ఆయా దివ్యక్షేత్రాలను కేంద్రంగా చూపించి 74 మంది సింహాసనాధిపతులను స్థాపించారు- శ్రీరామానుజులు.

**సంసేవితః సంయమిసప్తశత్యా**
**పీఠైశ్చతుస్సప్తతిభిస్సమేతః ।**
**అన్యైరనంతైరపి విష్ణుభక్తైః**
**ఆస్తేఽధిరంగం యతిసార్వభౌమః ॥**

ఈ వైభవశ్లోకం ప్రకారం ఏడువందలు మంది త్రిదండి యతీశ్వరులు, 74 మంది సింహాసనాధిపతులైన ఆచార్యపురుషులు, ఎంతోమంది శ్రీవైష్ణవభాగవతోత్తములు శ్రీరంగంలో ఆచార్యసార్వభౌములైన శ్రీభగవద్రామానుజులను ఆశ్రయించి వారి ఆజ్ఞప్రకారం నడుస్తూండేవారు.

శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రచారానికి భగవంతుని అవిచ్ఛిన్నకైంకర్యానికిని ఆయా దివ్యక్షేత్రాలను కేంద్రంగా చూపించి 74 మంది సింహాసనాధిపతులను స్థాపించారు- శ్రీరామానుజులు.

లక్ష్మీనాథుడునుండి ప్రారంభమై ఈ 74 సింహాసనాధిపతుల వరకు ఉండే వైభవాన్ని సూచిస్తూ పూర్వాచార్యులు ప్రసాదించిన ఒక ముక్తక శ్లోకాన్ని స్మరిద్దాం...

**లక్ష్మీనాథాఖ్యసింధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్యనీరం**
**నాథాద్రావభ్యషించత్ తదను జలజదృక్ రాఘవాభ్యాం ఝరాభ్యామ్ ।**

**గత్వా తాం యామునుఖ్యాం సరితమథ యతీన్ద్రాఖ్యపద్మాకరేంద్రం**
**సంపూర్య ప్రాణిసస్యే ప్రవహతి నితరాం దేశికేంద్రభ్రమౌఘైః ॥**

## గోదాగ్రజులైన శ్రీరామానుజులు

ఒకప్పుడు శ్రీభగవద్రామానుజులు ఆండాళ్ ప్రసాదించిన **నాచ్చియార్‌తిరుమొழ்ి** గ్రంథాన్ని కాలక్షేపం చేస్తూండగా అందులోని 9వ దశకంలోని 6వ పాశుర ప్రస్తావనం వచ్చింది. ఆ పాశురం, వారికి ఒక అందమైన కైంకర్యానికి ప్రేరణ కలిగించింది. "**నాఱు నఱుం పొழ்ిల్ మాలిరుంశోలైనంబిక్కు... నూఱు తడా నిఱైన్ద అక్కారవడిశిల్ శొన్నేన్**" అని పాశురం. శ్రీగోదాదేవి, తిరుమాలిరుంశోలై క్షేత్రంలో వేంచేసియున్న సుందరబాహు పెరుమాళ్లకి నూరు గంగాళముల పరమాన్నమును (అక్కారవడిశిల్ ప్రసాదాన్ని) సమర్పిస్తానని సంకల్పించిందే!

అయ్యో! ఆ తల్లి, అనుకొన్న కైంకర్యాన్ని నెరవేర్చిందో లేదో? అని శ్రీభగవద్రామానుజులు ఆ తిరుమాలిరుంశోలై దివ్యదేశానికి వేంచేసి ఆండాళ్ తల్లి సంకల్పించినట్లుగా పరమాన్న ప్రసాదాన్ని తయారు చేయించి నూరుగంగాళాలతో నవనీతసమేతంగా ఆ సుందరబాహుస్వామికి సమర్పించారు. ఆ తరువాత దక్షిణ దేశదివ్యయాత్ర చేసారు శ్రీరామానుజులు.

అదే క్రమంలో శ్రీవిల్లిపుత్తూర్‌లో ఆండాళ్‌తల్లిని సేవించుకొన్నారు. అప్పుడు తన సంకల్పాన్ని నెరవేర్చినందుకు సంతోషించి ఆండాళ్‌తల్లి

**"నమ్‌కోయిల్ అణ్ణా!"** అని శ్రీభగవద్రామానుజులను సంబోధించిందట. గర్భాలయంలోంచి ముందుండే అర్ధమండపంలోకి తానే వచ్చి మాలామర్యాదను చేయించిందట. ఇప్పటికీ, గోదాదేవి ఉత్సవమూర్తులు గర్భాలయంలో కాక ముందుమండపంలో అందుకే ఉంటాయి. అప్పటినుండి శ్రీభగదమానుజులకు **"గోదాగ్రజులు"** అనే ఒక అందమైన పేరు ఏర్పడింది.

## నంబినారాయణుని ఆచార్యులుగా రామానుజులు

శ్రీభగవద్రామానుజులు, బద్ధజీవులకే కాక అర్చారూపంగా భూలోకంలో వేంచేసియున్న భగవంతుడికి కూడా ఆచార్యులయ్యారు. వేదవేదాంతజ్ఞానసంపన్నులు, విష్ణుభక్తులు, ఇతరుల వైభవాన్ని చూసి ఆమోదించ గలిగే సహనం కలవారు. మంత్రం, మంత్రానికి అర్థమైన పరమాత్మయందు పరిపూర్ణమైన ప్రేమ కలవారు ఆచార్యులు. అలాంటి యోగ్యత కలవారు శ్రీభగవద్రామానుజులు. ఆచార్యత్వపూర్తి ఉన్నవారు కనుక విభిన్న స్థానాలలో అర్చారూపంగా ఉన్న భగవంతుడు కూడా వీరిని గురువుగా వరించాడు.

ముందుగా తిరుమల శ్రీనివాసుడికి "శ్రీవేదార్థసంగ్రహం" వినిపించి, శంఖచక్రాలను సమర్పించి ఆచార్యులయ్యారు శ్రీరామానుజులు. అందుకే శ్రీఅనంతాళ్వాన్లద్వారా తనకి శ్రీరామానుజుల పాదాలు హృదయసమమై దర్శనమయ్యేలా ఉచ్చమైన ఆసనంలో శ్రీభగవద్రామానుజుల శ్రీవిగ్రహాన్ని తనకు గురువుగా ప్రతిష్ఠింపచేసాడు శ్రీనివాసుడు తన ఆలయ ఈశాన్యభాగంలో, వారికి ఎదురుగానే ఇప్పటి హుండీ ఉంది.

శ్రీరంగనుండి శిష్యవర్గంతో కలసి దక్షిణదేశం బయలుదేరి ఆళ్వార్ తిరునగరిలోని నవతిరుపతి క్షేత్రాన్ని సందర్శించారు శ్రీరామానుజులు. **"తిరుక్కురుంగుడి"** దివ్యదేశానికి చేరారు. అక్కడ వేంచేసియున్న శ్రీనంబినారాయణపెరుమాళ్లను సేవించుకొని మంగళాశాసనం చేసారు.

ఎంతోమంది శిష్యులు, జ్ఞానసంపన్నులైన మహానుభావులు, పరమభాగవతులు శ్రీరామానుజులను అనుసరించియున్నారు. ఈ వైభవాన్ని చూసి నంబిపెరుమాళ్ళు కూడా చాలా ఆశ్చర్యాన్ని పొందారు. అక్కడ ఆ తిరుక్కురుంగుడి దివ్యదేశంలో కొన్నిరోజులు విడిది చేసారు శ్రీరామానుజులు. తాము తిరుమణ్‌కాప్ చేసకొన్న తరువాత శేషమైన తిరుమణ్‌కాప్ (బొట్టు)ను అనన్యనిష్ఠ కలిగిన వడుగనంబికి ధరింపచేసేవారు.

ఒక రోజు జగదాచార్యులైన శ్రీభగవద్రామానుజులకు తాను కూడా శిష్యుడుగా మారాలని సత్యసంకల్పుడైన ఆ నంబి నారాయణ్ పెరుమాళ్ళకి కుతూహలం కలిగింది. స్వామి తన అర్చావతారానికంటు ఒక హద్దు పెట్టుకొన్నాడు కదా! నేరుగా విగ్రహంనుండి మాట్లాడడు. తన నియమాన్ని పాంచరాత్రాగమశాస్త్రంలోనే స్వయంగా చెప్పాడు. కనుక స్వామి సద్వారకంగానే మాట్లాడతాడు. ఆ నంబినారాయణ స్వామియే వడుగనంబిలాంటి రూపంతో శ్రీభగవద్రామానుజుల సన్నిధికి వచ్చి తిరుమణ్‌కాప్ పెట్టించుకొన్నాడు. సాష్టాంగంగా నమస్కరించాడు.

ఆ తరువాత చాలాసేపటికి వడుగనంబిగారు వచ్చారు. శేషప్రసాదంగా ఉన్న తిరుమణికాప్ ధరింపచేయండీ! అని రామానుజులను అడిగారు. ఇందాకే పెట్టాను కదా! మళ్లీ ఎందుకు? అన్నారు శ్రీరామానుజులు. అయ్యో! నేను రానే లేదే! నాకు పెట్టలేదు అన్నారు వడుగనంబి. ఆ తిరుక్కురుంగుడినంబి పెరుమాళ్ళ నుదుట చూస్తే ఆ తిరుమణికాప్ పెట్టింది పెట్టినట్లే కనిపించింది. ఆ నంబినారాయణపెరుమాళ్లే, వడుగనంబిరూపాన్ని ధరించి శిష్యరూపంలో ఉండి మహాచార్యులైన శ్రీభగవద్రామానుజులకు పరిచర్యలను కూడా సమర్పించాడు.

భగవద్రామానుజుల వైభవాన్ని చూసి "నేను ఎన్నో అవతారాలెత్తి బద్ధజీవులను ఉజ్జీవింపచేయాలని కృషి చేసాను. కాని, నేను అనుకొన్నంతగా వాళ్ళు స్పందించలేదు. మిమ్మల్ని అంతా అనుసరిస్తున్నారే? మీదగ్గర ఏమైన మంత్రముందా ఏమిటి? అని అడిగారు నంబిపెరుమాళ్. నాదగ్గర ఆచార్యపరంపరగా లభించిన సర్వోత్కృష్టమైన మంత్రరత్నం (ద్వయమంత్రం) ఉన్నది. ఆర్తికలవారికి మా ఆచార్యులందించిన ఆ మంత్రాన్ని ఉపదేశించాను. వీరంతా భగవంతుని మంగళాశాసనపరులుగా మారారు అని చెప్పారు శ్రీరామానుజులు. అప్పుడు మంత్రోపదేశం చేసి నన్నుకూడా అనుగ్రహించండి అని ఆ పెరుమాళ్, రామానుజులను ప్రార్థించారు.

సవినయంగా శిష్యరూపాన్ని ధరించి వచ్చిన ఆ తిరుక్కురుం గుడిపెరుమాళ్ళకు శంఖచక్రాంకనం చేసి ద్వయమంత్రోపదేశం చేసారు

శ్రీరామానుజులు. అందుకే శ్రీరామానుజులవారి అష్టోత్తరశతనామ స్తోత్రంలో **"కురంగనగరీపూర్ణ మంత్రరత్నోపదేశకః"** అని ఒక అందమైన పేరున్నది కదా! ఆ పేరు ఈ వృత్తాంతాన్ని వ్యక్తం చేస్తోంది.

అలాగే మలైనాడు (కేరళప్రదేశం)లో ఉన్న ఆళ్వార్లు మంగళాశాసనం చేసిన అనంతపద్మనాభక్షేత్రం మొదలైన 13 దివ్యదేశాలను కూడా సేవించుకొని శ్రీభగవద్రామానుజులు మరల శ్రీరంగానికి వేంచేసారు.

ఉభయవేదాంతగ్రంథాలను శిష్యులకు ప్రబోధిస్తూ శేషజీవనాన్ని శ్రీరంగంలోనే గడిపారు వారు. విస్తృతంగా వైదిక సిద్ధాంతాన్ని నలుమూలల ప్రచారం చేయగలిగే దిగ్గజులైన శిష్యులను వారు తయారు చేసారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని లోకానికి అందించడానికి వ్యవస్థను కట్టుదిట్టంగా ఏర్పరిచారు.

విపులమైన సమాజాన్ని కూడా సంస్కార సంపన్నంగా తీర్చిదిద్దారు. తమకంటే పూర్వులైన శిరస్సంబంధం కల ఆచార్యులకి, తమ చరణసంబంధం కలిగియున్న శిష్యవర్గానికి మాత్రమే కాక విశాలమైన భూమండలానికే తాము చేసిన మహోన్నత కార్యాలవల్ల ఆరాధ్యులయ్యారు శ్రీభగవద్రామానుజుల. తమ చరమదశలో శిష్యులకు వారు ప్రబోధించిన ఉపదేశవాక్యాలను సుప్రసిద్ధంగా గ్రంథబద్ధంచేసారు పెద్దలు.

# ఉత్థానైకాదశి - కైశికవృత్తాంతము

భగవద్రామానుజులు తమ పీఠాన్ని నిర్వహించడానికి పరాశర భట్టర్‌ను శ్రీరంగక్షేత్రనిర్వాహకులుగా నియమించారు. వీరిని పురోహితులంటారు. వీరికి నిత్యం చేసే కైంకర్యాలతోపాటు, ఒక విలక్షణమైన కైంకర్యాన్ని కూడా రామానుజులు అప్పగించారు. కార్తిక శుక్ల ఏకాదశిని **'ఉత్థాన-ఏకాదశి'** అంటారు. ఆనాడు, పార్కడలినుండి పరమాత్మ, మేల్కొంటాడని పురాణప్రసిద్ధి.

దక్షిణదేశానికి చెందిన **కురంగనగరి** అనే పేరుగల **'తిరుక్కురుంగుడి'** దివ్యక్షేత్రంలో ఆనాడు దూరప్రాంతంనుంచి వచ్చిన దళితభక్తుడు, భగవంతుని వేల్కొల్పు పాడాడు. ఆప్రభావంతో బ్రహ్మరాక్షసుడుగ మారిన **సోమశర్మ**కు పాపవివిమోచనం కలిగించి, తరింపచేసిన **'నంపాడువాన్'** అనే ఒక దళితుని కథను వరాహపురాణంలోని 66వ అధ్యాయం, తెలియచేస్తోంది.

జాతి, కులములకు అతీతంగ భగవద్భక్తుడి వైభవాన్ని తెలిపే ఈ కథను శ్రీరంగనాథుని ఆస్థానంలో భట్టర్ చదవాలని, అలా చదివినందుకు, తద్వారా భక్తుల వైభవాన్ని చాటినందుకు ఆ భట్టర్‌వారికి బ్రహ్మరథం పట్టాలని నిర్ణయించారు.

అంటే, భగవంతుణ్ణి మోసే వాహకులు, ఆ రంగనాథుడి వాహనం మీద వారిని కూర్చోపెట్టి, భగవంతుణ్ణి తీసుకువెళ్ళినట్లుగ తిరువీధి

ఉత్సవంతో వారి గృహానికి చేరుస్తారు. ఈ మర్యాద ఆ భట్టర్‌వంశస్థులకి ఇప్పటికీ కొనసాగుతోంది.

ఈ కథని **కైశికపురాణగాథ** అంటూరు. ఆనాడు ఇది జరగడంవల్ల ఆ ఏకాదశిని కూడా **'కైశిక -ఏకాదశి'**గా కీర్తిస్తారు. ఇంతకు ఇది **మంగళ కైశిక**మనే ఒక రాగానికి పేరు. నంపాడువాన్ అనే భక్తుడు ఆ రాగంతో స్వామిని స్తుతించి, ఆ ప్రభావంతో రాక్షసుణ్ణి తరింపచేసాడని పురాణగాథ. కైశిక ఏకాదశినాడు భట్టర్‌కి సమ్మానం చేయడం ద్వారా రామానుజులవారు సమాజానికి శక్తివంతమైన సందేశాన్నిచ్చారు.

విష్ణుభక్తిపరాయణుల సహవాసం, సర్వదోషనివారకం, సర్వశ్రేయస్సులకీ మూలం. విష్ణుభక్తులను జాతి, కులములతో గుర్తించరాదు. వారి సంస్కారంతోటే వారిని గౌరవించాలి.

**ఏకాన్తీ వ్యపదేష్టవ్యో నైవ గ్రామకులాదిభిః।**

**విష్ణునా వ్యపదేష్టవ్యః** ................ ॥ ఇలాంటి ఎన్నో ప్రమాణాలు ఈ విషయాన్ని దృఢపరిచాయి.

# మధురమైన ముగింపు

**తస్మై రామానుజార్యాయ నమః పరమయోగినే ।**

**యః శ్రుతిస్మృతిసూత్రాణామన్తర్జ్వరమశీశమత్ ॥**

అన్నట్లుగా '**పరమయోగులు**' శ్రీభగవద్రామానుజులు. సమాజంలో ఉండే ప్రాణుల సుఖదుఃఖాలను తమదిగా భావించి స్పందించగలిగే వ్యక్తిని పరమయోగిగా కీర్తించాడు గీతాచార్యుడు. తమ ఆచరణద్వారా ఉపదేశం ద్వారా కూడా లోకానికి ఉజ్జీవనమార్గాన్ని చూపించి సమతామూర్తులయ్యారు శ్రీభగవద్రామానుజులు. విద్యావంతులై సమర్థులైన శిష్యులను లోకానికందించి ఇలాగా సార్థకమైన జీవనంతో శ్రీరామానుజులు 120 సంవత్సరాలు ఈ లీలావిభూతిలో వేంచేసియున్నారు.

క్రీ.శ.1017లో ఆవిర్భవించి క్రీ.శ.1137 పింగళనామ సంవత్సరం మాఘమాసం దశమీ తిథిరోజున వారు భగవత్సాయుజ్యాన్ని పొందారు. వారి చరమశ్రీవిగ్రహం, శ్రీరంగనాథునికత్యంత ప్రియం కనుక ఆ రంగనాథుని ఆజ్ఞప్రకారం శ్రీరంగంలోని వసంతమండపంలో వేంచేపుచేసారు పెద్దలు. నేటికిన్నీ '**తానానతిరుమేని**' గా శ్రీభగవద్రామానుజులను శ్రీరంగంలో మనమంతా సేవించుకోగలుగుతున్నాం.

ఇలాగా దయార్ద్రహృదయులైన శ్రీభగవద్రామానుజులు లోకానికి చేసిన మహోపకారం ఇంతా అంతా అని చెప్పలేము. వారు తీర్చిదిద్దిన స్థానాలలో నాలుగు కేంద్రాలను విశేషించి ఒక ముక్తక శ్లోకంద్వారా

పెద్దలు ప్రతిదినం స్మరించి వందనం చేస్తూంటారు. అవి- 1. శ్రీరంగం 2. కాంచీపురం 3. తిరుమల 4. తిరునారాయణపురం

**శ్రీరంగమంగళమణిం కరుణానివాసం**
**శ్రీవేంకటాద్రిశిఖరాలయకాలమేఘమ్ ।**
**శ్రీహస్తిశైలశిఖరోజ్వలపారిజాతం**
**శ్రీశం నమామి శిరసా యదుశైలదీపమ్ ॥**

తమజీవనంలో నిర్విరామంగా పరిశ్రమించి సమాజానికి ఆధ్యాత్మికంగాను సామాజికంగాను ఒక అత్యద్భుతమైన చైతన్యాన్ని కలిగించారు శ్రీభగవద్రామానుజులు. వారి అతిమానుషవైభవాన్ని గమనించిన సమసామయికులైన పెద్దలు, ఆ రామానుజులను వీరు సాక్షాత్తుగా ఆదిశేషులా? లేక పరమపదనాథుడి ప్రధానసేనాపతిగా ఉండే విష్వక్సేనులే వీరా? అసలు శ్రియఃపతియే ఈ రూపంలో ఉండి ఇంత వైభవోపేతమైన సేవను లోకానికి అందిస్తున్నాడా? అని మహాజ్ఞానులైన మహానుభావులు శ్రీభగవద్రామానుజులను, వారి నిరుపమమైన వైభవాన్ని కూడా కొనియాడేవారట.

**శేషో వా సైన్యనాథో వా శ్రీపతిర్వేతి సాత్త్వికైః ।**
**వితర్క్యాయ మహాప్రాజ్ఞైర్భాష్యకారాయ మంగళమ్ ॥**

ఈ శ్లోకమావిషయాన్ని తెలియజేస్తుంది. ఇంతటి వైభవంకల శ్రీభగవద్రామానుజులు అవతరచించి వెయ్యేండ్లు నిండుతున్నాయి.

సమతామూర్తులైన ఆ మహనీయుల సహస్రాబ్ది మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంలో వారి వైభవం మనవాళ్ళందరికి తెలియాలి.

ఆ దిశలో ఈ చిన్న చరిత్రగ్రంథం మార్గదర్శకం కాగలదని ఆశిస్తున్నాం.

## సహస్రాబ్ది సందర్భంగ సమతామూర్తి

భగవద్బంధువులారా!

ఇంతటి మహోదాత్తమైన చరిత్రగల శ్రీభగవద్రామానుజుల విషయంలో మనమంతా కృతజ్ఞులమై ఉండాలి కదా! ఆ కృతజ్ఞతను సమర్పించడానికే మన ఆచార్యులైన శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారు, శ్రీరామానుజుల సంబంధ కలిగియున్న మనందరిని కలుపుకుంటూ సమతామూర్తిస్ఫూర్తికేంద్రాన్ని నిర్మిస్తున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి సమీపంలో ఉన్న, శ్రీరామనగరంలోని విశాలమైన జీవాప్రాంగణంలో దివ్యసాకేతంలో వేంచేసియున్న పెరుమాళ్ళకు సమ్ముఖముగ 216 అడుగుల శ్రీరామానుజుల పంచలోహమయ విగ్రహాన్ని 2017వ సం॥లో ఆస్తికలోకమంతా దర్శించబోతోంది. శ్రీభగవద్రామానుజులు ఈ లోకాన్ని ఉజ్జీవింపచేయడానికి 120 సంవత్సరాలు ఈ లీలావిభూతిలో వేంచేసి

ఉన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, కృతజ్ఞతగ 120 కిలోల స్వర్ణమయమూర్తిని ఆరాధ్యంగ వేంచేపుచేసుకోవాలని ఆచార్యులు సంకల్పించారు.

పరమవైదికమైన విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని లోకానికందించడానికి కేంద్రాలుగా 108 దివ్యదేశాలను వినియోగించారు శ్రీరామానుజులు. ఆ సమతామూర్తికి చుట్టూ 108 ఆ దివ్యదేశ ఆలయాలను కూడా భవిష్యత్తులో మనం సేవించుకుంటాం. సమతామూర్తులైన ఆ భగవద్రామానుజులకి సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని కూడా ఆధునిక పరికరాలద్వారా తెలుసుకునే మంచి అవకాశం మనకి ఏర్పడుతోంది. ఇలాంటి పవిత్రమైన భగవద్రామానుజుల సేవలో మనమంతా అన్వయించి, వారి అనుగ్రహాన్ని పొందుదాం!

జై శ్రీమన్నారాయణ!